STV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక  తెలుగు దినపత్రిక

సంపుటి: 19 | సంచిక: 114 | ఎడిటర్ : విక్రం కుమార్ | శుక్రవారం 20 ఫిబ్రవరి 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |

సమయం
విలేకరులు కావలెను
ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

# ఏఐ మనల్ని శాసించొద్దు..

## మనమే ఏఐని శాసించాలి



- ఏఐ అంటే కేవలం టెక్నాలజీ కాదు.. అదొక పరివర్తన శక్తి!
- విధ్వంసానికి తావులేకుండా 'మానవ్ విజన్'తో ముందుకు..
- 'ఇండియా ఏఐ సమ్మిట్'లో ప్రధాని మోడీ పిలుపు

4

# డిజిటల్ రంగంలో భారత్ విప్లవాత్మక మార్పులు

- అధికవడ్డీ రుణాలపై వడ్డీ తగ్గింపు..
- ఆవిష్కరణలు ఆర్థిక వ్యవస్థ వృద్ధికి తోడ్పాటు
- ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో టెక్ దిగ్గజాల వెల్లడి



4



# 'ప్రజల తెలంగాణే' కాంగ్రెస్ కార్యాచరణ

## ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

- మున్సిపల్, స్థానిక ఎన్నికల విజయంపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులకు అభినందన
- మేడారం చరిత్రపై ఆసక్తి చూపిన రాహుల్ గాంధీ.. సీతక్కకు ప్రత్యేక ప్రశంసలు
- మేడారం వీరగాథపై సినిమా తీయాలని సూచన!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** సమానత్వంతో కూడిన తెలంగాణ నిర్మాణం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, 'ప్రజల తెలంగాణ' లక్ష్యాన్ని సాధించే దిశగా కార్యాచరణను రూపొందించినట్లు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. సామాజిక సంక్షేమం, ఆర్థిక సాధికారత, ప్రతి పౌరుడికి న్యాయం అందించడం తమ ప్రధాన సంకల్పమని ఆయన వెల్లడించారు. ఢిల్లీలోని మల్లికార్జున ఖర్గే నివాసంలో తెలంగాణ కాంగ్రెస్‌కు సంబంధించిన కీలక సమీక్ష సమావేశం జరిగింది. పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ కూడా పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు పలువురు మంత్రులు శ్రీధర్ బాబు, కోమటి రెడ్డి వెంకట రెడ్డి, దామోదర రాజనర్సింహా, అడ్లూరి లక్ష్మణ్, అజహరుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీతక్క, కొండా

మిగతా 2 లో




# 26 నుంచి తెలంగాణ బడ్జెట్ సమావేశాలు

తొలిరోజు గవర్నర్ ప్రసంగంతో ప్రారంభం

28న బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న భట్టి

2



# ప్రధాని అవుతావు

ప్రియాంక గాంధీకి బాబా దీవెనలు

4



# దక్షిణ మండల విద్యుత్ సంస్థలో కొత్త కనెక్షన్ల అవినీతి

- 8మంది ఇంజనీర్లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు
- తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం

తెలంగాణ దక్షిణ మండల విద్యుత్ సంస్థలో అవినీతికి పాల్పడిన అధికారులపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. డిజిటల్ చెల్లింపుల ద్వారా లంచాలు తీసుకున్న వ్యవహారం బయటపడటంతో 8 మంది ఇంజినీర్లపై సస్పెన్షన్ వేటు పడింది.. విజిలెన్స్ విచారణలో అవినీతి ఆరోపణలు నిజమని తేలడంతో ఈ చర్యలు తీసుకుంది. ఈ ఘటన విద్యుత్ శాఖలో తీవ్ర చర్చకు దారి తీసింది. ప్రజలకు సేవలందించే కీలక విభాగంలో అవినీతి చోటుచేసుకోవడం ఆందోళనకరంగా మారింది.

2

# పోలీసులూ.. జాగ్రత్త



## వచ్చేది మా ప్రభుత్వమే!

- బలం లేని చోట కాంగ్రెస్ ఎలా గెలుస్తుంది? రేవంత్ సమాధానమివ్వాలి
- ఆదిలాబాద్ జైలులో బాల్క సుమన్‌కు పరామర్శ..
- సర్కార్ అరాచకాలపై నిప్పులు

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, ప్రజాతీర్పును కాలరాస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థా యిలో ధ్వజమెత్తారు. ఆదిలాబాద్ జైలులో ఉన్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను గురువారం పరామర్శించిన ఆయన, అనంతరం జైలు వెలుపల మీడియాతో మాట్లా డుతూ ప్రభుత్వంపై, పోలీసు అధికారులపై నిప్పులు చెరి గారు.

3



# ఉచిత పథకాలపై మరోమారు సుప్రీం సీరియస్

4

# దేవ్‌జీ లక్ష్యంగా కూంబింగ్



2

## కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్

### ఐదురుగు మావోలు మృతి చెందినట్లు గుర్తింపు

ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాల కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతిచెందారు. మావోయిస్టు అగ్రనేత, ఆ పార్టీ కార్యదర్శి దేవ్ జీ లక్ష్యంగా కర్రెగుట్టల అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. కర్రెగుట్టల్లో తలదాచుకున్న మావోయిస్టులు.. ఈ విషయాన్ని గమనించి భద్రతా బలగాలపైకి కాల్పులు జరిపారు.

# అధికవడ్డీ రుణాలపై వడ్డీ తగ్గింపు



- ఏటా 2వేల కోట్లు ఆదా అయ్యేలా చర్యలు
- మైనింగ్ శాఖలో 33 శాతం ఆదాయం
- ఎక్సైజ్ శాఖలో 24 శాతం ఆదాయం
- ఒక్క ఓటుతో ఎన్నో పథకాలు చేపట్టాం
- వైసీపీ నెవర్ ఎగైన్.. కూటమి వన్స్ ఎగైన్'
- జగన్ ప్రమాదకరమని ప్రచారం జరగాలి
- అసెంబ్లీలో బడ్జెట్ సమాధానంలో పయ్యావుల కేశవ్

5




# 26 నుంచి తెలంగాణ బడ్జెట్ సమావేశాలు

## తొలిరోజు వర్నర్ ప్రసంగంతో ప్రారంభం

## 28న బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న భట్టి

**హైదరాబాద్, ఫిబ్రవరి 19 :** తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తేదీ ఖరారైంది. ఈనెల 26 నుంచి శాసనసభ సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి రోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగించనున్నారు. మరుసటి రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగనుంది. ఫిబ్రవరి 28న అసెంబ్లీలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. సారి సభను 10 నుంచి 15 రోజులపాటు నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. బడ్జెట్ రూపకల్పనపై సర్కార్ కసరత్తు ముమ్మరం చేసింది. ఇప్పటికే ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో శాఖల వారీగా ప్రీ బ్జడెట్ సమావేశాలను పూర్తి చేశారు. అన్ని శాఖల మంత్రులు, అధికారులతో మంత్రి భట్టి విక్రమార్క సమీక్షలు నిర్వహించారు. ఈసారి బ్జడెట్‌లో సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేయనున్నట్లు తెలుస్తోంది. రైతు సంక్షేమం, మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి వంటి ఆరు గ్యారంటీల అమలుకు భారీగా నిధులు కేటాయించే అవకాశం ఉంది. కొత్త సంక్షేమ పథకాలు, నీటిపారుదల, మౌలిక సదుపాయాలు, పట్టణాభివృద్ధి వంటి అంశాలపైనా ప్రభుత్వం దృష్టి సారించనుంది. ఈసారి అసెంబ్లీ సమావేశాల్లో పెన్షన్ల విషయంలో కీలక నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. ఇక, ఈనెల 23న సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరుగనుంది. ఈ కేబినెట్‌లో బ్జడెట్ సమావేశాలపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

# పంజాగుట్ట చట్నీస్ మెట్ల వ్యవహారం

## హైడ్రా జోక్యంతో పరిష్కారం




**హైదరాబాద్, ఫిబ్రవరి 19 :** హైదరాబాద్‌లోని చట్నీస్ పంజాగుట్ట బ్రాంచ్‌లో దశాబ్ద కాలంగా నెలకొన్న వివాదానికి హైడ్రా అధికారులు తెరదించారు. చట్నీస్ హోటల్ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా మూసివేసిన మెట్ల మార్గాన్ని హైడ్రా అధికారులు గురువారం తెరిపించారు. పదేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఈ సమస్యపై హైడ్రా తీసుకున్న నిర్ణయం స్థానికంగా పెద్ద చర్చకు దారితీసింది. పంజాగుట్టలోని చట్నీస్ హోటల్ నిర్వాహకులు భవనంలోని పై అంతస్తులకు వెళ్లే మెట్ల మార్గాన్ని నిబంధనలకు విరుద్ధంగా మూసివేసి అడ్డంకులు సృష్టించారని బాధితులు ఆరోపించారు. ముఖ్యంగా కరోనా లాక్‌డౌన్ సమయం నుంచి పైఅంతస్తుల్లోని ఇతర యజమానులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, పూర్తిగా తమ గుప్పిట్లోకి తీసుకున్నారని తెలిపారు. గత పదేళ్లుగా భవనంలోని ఇతర యజమానులు తమ వ్యాపారాలకు, రాకపోకలకు ఆటంకం కలుగుతోందని జీహెచ్‌ఎంసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని తెలిపారు. అయితే ఈ సమస్యపై బాధితులు ఇటీవల హైడ్రా అధికారులను ఆశ్రయించారు. ఫిర్యాదును స్వీకరించిన హైడ్రా బృందం ఇవాళ క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, వెంటనే ఆ మెట్ల మార్గాన్ని తెరిపించారు. హైడ్రా రాకతో తమ సమస్య పరిష్కారానికి మార్గం సుగమం అయిందంటూ బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# గద్దర్ జ్యూరీ కమిటీలో మార్పు

## స్పెషల్ అవార్డ్స్' విభాగం జ్యూరీ చైర్మన్‌గా తమ్మారెడ్డి




**హైదరాబాద్, ఫిబ్రవరి 19:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సినిమా రంగానికి ఇచ్చే అత్యున్నత పురస్కారాలైన గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ ప్రక్రియను వేగవంతం చేసింది. ఈ క్రమంలో జ్యూరీ కమిటీలో కీలకమైన మార్పు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్‌లో భాగంగా ఇచ్చే 'స్పెషల్ అవార్డ్స్' విభాగం జ్యూరీ చైర్మన్‌గా ప్రముఖ నిర్మాత, విశ్లేషకుడు తమ్మారెడ్డి భరద్వాజాను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నియమించింది. ఇప్పటి వరకు ఈ బాధ్యతల్లో ఉన్న లెజెండరీ దర్శకుడు కె. రాఘవేంద్రరావు స్థానంలో ఇప్పుడు తమ్మారెడ్డి భరద్వాజ బాధ్యతలు స్వీకరించనున్నారు. చలనచిత్ర పరిశ్రమలో తమ్మారెడ్డికి ఉన్న సుదీర్ఘ అనుభవం, సామాజిక అంశాలపై ఆయనకున్న అవగాహనను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రజా గాయకుడు గద్దర్ స్మారకార్థం తెలంగాణ ప్రభుత్వం ఈ అవార్డులను ప్రవేశపెట్టింది. గద్దర్ పేరుతో ఇస్తున్న ఈ అవార్డులు తెలుగు చిత్ర పరిశ్రమలో నూతన ఉత్తేజాన్ని నింపనున్నాయి. ముఖ్యంగా తెలంగాణ సంస్కృతి, కళలను ప్రతిబింబించే చిత్రాలకు ఈ అవార్డులలో ప్రాధాన్యత దక్కే అవకాశం ఉంది. గతంలో ఉన్న నంది అవార్డుల స్థానంలో ఈ నూతన అవార్డులను ప్రతి ఏడాదీ అందించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. 2024 – 25 సంవత్సరంలో విడుదలైన సినిమాలలో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన నటీనటులు, సాంకేతిక నిపుణులను ఎంపిక చేయనున్నట్లు సమాచారం.

# 'ప్రజల తెలంగాణ' లక్ష్యమే కాంగ్రెస్ కార్యాచరణ

మొదటి పేజీ తరువాయి



సురేఖ, ఉత్తమ్ కుమార్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రోగ్రెస్ రిపోర్ట్, పార్టీ ప్రస్తుత పరిస్థితులు, ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలు, భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలపై సమగ్రంగా చర్చ జరిగింది.సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అభినందించారు. ముఖ్యంగా తెలంగాణ మున్సిపల్ ,స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన ఘనవిజయం నేపథ్యంలో ఈ సమీక్ష సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకున్నామని, ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ కచ్చితంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశానికి సంబంధించిన వివరాలను మల్లికార్జున ఖర్గే తన అధికారిక ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఘనవిజయం సాధించిందని, రాష్ట్ర నాయకులు, మంత్రులతో కలిసి సమగ్ర సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ప్రజల ఆశయాలను నెరవేర్చే దిశగా తదుపరి కార్యాచరణపై చర్చించామని, సామాజిక సంక్షేమం, ఆర్థిక సాధికారత, అందరికీ న్యాయం అనే లక్ష్యాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రతి పౌరుడి ఆకాంక్షలను సాకారం చేస్తూ సమగ్ర తెలంగాణ నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. సుమారు 2 గంటలపాటు భేటీ కొనసాగింది. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. సీఎం, మంత్రులు, నాయకులతో సమగ్ర సమీక్ష నిర్వహించాం. సామాజిక సంక్షేమం, ఆర్థిక సాధికారత, అందరికీ న్యాయం చేయడంతో పాటు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నాం. ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం అని ఖర్గే పేర్కొన్నారు. ఈ సమావేశంలో మేడారం జాతరను ఘనంగా నిర్వహించినందుకు మంత్రి సీతక్కను కాంగ్రెస్ అగ్రనేతలు అభినందించారు. ఆదివాసీల అతిపెద్ద జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం జాతరపై సుమారు పది నిమిషాల పాటు చర్చ జరిగింది. సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ.. మేడారం జాతర చరిత్ర, ప్రాశస్త్యం గురించి మంత్రి సీతక్కను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమ్మక్క-సారలమ్మల పోరాట గాథను ఖర్గే, రాహుల్ ఆసక్తిగా విన్నారు. సమ్మక్క ? సారలమ్మల చరిత్రను దేశవ్యాప్తంగా చాటేందుకు సినిమా తీయాలని రాహుల్ గాంధీ సూచించారు. పార్టీ సమావేశంలో మంత్రి సీతక్క, రాహుల్ గాంధీ మధ్య సరదా సంభాషణ జరిగింది. మేడారం జాతరకు ఆహ్వానిస్తే తాము తప్పకుండా హాజరయ్యేవారమని రాహుల్ గాంధీ అన్నారు. 'ఆహ్వానిస్తే తాను కూడా తల్లుల దర్శనానికి వచ్చే వాడిని' అని మల్లికార్జున్ ఖర్గే తెలిపారు. అయితే సమయాభావం వల్ల వ్యక్తిగతంగా ఆహ్వానించలేకపోయినట్లు మంత్రి సీతక్క వివరించారు. వచ్చే జాతరకు తప్పకుండా అధికారిక ఆహ్వానం అందిస్తామని సీతక్క అన్నారు. 'ఆహ్వానం అందితే తప్పకుండా వస్తాము' అని రాహుల్ గాంధీ, ఖర్గే హామీ ఇచ్చారు.

# కృత్రిమ మేధ ఆవిష్కరణలకు వేదికగా తెలంగాణ

## ఏఐ యూనివర్సిటీ, ఏఐ హబ్‌ల ఏర్పాటుకు బడ్జెట్ కేటాయింపులు

## ఇంపాక్ట్ సమ్మిట్ రౌండ్ టేబుల్ సమావేశంలో శ్రీధర్ బాబు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 :** కృత్రిమ మేథకు సంబంధించిన నూతన ఆవిష్కరణల వేదికగా నిలుస్తున్న తెలంగాణా రాష్ట్రం అమెరికా పెట్టుబడిదారులకు అనేక అవకాశాలను కల్పిస్తోందని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ప్రతిష్టాత్మక 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్-2026' లో భాగంగా దేశ రాజధానిలో అమెరికా-ఇండియా వాజిజ్య మండలి ప్రతినిధులతో జరిగిన రౌండ్ టేబుల్ సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేసారు.ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, అత్యున్నత టెక్నాలిజి ఎకోసిస్టం రాష్ట్రంలో నూతన అవకాశాలను సృష్టించిందని శ్రీధర్ బాబు తెలిపారు. అమెరికా టెక్ దిగ్గజాలతో పబ్లిక్ ప్రేవేట్ భాగస్వామ్యాన్ని ఇప్పటికే తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని చెప్పారు. ముందు చూపుతో కూడిన స్థిరమైన విధానాలు ఏఐ పరిశోధనలకు ఆలంబనగా మారాయని శ్రీధర్ బాబు వివరించారు. ప్రజా సేవలపై రియల్ టైం పర్యవేక్షణతో కృత్రిమ మేథ వినియోగాన్ని పెంచిన విషయాన్ని ఆయన వెల్లడించారు. ఆరోగ్యం, వ్యవసాయం, విద్య, పట్టణాభివృద్ధి వంటి రంగాలపై దృష్టి సారించిన ఇన్నోవేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణను ఎఐ రంగంలో అగ్రగామిగా నిలబెట్టింది. కృత్రమ మేథ ఆవిష్కరణలకు ప్రపంచంలోనే ఒక ముఖ్య కేంద్రంగా నిలబడేలా తెలంగాణాను తీర్చుదిద్దు తున్నామని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రధర్ బాబు వెల్లడించారు. వేగంగా దూసుకుపోతున్న టెక్నాలజి ప్రపంచంతో పోటీ పడాలన్నదే



తమ సంకల్పం అని ఆయన అన్నారు. ఏఐ యూనివర్సిటీ, ఏఐ హబ్ ల ఏర్పాటు, ప్రతిభావంతులతో కూడిన స్కిల్ ఫోర్స్ ను అందుబాటులోకి తెచ్చేందుకు త్వరలో ప్రవేశ పెట్టనున్న రాష్ట్ర బడ్జెట్ లో అత్యంత ప్రాధాన్యతనిస్తాం అని వెల్లడించారు.

# దక్షిణ మండల విద్యుత్ సంస్థలో అవినీతి


- 8మంది ఇంజనీర్లను సస్పెండ్ చేస్తే ఉత్తర్వులు
- తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం



**హైదరాబాద్, ఫిబ్రవరి 19:** దక్షిణ మండల విద్యుత్ సంస్థలో అవినీతి ఆరోపణలపై తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో మొత్తం 8 మంది ఇంజినీర్లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. విజిలెన్స్ విచారణలో అవినీతి ఆరోపణలు నిజమని తేలడంతో ఈ చర్యలు తీసుకుంది. ఈ ఘటన విద్యుత్ శాఖలో తీవ్ర చర్చకు దారి తీసింది. ప్రజలకు సేవలందించే కీలక విభాగంలో అవినీతి చోటుచేసుకోవడం ఆందోళనకరంగా మారింది. విద్యుత్ శాఖలో అవినీతి జరుగుతోందన్న ఆరోపణలపై కొంతకాలంగా అనేక ఫిర్యాదులు అందాయి. మొత్తం 150కు పైగా ఫిర్యాదులు అందిన నేపథ్యంలో.. విజిలెన్స్ అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. ఈ విచారణలో భాగంగా అధికారులు పలు ఆధారాలను సేకరించారు. ఫిర్యాదుల్లో పేర్కొన్న అంశాలను పరిశీలించి సంబంధిత ఇంజినీర్ల పాత్రను గుర్తించారు. ఈ విచారణలో అవినీతి జరిగినట్లు స్పష్టమైన ఆధారాలు లభించాయి. విజిలెన్స్ విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇంజినీర్లు ఫోన్ పే, గూగుల్ పే వంటి డిజిటల్ చెల్లింపు మార్గాల ద్వారా లంచాలు తీసుకున్నట్లు అధికారులు గుర్తించారు. సాధారణంగా నగదు రూపంలో జరిగే లంచాల స్థానంలో డిజిటల్ చెల్లింపులను ఉపయోగించడం గమనార్హం. సేవలు అందించేందుకు, ఫైళ్లను త్వరగా పరిష్కరించేందుకు, కొత్త కనెక్షన్లు ఇచ్చేందుకు 8 మంది అధికారులు లంచాలు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. డిజిటల్ చెల్లింపుల ద్వారా జరిగిన లావాదేవీలను అధికారులు సాంకేతికంగా పరిశీలించి ఆధారాలు సేకరించారు. సస్పెండ్ అయిన వారిలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్లు , అసిస్టెంట్ ఇంజినీర్లు, సబ్ ఇంజినీర్లు ఉన్నారు. మొత్తం 8 మంది అధికారులపై సస్పెన్షన్ వేటు పడింది. వారిపై మరింత శాఖాపరమైన విచారణ కూడా చేపట్టే అవకాశం ఉంది. అవినీతి విషయంలో తెలంగాణ సర్కార్ కఠిన వైఖరి అవలంభిస్తోంది. ప్రజలకు సేవలందించే ప్రభుత్వ శాఖల్లో అవినీతి సహించమని ప్రభుత్వం స్పష్టం చేసింది. అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ కేసులో మరికొందరి పాత్ర కూడా ఉండే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో మరిన్ని చర్యలు తీసుకునే అవకాశం ఉంది. విద్యుత్ శాఖలో పారదర్శకత పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచాలు డిమాండ్ చేస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. అవినీతి నిర్మూలనకు ప్రజల సహకారం అవసరమని తెలిపారు.

# దేవ్‌జీ లక్ష్యంగా కూంబింగ్

- కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్
- ఐదురుగు మావోలు మృతి చెందినట్లు గుర్తింపు



**రాయపూర్, ఫిబ్రవరి 19:** ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాల కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతిచెందారు. మావోయిస్టు అగ్రనేత, ఆ పార్టీ కార్యదర్శి దేవ్ జీ లక్ష్యంగా కర్రెగుట్టల అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. కర్రెగుట్టల్లో తలదాచుకున్న మావోయిస్టులు.. ఈ విషయాన్ని గమనించి భద్రతా బలగాలపైకి కాల్పులు జరిపారు. వెంటనే భద్రతా బలగాలు సైతం ఎదురుకాల్పులకు దిగాయి. ఇరువైపులా నుంచీ హోరాహోరీగా కాల్పులు జరిగాయి. కొద్దిసేపటి తర్వాత మావోయిస్టుల వైపు నుంచి కాల్పులు ఆగిపోయాయి. ఆ ప్రాంతంలో ఐదుగురు మావోయిస్టుల మృతదేహాలను భద్రతా బలగాలు గుర్తించాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని భద్రతా బలగాలు వెల్లడించాయి. మృతుల్లో అగ్రనేతలు ఉండవచ్చని భద్రతా దళాలు భావిస్తున్నాయి. మధ్యప్రదేశ్ నుంచి కర్రెగుట్టల్లోకి మావోలు ప్రవేశించారంటూ నిఘా వర్గాలకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో నిఘా వర్గాల సమాచారం మేరకు భద్రతా బలగాలు.. ఈ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టాయి. మరోవైపు దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్ గడువు మరికొన్ని రోజుల్లో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఆ లక్ష్యం దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. ఇప్పటికే వందలాది మంది మావోయిస్టులు మృతిచెందగా.. వేలాది మంది వివిధ రాష్ట్రాల ప్రభుత్వాల ఎదుట లొంగిపోయారు. పలువురు మావోలను ప్రభుత్వం ఇప్పటికే అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం తెలంగాణకు చెందిన 15మంది మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నారు. ఆ జాబితాలో రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, మావోయిస్టు కీలక నేత ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, పుసునూరి నరహరి అలియాస్ సంతోష్, ముప్పిడి సాంబయ్య, వార్త శేఖర్, జోడే రత్నభాయి, బడే చొక్కారావుల కోసం భద్రతా బలగాలు జల్లెడ పడుతున్నాయి. ఇక ఈ రెండేళ్లలో 588 మంది మావోయిస్టులు తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోయినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

# బడ్జెట్‌లో నిధులు ఇవ్వాల్సిందే!

- రెండేళ్లుగా తెలంగాణ ప్రజలను నిట్టనిలువునా మోసం చేశారు
- మహిళల 2500, రైతుబంధు 15 వేలు, పెన్షన్ల పెంపు ఏమైంది?
- హామీల అమలుపై 'హస్తం' సర్కార్‌కు కేటీఆర్ అల్టిమేటం
- సీఎం రేవంత్‌కు ఘాటైన లేఖ




**హైదరాబాద్, ఫిబ్రవరి 19:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సగం కాలం పూర్తవుతున్నా, ఆరు గ్యారెంటీలతో సహా ఎన్నికల వేళ ఇచ్చిన 420 హామీల్లో 5 శాతం కూడా అమలు చేయలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. త్వరలో ప్రవేశపెట్టనున్న 2026-27 బడ్జెట్‌లోనైనా ఈ హామీల అమలుకు అవసరమైన పూర్తి నిధులను కేటాయించి, ప్రభుత్వం తన నిజాయితీని చాటుకోవాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన గురువారం ఒక బహిరంగ లేఖ రాశారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు ప్రజలకు 'బాకీ కార్డులు' మిగిల్చిందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. "నాడు పీసీసీ అధ్యక్షుడిగా తొలి కేబినెట్‌లోనే ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామన్న హామీ ఏమైంది? గడిచిన 25 నెలల్లో ఒక్క మహిళకైనా మహాలక్ష్మి పథకం కింద 2500 రూపాయలు అందాయా?" అని ప్రశ్నించారు. పెన్షన్లను 4 వేలకు పెంచుతామన్న హామీ, కల్యాణ లక్ష్మి కింద తులం బంగారం వంటి వాగ్దానాలను అమలు చేయకపోవడం ఆడబిడ్డలను వంచించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణను దేశానికే ధాన్యాగారంగా మార్చిన కేసీఆర్ హయాంలోని రైతుబంధును 15 వేలకు పెంచుతామని చెప్పి, ఇప్పుడు పాత బకాయిలు కూడా చెల్లించకుండా అన్నదాతలకు కాంగ్రెస్ వెన్నుపోటు పొడిచిందని కేటీఆర్ మండిపడ్డారు. రైతులు, కౌలు రైతులు, రైతు కూలీల ఖాతాల్లో వెంటనే నిధులు జమ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రెండేళ్లలో 2 లక్షల ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి వంటి హామీలు గంగలో కలిశాయని, జాబ్ క్యాలెండర్ పేరుతో యువత గొంతు కోశారని విమర్శించారు. ప్రజాపాలన పేరిట అటెన్షన్ డైవర్ట్ చేసే కుట్రలను తెలంగాణ సమాజం గమనిస్తోందని కేటీఆర్ హెచ్చరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. "ఈ బడ్జెట్‌లోనైనా ఇచ్చిన ప్రతి హామీకి లెక్కగట్టి నిధులు కేటాయించాలి. లేనిపక్షంలో తెలంగాణ సమాజం ఓపిక పట్టే ప్రసక్తే లేదు. ప్రభుత్వంపై ప్రజల తరపున ఒత్తిడి పెంచి, మోసకారి కాంగ్రెస్‌ను అసెంబ్లీ లోపల, బయటా నిలదీస్తాం" అని కేటీఆర్ తన లేఖలో ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# పోలీసులూ తస్మాత్ జాగ్రత్త

## వచ్చేది మా ప్రభుత్వమే!

- బలం లేని చోట కాంగ్రెస్ ఎలా గెలుస్తుంది? రేవంత్ సమాధానమివ్వాలి
- ఆదిలాబాద్ జైలులో బాల్క సుమన్‌కు పరామర్శ..
- సర్కార్ అరాచకాలపై నిప్పులు



**ఆదిలాబాద్, ఫిబ్రవరి 19:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, ప్రజాతీర్పును కాలరాస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదిలాబాద్ జైలులో ఉన్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను గురువారం పరామర్శించిన ఆయన, అనంతరం జైలు వెలుపల మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై, పోలీసు అధికారులపై నిప్పులు చెరిగారు. క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజారిటీ (14/22) ఉన్నప్పటికీ, మంత్రి వివేక్ వెంకటస్వామి అండతో కాంగ్రెస్ అరాచకాలకు పాల్పడిందని ఆరోపించారు. చైర్మన్ ఎన్నిక జరగకుండా పోలీసులే బందోబస్తు లేకుండా చేశారని, దళిత, గిరిజన మహిళా కౌన్సిలర్లపై దాడులు జరుగుతుంటే అధికారులు ప్రేక్షక పాత్ర వహించారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులపైనే దాడులు చేసి, రివర్స్‌లో బాల్క సుమన్‌పై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### పోలీసులకు సీరియస్ వార్నింగ్

కొందరు పోలీసు అధికారులు పోస్టింగ్‌ల కోసం కాంగ్రెస్ నేతలకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని హరీష్ రావు విమర్శించారు. "వినాశకాలే విపరీత బుద్ధి.. పోలీసులూ తస్మాత్ జాగ్రత్త! రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే, అప్పుడు ప్రతి ఒక్కరి లెక్కా తేలుస్తాం, ఎవరినీ వదిలిపెట్టం" అని ఆయన హెచ్చరించారు. జనగామ, ఇబ్రహీంపట్నం, ఆమనగల్‌లో కూడా బలవంతంగా ఓటింగ్ అడ్డుకున్నారని, రాహుల్ గాంధీ చెప్పే రాజ్యాంగం ఇదేనా? అని నిలదీశారు.

### గవర్నర్ జోక్యం చేసుకోవాలి

రాష్ట్రంలో జరుగుతున్న ఈ అరాచక పర్వంపై గవర్నర్ స్పందించి, క్యాతన్‌పల్లి ఘటనపై నివేదిక తెప్పించుకోవాలని హరీష్ రావు కోరారు. బాల్క సుమన్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని, అధికార అహంకారంతో వ్యవహరిస్తున్న వారికి కాలమే సమాధానం చెబుతుందని పేర్కొన్నారు. ఈ పరామర్శలో హరీష్ రావుతో పాటు ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, మాజీ మంత్రి జోగు రామన్న తదితరులు పాల్గొన్నారు.

# జోగిపేట బస్టాండ్‌లో భారీ చోరీ

- బస్సు ఎక్కుతున్న మహిళ బ్యాగులో బంగారం చోరీ
- ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు



**సంగారెడ్డి, ఫిబ్రవరి 19:** సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో పట్టపగలే భారీ చోరీ జరిగింది. ఓ శుభకార్యానికి వెళ్తున్న వృద్ధురాలిని లక్ష్యంగా చేసుకున్న దుండగులు.. ఆమె బ్యాగులోని 16 తులాల బంగారాన్ని అత్యంత చాకచక్యంగా అపహరించారు. అల్లాదుర్గానికి చెందిన చెగురి లక్ష్మి అనే వృద్ధురాలు.. హైదరాబాద్‌లోని తన మేనకోడలి కుమారుడి వివాహానికి హాజరయ్యేందుకు బయలుదేరింది. క్రమంలో అల్లాదుర్గం నుంచి జోగిపేట బస్టాండ్‌కు చేరుకున్న ఆమె.. అక్కడ దిగి, తన బంధువుతో కలిసి హైదరాబాద్ వెళ్లే మరో బస్సు ఎక్కేందుకు సిద్ధమైంది. అయితే బస్సు ఎక్కుతున్న సమయంలో ప్రయాణికుల రద్దీని అదునుగా చేసుకున్న గుర్తు తెలియని దుండగుడు.. ఆమె వద్ద ఉన్న బ్యాగు నుంచి 16 తులాల బంగారు ఆభరణాలను దొంగిలించి పరారయ్యాడు. ఈ భారీ చోరీ ఘటన స్థానికంగా కలకలం రేపింది. చోరీకి పాల్పడిన వ్యక్తిని గుర్తించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. బంగారం పోయిందని గుర్తించిన బాధితురాలు.. కన్నీరుమున్నీరుగా విలపిస్తూ జోగిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బస్టాండ్ ఆవరణ, పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నారు. అనుమానిత వ్యక్తుల కదలికల ఆధారంగా నిందితుడిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. బస్టాండ్‌లు, రద్దీ ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ముఖ్యంగా విలువైన వస్తువులు తీసుకెళ్తున్నప్పుడు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. నిందితుడిని త్వరగా గుర్తించి బంగారాన్ని స్వాధీనం చేసుకుంటామని పోలీసులు తెలిపారు.

# ఏప్రిల్ నుంచి పలు రాష్ట్రాల్లో ఎన్నికల సవరణ

### సర్ ప్రక్రియపై ఆయా రాష్ట్రాలకు ఈసీ ఆదేశం




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై కేంద్ర ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఏప్రిల్ నుంచి దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాను పక్కాగా రూపొందించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సన్నద్ధమవుతోంది. ఈ మేరకు పలు రాష్ట్రాలప్రధాన ఎన్నికల అధికారులకు అత్యవసరంగా లేఖలు రాసింది. ఏప్రిల్ నుంచి ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ ప్రక్రియ ద్వారా ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదును అత్యంత పారదర్శకంగా నిర్వహించనున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం మొత్తం 20కి పైగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఈ ఆదేశాలు జారీ చేసింది. వాటిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఢిల్లీ, పంజాబ్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూ / కాశ్మీర్, లడఖ్, కర్ణాటక, ఒడిశా, జార్ఖండ్, సిక్కిం, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, త్రిపుర, మహారాష్ట్ర, దాద్రా నగర్ హవేలీ, డామన్ డయ్యూ ఉన్నాయి. సర్ కార్యక్రమానికి సంబంధించి సన్నాహక పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఆయా రాష్ట్రాల అధికారులు చర్యలు చేపట్టాలని సూచించింది. 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాల్లో అధికారులు వీలైనంత త్వరగా సన్నాహకాలను పూర్తి చేసి, ఏప్రిల్ 2026 నుంచి ప్రారంభమయ్యే ÷ూఎఖీని సజావుగా జరిగేలా చూడాలని కేంద్ర ఎన్నికల సంఘం దిశానిర్దేశం చేసింది.



# మేలో పార్టీని ప్రకటిస్తా

### ప్రధాన ప్రతిపక్షంగా ఎదుగుతాం ● అధికారంలోకి రావడం ఖాయం

### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

**హైదరాబాద్, ఫిబ్రవరి 19:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన కొత్త రాజకీయ పార్టీ ప్రకటనకు ముహూర్తం ఖరారు చేశారు. మే నెల మొదటి వారంలో మంచి రోజు చూసుకుని పార్టీని అధికారికంగా ప్రకటిస్తామని ఆమె వెల్లడించారు. పార్టీ పేరులో 'తెలంగాణ' అనే పదం తప్పనిసరిగా ఉంటుందని కవిత స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఎక్కడి నుంచైనా పోటీ చేయవచ్చని అన్నారు. వచ్చే ఎన్నికల్లో తన మొదటి ఛాయిస్ సిద్దిపేట అని, రెండో ఛాయిస్ బోధన్ అని పేర్కొన్నారు. భవిష్యత్తులో తెలంగాణలో బీజేపీ ఉండదని, ప్రధాన ప్రతిపక్షంగా తామే అవుతామని కవిత ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి తామే వస్తామని, ప్రజల సమస్యలపై పోరాటం చేస్తామని చెప్పారు. ఎంపీటీసీ, జడ్పీటీసీలతో పాటు జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూడా పోటీ చేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ దారిలోనే వెళ్తోందని, కొత్త తరహా రాజకీయం చేయడం లేదని విమర్శించారు. తన పార్టీ వ్యక్తుల మీద కాకుండా వ్యవస్థల మీద నడవాలన్నారు. ప్రాంతీయ పార్టీలు లీడర్ సెంట్రిక్‌గా ఉంటాయని.. కానీ వ్యవస్థ నిర్మాణం జరగాలని, సైద్ధాంతిక పునాది ఉండాలని అన్నారు. మహిళలను అవమానించవద్దన్నారు కవిత. వైఎస్ షర్మిలా రెడ్డి నేడు ఏపీలో ఒక జాతీయ పార్టీకి అధ్యక్షురాలిగా ఉన్నారని.. కానీ, షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టడం ప్రజలకు నచ్చలేదని తెలిపారు. చిరంజీవి పార్టీ పెట్టి మూసివేయలేదా అని ప్రశ్నించారు. 'నా లైన్‌లో నేను వెళ్తున్నా.. నా ప్రయత్నం నాది' అని అన్నారు. తెలంగాణ వాదమే తమ పార్టీ మొదటి లైన్ అని తేల్చిచెప్పారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు కింది స్థాయి నుంచి వచ్చినవారు కేంద్ర మంత్రులు అయ్యారని చెప్పుకొచ్చారు. కొత్త తరానికి తాను పెట్టబోయే పార్టీలో అవకాశాలు ఉంటాయని కవిత పేర్కొన్నారు.

# మంత్రుల అవినీతి చిట్టా బయటపెడతాం: బండి



**హైదరాబాద్, ఫిబ్రవరి 19:** మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీల చెంపచెల్లుమనిపించామని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. బీఆర్ఎస్ బరితెగించి కాంగ్రెస్‌తో కుమ్మక్కైందని విమర్శించారు. భాజపాను అడ్డుకునేందుకే కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ కుమ్మక్కయ్యాయి. మజ్లిస్ కోసమే భాగ్యనగరాన్ని సీఎం రేవంత్‌రెడ్డి మూడు ముక్కలు చేశారు. రూ.2.18 లక్షల కోట్ల పెట్టుబడులు ఎక్కడికి పోయాయి. ఢిల్లీకి మూటలు పంపేందుకే తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఒక్కో మంత్రి అవినీతి చిట్టా బయటపెడతాం. అవినీతికి సంబంధించిన ఆడియో రికార్డులు మా వద్ద ఉన్నాయి. 2029లో ఏ రాష్ట్రంలోనూ కాంగ్రెస్ అధికారంలో ఉండదని బండి సంజయ్ అన్నారు.




# తెలంగాణ ఇంటర్ హాల్ టికెట్లు విడుదల

### ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 19:** తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యార్థులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న హాల్ టికెట్ల ప్రక్రియ పూర్తయింది. మార్చిలో జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థుల హాల్ టికెట్లను బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ తాజాగా విడుదల చేసింది. ఈ ఏడాది దాదాపు 9.9 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానుండటంతో, బోర్డు అన్ని ఏర్పాట్లను ముమ్మరం చేసింది. షెడ్యూల్ ప్రకారం, ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. హాల్ టికెట్లు ఇప్పటికే ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చాయి. అయితే, విద్యార్థులు నేరుగా డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయంతో పాటు, వారి సంబంధిత కళాశాల ప్రిన్సిపాళ్ల నుండి ధ్రువీకరించిన హాల్ టికెట్లను తీసుకోవాలని బోర్డు సూచించింది. విద్యార్థుల సౌకర్యార్థం వారి రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకునే లింక్‌ను కూడా పంపుతున్నారు. ఈసారి సాంకేతికతను జోడిస్తూ బోర్డు కీలక మార్పులు చేసింది. విద్యార్థులు తమ పరీక్షా కేంద్రాలను సులభంగా , ఖచ్చితంగా గుర్తించడానికి వీలుగా హాల్ టికెట్లపై కోడ్ ను ముద్రించారు. దీనిని స్కాన్ చేయడం ద్వారా సెంటర్ లొకేషన్ వివరాలను సులభంగా తెలుసుకోవచ్చు. ఒకవేళ హాల్ టికెట్‌లో పేరు, ఫోటో, సంతకం లేదా స్జబెక్టులకు సంబంధించి ఏవైనా తప్పులు ఉంటే, వెంటనే కళాశాల ప్రిన్సిపాల్ ద్వారా బోర్డు దృష్టికి తీసుకెళ్లాలని అధికారులు హెచ్చరించారు. పరీక్షల సమయం దగ్గర పడుతుండటంతో విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. హాల్ టికెట్లు అందిన వెంటనే అన్ని వివరాలు సరిచూసుకోవడం, పరీక్షా కేంద్రాన్ని ఒక రోజు ముందే సందర్శించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని బోర్డు అధికారులు తెలిపారు. ఈ నెలాఖరు నుంచే ప్రారంభం కానున్న ఈ వార్షిక పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా వందలాది కేంద్రాలను సిద్ధం చేశారు.



సంపాదకీయం

# దూసుకొస్తున్న ఏఐ.. అప్రమత్తతే ముఖ్యం!

ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ (ఏఐ)విప్లవం శరవేగంగా విస్తరిస్తోంది. భారత్‌ను గ్లోబల్ సౌత్‌కు సాంకేతిక కేంద్రంగా నిలబెట్టాలన్న లక్ష్యంతో దేశ రాజధానిలో నిర్వహిస్తున్న 'ఇండియా-ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026' ఈ సాంకేతికతపై ఉన్న ఆశలను, ఆందోళనలను మరోసారి తెరపైకి తెచ్చింది. ఏఐ వినియోగంలో భారత్ దూసుకుపోతున్నా, దానివల్ల తలెత్తే దుష్ఫలితాలపై అప్రమత్తంగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఎఐ దుష్ఫలితాలను చర్చించడం ద్వారా యువత భవిష్యత్ గురించి ఇప్పుడు ప్రపంచం ఆలోచించాలి. ఎఐతో పెనుముప్పు తప్పదని ప్రఖ్యాత కంపెనీలు, నిపుణులు హెచ్చరిస్తున్న వేళ దీనిపై ప్రధానంగా చర్చించాలి. ఎందుకంటే నిరుద్యోగాన్ఇన ఇది పెంచి పోషించడం ఖాయమని అంటున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న 'ఇండియా–ఎ.ఐ ఇంపాక్ట్ సమ్మిట్–2026' సందర్భంగా ప్రధానంగా దుష్ఫలితాలను చర్చించాలి. ఉద్యోగావకాశాలు పోతాయని అంటున్నప్పుడు దాని ప్రభావంతో జరిగే నష్టాన్ని చర్చించి, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. ప్రాథమిక స్థాయి వ్యవస్థను పూర్తి స్థాయిలో స్వదేశీ పునాదిమీద ఏర్పాటు చేసుకోవడం భవిష్యత్తులో అన్ని విధాల మేలు చేస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. అయితే, ఎలాంటి ముప్పు ఏర్పడబోతుందో అన్నది ప్రధానంగా ఎఐ సమ్మిట్‌లో చర్చిస్తే మంచిది. కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం ఆ దిశలో నిపుణులతో కమిటీ వేసి చర్చించి, ఉపద్రవానికి ముందే చర్యలకు పూనుకోవాలి. ఢిల్లీ వేదికగా అట్టహాసంగా నిర్వహిస్తున్న ఎఐ సదస్సులో ఈ మేరకు ప్రకటన రావాల్సి ఉంది.

భారత్‌ను గ్లోబల్ సౌత్‌కు సాంకేతిక కేంద్రంగా నిలబెట్టాలన్న లక్ష్యంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే, ఆ దిశలో తీసుకుంటున్న చర్యలేంటన్నది చర్చకు రావాలి. అంతర్జాతీయ స్థాయిలో నాయకత్వం వహించే సంగతి అలా ఉంచితే ప్రపంచ స్థాయికి సరితూగే లేదా దగ్గరగా ఉన్న పునాది స్థాయి వ్యవస్థ కూడా మన దగ్గర లేదు. ఈ రంగంలో ఇప్పటికే నాయకత్వం వహిస్తూ ప్రపంచానికి దిశా నిర్దేశర చేస్తున్న అమెరికా, చైనాలు పెద్ద ఎత్తున నైపుణ్యాలను, పరిశోధనలను విస్తృతం చేస్తుండగా, మనం ఏం చేయాలి, ఎలా చేయాలి అన్న దాని దగ్గరే ఉన్నాం. అనేకమంది మేధావులు మనచెంత ఉన్నారు. ఎఐ కి సంబంధించిన అనేక విషయాలను అంతర్జాతీయంగా గుర్తించిన నిపుణులు మనవాళ్లలో ఉన్నారు. ఫౌండేషన్ మోడల్ సంగతి అలా ఉంచితే, లార్జి మోడల్స్ ట్రైనింగ్‌కు అవసరమైన హైపర్ స్కేల్ డేటా సెంటర్లు కూడా అందుబాటులో లేవు. ఇవేవీ లేకుండా గ్లోబల్ లీడర్‌షిప్ గురించి, అప్పుడు వెల్లువెత్తే అవకాశాల గురించి మాట్లాడటం ఆకాశానికి నిచ్చెనలు వేయడమే అవుతుంది. సవాళ్లను గుర్తించి, అందుకు సమాధానాలను వెతుక్కునే సమయమిది. ఇంపాక్ట్ సమ్మిట్ కోసం నీతి ఆయోగ్ రూపొందించిన నివేదిక ప్రకారం ఎఐ రంగంలో మన దేశం పూర్తిస్థాయిలో సన్నద్ధం కావడానికి మరో పది నుండి ఇరవై ఏళ్లు పడుతుందని అంటున్నారు. 2047 నాటికి ఎఐ రంగంలో భారత్‌ను సూపర్ పవర్‌గా నిలపనున్నట్లు ప్రధాని నరేంద్రమోడీ చెప్పారు. 'కేవలం ఎఐ వినియోగదారునిగా కాకుండా ఎఐ సృష్టికర్తగా, ఎఐ విప్లవంలో భాగస్వామి దశ నుండి దానిని శాసించే స్థాయికి ఎదిగేలా తీర్చిదిద్దుతున్నాం' అని మోడీ అన్నారు. ఎఐ సదస్సులో ఇదే విషయం చెప్పారు. కొత్త సాంకేతికతను భారత్ ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటోంది. ప్రతిభావంతులకు స్వర్గధామంగా భారత్ ఉంది. ఏఐ కేంద్రంగా ఇండియా మారుతోంది. ఏఐ అనేది ఓ పరివర్తన శక్తి. దాన్ని దుర్వినియోగం చేస్తే విధ్వంసానికి దారితీస్తుంది. ఏఐ అనేది యువత, భారత్‌కు కొత్త విశ్వాసం, ఆస్తిగా ఉంది. తొలినాళ్లలో ఏఐపై అనేక సందేహాలు వచ్చాయి. కానీ ఇప్పుడు ఏఐని యువత ప్రయోజనకరంగా ఉపయోగిస్తోంది. వివిధ రంగాల సమస్యలకు ఏఐ పరిష్కారం చూపుతోందని మోదీ తెలిపారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో శరవేగంగా మార్పులు చోటుచేసుకుంటున్న ప్రస్తుత తరుణంలో అప్పటికి పరిస్థితులు ఎలా ఉంటాయో, ఏ కొత్త సాంకేతికత ఉనికిలోకి వస్తుందో తెలియదు! మరోవైపు ప్రపంచంలో ఎఐ అభివృద్ధి విస్ఫోటనం చెందుతోంది. శక్తివంతమైన నమూనాలకు శిక్షణ ఇచ్చే కంప్యూటింగ్ శరవేగంగా పెరుగుతోంది. ప్రత్యేకమైన చిప్‌ల తయారీ కోసం పెద్దఎత్తున పోటీ జరుగుతోంది, భారీ టెక్ సంస్థలు ఎఐలోకి పెద్ద మొత్తాలను కుమ్మరిస్తున్నాయి. 2024 నుండి అమెరికా, చైనాలు ఈ రంగంపై దృష్టి సారించి భారీ మొత్తంలో ఖర్చు చేస్తున్నాయి. మన దేశంలో ఈ రంగ అభివృద్ధి కోసం ఇప్పుడిప్పుడే పరిశోధనలు మొదలయ్యాయి. మరోవైపు ఎఐ వద్ధి పేరుతో వ్యక్తిగత గోప్యతకు ముప్పు తలెత్తే ప్రమాదం ఉంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ప్రభావం పడనుంది. న్యాయవ్యవస్థలో కూడా ఎఐ వినియోగంపై జాగ్రత్త అవసరమని ఇటీవల సుప్రీంకోర్టు సూచించింది. ఆరోగ్య రంగంలోనూ ఇటువంటి ఆందోళనలే వ్యక్తమవుతున్నాయి. మీడియా, రాజకీయ రంగాల్లో డీప్‌ఫేక్‌ల భయాలు ఇప్పటికే ప్రారంభమైనాయి. పెద్ద టెక్ సంస్థల ఆధిపత్యం పెరిగితే డేటా, మౌలిక వసతులు వారి చేతుల్లోనే కేంద్రీకృతమయ్యే ప్రమాదం ఉంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని బలమైన పారదర్శక చట్టాలు, డేటా రక్షణ, నైతిక నియంత్రణ, సమగ్ర శిక్షణ విధానాలను రూపొందించాల్సి ఉంది. దేశంలో ఉన్న యువశక్తిని సమర్థవంతంగా వినియోగిం చుకోవడంతో పాటు, డేటా సెంటర్లు, ఫౌండేషన్ మోడల్స్, చిప్ తయారీ వంటి అంశాలపై దృష్టి సారించాలి. ఢిల్లీ ఎఐ సదస్సులో చోటుచేసుకున్న సాంకేతిక లోపాలతో పాటు, మేడ్ ఇన్ చైనా రోబోడాగ్‌ను తమ సొంత ఆవిష్కరణగా ప్రకటించుకుని నగుబాటైన గల్గోటియాస్ యూనివర్శిటీ నిర్వాకం అంతర్జాతీయ వేదికపై దేశ ప్రతిష్టను మసకబార్చాయి. భవిష్యత్తులో ఇటువంటివి జరగకుండా చూడాలి. అన్నింటికి మించి నిరుద్యోగానికి సవాల్‌గా మారిన ఐఎని ఎలా అధిగమించాలన్న దానిపై ప్రయత్నాలు జరగాలి.

# ఏఐ మనల్ని శాసించొద్దు..

మనమే ఏఐని శాసించాలి

- ఏఐ అంటే కేవలం టెక్నాలజీ కాదు.. అదొక పరివర్తన శక్తి!
- విధ్వంసానికి తావులేకుండా 'మానవ్ విజన్'తో ముందుకు సాగాలి
- 'ఇండియా ఏఐ సమ్మిట్'లో ప్రధాని మోడీ పిలుపు





**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సామర్థ్యం మన ఊహలకు అందనంత వేగంగా దూసుకుపోతోందని, అయితే ఈ సాంకేతికత మనిషిని శాసించే స్థాయికి చేరకూడదని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. దేశ రాజధానిలో జరుగుతున్న ప్రతిష్ఠాత్మక 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు'లో గురువారం ఆయన ప్రసంగిస్తూ.. ఏఐ వినియోగంపై ప్రపంచానికి దిశానిర్దేశం చేశారు. ప్రపంచ జనాభాలో ఆరో వంతు ఉన్న భారత్.. కొత్త సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో అగ్రభాగాన నిలుస్తోందని ప్రధాని కొనియాడారు. దేశ యువత ఏఐ పట్ల చూపుతున్న ఆసక్తిని ప్రస్తావిస్తూ.. భారత్‌లో జరుగుతున్న ఏఐ విప్లవం భవిష్యత్తులో ఒక గొప్ప చరిత్రగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 'మేక్ ఇన్ ఇండియా' స్ఫూర్తితో భారత ఆవిష్కరణ సామర్థ్యాన్ని ఈ సదస్సు ప్రపంచానికి చాటుతోందని ఆయన పేర్కొన్నారు. ఏఐకి ఉన్న పరివర్తన శక్తి గురించి హెచ్చరిస్తూ.. దీనిని సద్వినియోగం చేసుకుంటే ఎన్నో సంక్లిష్ట సమస్యలకు పరిష్కారాలు దొరుకుతాయని, అదే తప్పుడు చేతుల్లోకి వెళ్తే విధ్వంసానికి దారితీస్తుందని ప్రధాని ఆందోళన వ్యక్తం చేశారు. "ఏఐ భవిష్యత్తులో ఏం చేయగలదన్నది కాదు.. ఏఐని ఉపయోగించి ప్రస్తుతం మనం ఏం చేయగలమన్నదే అసలు ప్రశ్న" అని మోడీ వ్యాఖ్యానించారు. ప్రజా సంక్షేమమే ఏఐకి బెంచ్‌మార్క్ కావాలని, మానవ కేంద్రిత ఏఐ నిర్మాణం మన లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. ఏఐ వినియోగంలో 'మానవ్ విజన్' అత్యంత కీలకమని ప్రధాని కొత్త నినాదాన్ని వినిపించారు. ఇది కేవలం సాంకేతికత మాత్రమే కాదని, ఒక పటిష్టమైన ఫ్రేమ్‌వర్క్ అని ఆయన వివరించారు. ఏఐ వినియోగం చట్టబద్ధంగా ఉండటమే కాకుండా, ఎప్పటికప్పుడు పునఃసమీక్షించేలా పారదర్శకంగా ఉండాలని సూచించారు. మనుషులు, సాంకేతికత కలిసి ప్రయాణించే కొత్త శకంలో మనం ఉన్నామని, ఈ విప్లవంలో భారత్ తనదైన ముద్ర వేస్తుందని ప్రధాని మోడీ స్పష్టం చేశారు.

# ఉచిత పథకాలపై మరోమారు సుప్రీం సీరియస్

- ప్రజల సొమ్మును దుబారా చేయడంపై ఆగ్రహం
- పేదలకు విద తదితర కనీస అవసరాలు కల్పించాల్సిందే
- చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** దేశంలో రాజకీయ పార్టీలు అందిస్తున్న ఉచిత పథకాలపై సుప్రీంకోర్టు మరోసారి తీవ్రస్థాయిలో స్పందించింది. తమిళనాడు విద్యుత్ పంపిణీ సంస్థకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశ మయ్యాయి. ఉచిత పథకాల వల్ల దేశ ఆర్థికాభివృద్ధి కుంటుపడుతుందని కోర్టు హెచ్చరించింది. తమిళనాడులో ఉచిత విద్యుత్ సరఫరా, ఆర్థిక స్థితిగతులపై విచారణ చేపట్టిన కోర్టు, విద్యుత్ పంపిణీ సంస్థకు నిధులు ఎక్కడి నుండి వస్తున్నాయో వివరించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. దీనిపై పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని కోరింది. పేదలకు విద్య, కనీస అవసరాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని కోర్టు అంగీకరించింది. అయితే, పెద్ద పెద్ద భూస్వాములకు కూడా ఉచిత విద్యుత్ అందించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. 'సౌకర్యం కావాలనుకున్నప్పుడు డబ్బులు చెల్లించాలి కదా! పెద్ద భూస్వాములు ఉచితం అని అనవసరంగా లైట్లు, మెషీన్లు వాడుతున్నారు' అని జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. ఎన్నికలకు ముందే ఉచిత పథకాలను ప్రకటించే సంస్కృతిపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రాజకీయ పార్టీలు, సామాజికవేత్తలు తమ సిద్ధాంతాలను పునరాలోచించుకోవాల్సిన అవసరం ఉందని హితవు పలికింది. ప్రభుత్వం ఇచ్చే ఉచితాల వెనుక ఉన్నది ప్రజల కష్టార్జితమైన పన్నుల సొమ్ము అని కోర్టు గుర్తు చేసింది. రాష్ట్రాలు అప్పుల్లో ఉన్నప్పటికీ ఉచిత పథకాలు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించింది. రాష్ట్రాలు వసూలు చేసే ఆదాయంలో కనీసం 25 శాతాన్ని రాష్ట్ర అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు ఎందుకు ఉపయోగించకూడదని ధర్మాసనం సూటిగా ప్రశ్నించింది. అంతేకాదు, 'ఉచితాలు ఎన్నాళ్లు కొనసాగుతాయి?' అన్న సుప్రీంకోర్టు ప్రశ్న ఇప్పుడు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సవాలుగా మారింది. సంక్షేమం పేరుతో ఆర్థిక క్రమశిక్షణను విస్మరిస్తే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు తప్పవని అత్యున్నత న్యాయస్థానం పరోక్షంగా హెచ్చరించింది.

# ప్రధాని అవుతావు

ప్రియాంక గాంధీకి బాబా దీవెనలు



**గౌహతి, ఫిబ్రవరి 19:** కాంగ్రెస్ ఎంపీ, స్క్రీనింగ్ కమిటీ చైర్‌పర్సన్ ప్రి యాంక గాంధీ గురువారం అస్సాంలో పర్యటించగా, అక్కడ ఆసక్తికర సన్నివేశంచోటు చేసుకుంది. కామాఖ్య ఆలయానికి వెళ్ళినప్పుడు ఆమెకు బాబా (సన్యాసి) ఆశీర్వాదం లభించడం అందరి దృష్టిని ఆకర్షించింది. ప్రియాంక గురువారం ఉదయం 10 గంటల ప్రాంతంలో గౌహతిలోని లోక్‌ప్రియ గోపీనాథ్ బోర్డోలోయ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుని, అక్కడినుంచి నేరుగా ప్రార్థనలు నగరంలోని కామాఖ్య ఆలయానికి వెళ్లారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అస్సాం నాగరికత, సంస్కృతిని గౌరవిస్తూ, లక్షలాది మంది ప్రజల విశ్వాసంతో ముడిపడి వున్న కామాఖ్య దేవిఅమ్మవారి ఆశీర్వాదం పొందడానికి వచ్చాననీ ప్రియాంకతెలిపారు. ఆలయంలో ప్రార్థనలు చేసిన తర్వాత సంతోషంగా అనిపించిందన్నారు. ఆలయ సందర్శన సమయంలో నాగ సాధువుతో క్లుప్తంగా సంభాషించారు. ఈ సందర్భంగా ప్రియాంక గాంధీ తలపై చేయి వేసి "హమారా బేటీ ప్రధాన మంత్రి బనేగా (మా కూతురు ప్రధాన మంత్రి అవుతుంది)" అంటూ దీవించారు. దీంతో ఆమె చిరునవ్వుతో అక్కడ నుంచి వెళ్లిపోయారు. దీనికి సంబంధించిన వీడియో తెగ వైరల్‌అవుతోంది. అనంతరం ప్రియాంక గాంధీ ఎంపీ గౌహతిలోని రాజీవ్ భవన్ (కాంగ్రెస్ భవన్)కు బయలుదేరి వెళ్లారు.

# నైజీరియా గనిలో విషయవాయువుల లీక్

37మందిని బలి తీసుకున్న ఘటన

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** నైజీరియాలోని ఓ గనిలో విషవాయువులు లీకయ్యాయి. ఆ విష వాయువులను పీల్చి 37 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 26 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుందని అక్కడి పోలీస్ అధికారులు వెల్లడించారు. నార్త్ సెంట్రల్ నైజీరియాలోని ఓ గనిలో ఆకస్మికంగా లెడ్ ఆక్సైడ్, సల్ఫర్, కార్బన్ మోనాక్సైడ్ గ్యాస్‌లు లీక్ అయ్యాయి. ఈ వాయువులు మానవాళికి విషపూరితమైనవి. పైగా గనిలో వెంటిలేషన్ కూడా తక్కువగా ఉండడంతో వీటి ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ఈ విష వాయువులను పీల్చి 37 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 26 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిని అధికారులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నైజీరియా సర్కారు ఈ ప్రమాద ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించింది. గనిలో విష వాయువులు లీకవుతాయనే విషయంలో అవగాహన లేకపోవడంతోనే ప్రాణనష్టం ఎక్కువగా జరిగిందని అక్కడి మంత్రి చెప్పారు. ప్రమాదానికి కారణమైన గని సక్రమమైనదా, అక్రమమైనదా అనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నట్టు మంత్రి పేర్కొన్నారు.

# డిజిటల్ రంగంలో భారత్ విప్లవాత్మక మార్పులు

అధికవడ్డీ రుణాలపై వడ్డీ తగ్గింపు.. కొత్త ఆవిష్కరణలు ఆర్థిక వ్యవస్థ వృద్ధికి తోడ్పాటు

ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో టెక్ దిగ్గజాల వెల్లడి




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** డిజిటల్ రంగంలో భారత్ విప్లవాత్మక మార్పులు సాధిస్తోందని, ఏఐ కేంద్రంగా మారుతోందని పలుదేశాల ప్రతినిధులు ప్రశంసించారు. ప్రపంచంలోనే అతిపెద్ద కృత్రిమ మేధ సదస్సుకు భారత్ వేదికైంది. దిల్లీలోని భారత మండపంలో జరుగుతోన్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్'లో 118 దేశాలు పాల్గొన్నాయి. గురువారం జరిగిన సదస్సు అధికారిక ప్రారంభ కార్యక్రమంలో పలువురు దేశాధినేతలు, టెక్ దిగ్గజాలు పాల్గొని కీలక ప్రసంగం చేశారు. కొత్త ఆవిష్కరణలు ఆర్థిక వ్యవస్థను వృద్ధి పథంలో నడిపిస్తాయి. ఏఐ నిర్మాణం అందరికీ చాలా ఉపయోగంగా ఉంటుంది. భారత్‌ను సందర్శించిన ప్రతిసారీ మార్పుల వేగం చూసి ఆశ్చర్యపోతున్నా. విద్యార్థిగా ఉన్నప్పుడు ఐఐటీ ఖరగ్‌పూర్‌కు విశాఖ మీదుగా వెళ్లేవాడిని. అదే విశాఖ తీరంలో ఇప్పుడు గూగుల్ ఫుల్ స్టాక్ ఏఐ హబ్ ఏర్పాటవుతోంది' అని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ తెలిపారు. డిజిటల్ రంగంలో భారత్ విప్లవాత్మక మార్పులు సాధిస్తోంది. గతంలో భారత్‌లో బ్యాంకు ఖాతా తెరవాలంటే సమస్యగా ఉండేది. ప్రస్తుతం ఎలాంటి పత్రాలు లేకుండానే బ్యాంకు ఖాతా తెరవగలుగుతున్నారు. ఫోన్‌లోనే బ్యాంకు ఖాతా తెరిచే సౌలభ్యం వచ్చింది. 140 కోట్ల మంది ప్రజలకు భారత్ డిజిటల్ ఐడెంటిటీ తీసుకొచ్చింది. ఆవిష్కరణల పథంలో అందరూ కలిసి ముందుకు సాగాలి. ప్రతినెలా 20 బిలియన్ల డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయి. 500 మిలియన్ల మందికి డిజిటల్ హెల్త్ ఐడీలు ఇచ్చారని ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ ప్రశంసించారు. ఏఐ కృత్రిమమైనది కాదు.. వాస్తవమైనదని టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్ వ్యాఖ్యానించారు. ఏఐ సదస్సులో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నట్లు వెల్లడించారు. డిజిటల్ ఇన్‌ఫ్రాస్టక్చర్ కార్యక్రమాలకు భారత్ సాక్షిగా నిలుస్తోంది. 140 కోట్ల మంది ప్రజలతో అతిపెద్ద డిజిటల్ ఐడెంటిటీ వ్యవస్థ కలిగిఉంది. ప్రపంచంలో జరిగే వాటిలో భారత్ నుంచే సగం డిజిటల్ లావాదేవీలు ఉన్నాయి. భారత్‌ను ఏఐ కేంద్రంగా ప్రధాని తీర్చిదిద్దుతున్నారు. సెమీకాన్ ఇండియా, ఇండియా ఏఐ మిషన్‌లో భాగంగా సాంకేతికత అభివృద్ధి జరుగుతోంది. ఏఐ నైపుణ్య శిక్షణలో భారత్ పురోభివృద్ధి సాధిస్తోందన్నారు. గత దశాబ్దకాలంగా ఏఐ వేగంగా ముందుకెళ్తోంది. అతి త్వరలోనే మనుషులు చేసే అత్యంత క్లిష్టమైన పనులను ఏఐ మోడళ్లు సులువుగా పూర్తి చేసే రోజులు రానున్నాయి. ఏఐతో అవకాశాలతో పాటు సవాళ్లూ ఉన్నాయి. ఆ సవాళ్లను పరిష్కరించడంలో భారత్ కీలక పాత్ర పోషించనుందని ఆంత్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ పేర్కొన్నారు.

# అధికవడ్డీ రుణాలపై వడ్డీ తగ్గింపు

- ఏటా 2వేల కోట్లు ఆదా అయ్యేలా చర్యలు
- మైనింగ్ శాఖలో 33 శాతం ఆదాయం మెరుగు
- ఎక్సైజ్ శాఖలో 24 శాతం ఆదాయం పెరుగుదల
- ఒక్క ఓటుతో ఎన్నో అభివృద్ధి, సంక్షేమాలను చేపట్టాం
- వైసీపీ నెవర్ ఎగైన్.. కూటమి వన్స్ ఎగైన్'
- జగన్ రాష్ట్రానికి అతి ప్రమాదకరమని ప్రచారం జరగాలి
- అసెంబ్లీలో బడ్జెట్ సమాధానంలో మంత్రి పయ్యావుల కేశవ్



**అమరావతి,ఫిబ్రవరి 19(ఆర్ఎన్ఎం):** అధిక వడ్డీలతో తెచ్చిన రుణాలపై వడ్డీ రేట్లు తగ్గించేలా సంప్రదింపులు జరుపుతున్నామని ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. సుమారు రూ.2 వేల కోట్ల మేర వడ్డీలు తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఏడాదికి రూ.2 వేల కోట్లు ఆదా అయితే.. చాలా పథకాలు సమ-ర్థవంతంగా అమలు చేయవచ్చన్నారు. గత ప్రభుత్వంతో పోల్చుకుంటే మైనింగ్ శాఖలో 33 శాతం, ఎక్సైజ్ శాఖలో 24 శాతం ఆదాయం పెరిగిందని వివరించారు. గత ప్రభుత్వంలో గనులు, ఎక్సైజ్ ఆదాయం తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్లిందని వైసీపీపై పయ్యావుల విమర్శలు గుప్పించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌పై జరిగిన చర్చలో భాగంగా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో సమాధానం ఇచ్చారు. ప్రభుత్వ పథకాలను వివరిస్తూనే.. వైసీపీ గత పాలనపై మంత్రి మండిపడ్డారు. 'వైసీపీ నెవర్ ఎగైన్.. కూటమి వన్స్ ఎగైన్' అంటూ పయ్యావుల వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రానికి వైసీపీ హానికరం అనే స్టాట్యూటరీ వార్నింగ్ నిరంతరం ఇస్తూనే ఉండాలని స్పష్టం చేశారు. ఇజ్రాయిల్ దేశస్థుల తరహాలో ప్రజలు కూడా మన రాష్ట్రం అనే భావనను పెంపొందించుకోవాలని సూచించారు. కూటమి జరిపిన భూ కేటాయింపుల వల్ల కలిగిన లాభాలను.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిపిన భూ కేటాయింపుల వల్ల కలిగిన నష్టాలను మంత్రి సభలో ఏకరువు పెట్టారు. సీఎం చంద్రబాబు హయాంలో భూములు కేటాయిస్తే... కియా, హెచ్‌సీఎల్, అశోక్ లేలాండ్, హీరో కంపెనీ, టీసీఎస్, కాగ్నిజెంట్, గూగుల్ ఏఐ డేటా సెంటర్ వంటి సంస్థలు వచ్చాయని తెలిపారు. వైసీపీ హయాంలో ఇచ్చిన భూముల్లో ఒక్క కంపెనీ కూడా రాలేదని గుర్తుచేశారు. లేపాక్షి నాలెడ్జ్ హబ్, వ్యాన్ పిక్, బ్రాహ్మణి స్టీల్స్‌కు భూములిచ్చినా.. ఒక్క ఎంఎస్‌ఎంఈ కూడా రాలేదని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. రాయలసీమ హార్టికల్చర్ హబ్ అంశంపై సభలో పయ్యావుల ఆసక్తికర కామెంట్లు చేశారు. సీఎం చంద్రబాబు తీసుకున్న చొరవతో పరిశ్రమల్లోనే కాదు.. పొలాల్లో కూడా పెట్టుబడులు పెడుతున్నారని తెలిపారు. ఢిల్లీ నుంచి వచ్చి కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని పొలాలను కొంటున్నారని, దానిమ్మ పండిస్తున్నారని వెల్లడించారు. చంద్రబాబు చొరవతో రాయలసీమ ఉత్పత్తులకు అరకు తరహాలో అంతర్జాతీయ బ్రాండింగ్ రాబోతోందం టూ సంతోషం వ్యక్తం చేశారు. అలాగే, రాయలసీమ ప్రాజెక్టులకు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన ద్రోహాన్ని మంత్రి పయ్యావుల వివరించారు. 102 రాయలసీమ ప్రాజెక్టులను ఒక్క సంతకంతో రద్దు చేశారని జగన్‌పై ÷ర్ అయ్యారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును నిర్మించడం లేదని నాడు కేంద్రానికి అప్పటి ఇరిగేషన్ స్పెషల్ సీఎస్‌గా ఉన్న ఆదిత్యనాథ్ దాస్ స్పష్టం చేశారంటూ డాక్యుమెంట్లను మంత్రి పయ్యావుల కేశవ్ సభలో ప్రవేశపెట్టారు. తన బడ్జెట్ రిప్లైలో 'ఒక్క ఓటు.. వంద లాభాలు' అంటూ కూటమి ప్రభుత్వం చేసిన పనులను మంత్రి పయ్యావుల ప్రస్తావించారు. అమరావతికి రూ.12 వేల కోట్లు, పోలవరానికి రూ.15 వేల కోట్లు, విశాఖ స్టీల్ ప్లాంట్ పునరద్ధరణకు రూ.11 వేల కోట్లు,విశాఖకు గూగుల్ డేటా సెంటర్, విశాఖకు రైల్వే జోన్,పూర్వోదయ స్కీం,రాయలసీమ హార్టికల్చర్ హబ్,అమరావతికి క్వాంటమ్ వ్యాలీ,విద్యుత్ ఛార్జీల తగ్గింపు, వేలాది కోట్ల నేషనల్ హైవే ప్రాజెక్టులు, రైల్వే లైన్లుఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ఎ÷-లాంట్,ఒక్క ఓటు టీసీఎస్, కాగ్నిజెంట్ సంస్థలు, కేవలం మూడు రోజుల్లో రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులకు 610 ఎంఓయూలు, ఆడబిడ్డలకు భద్రత, రాయలసీమకు హంద్రీ - నీవా కాల్వల ద్వారా కృష్ణా జలాలు,అమరావతికి రాజధానిగా చట్టబద్ధత,రాజముద్రతో పట్టాదార్ పాస్ పుస్తకాలు.. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు, టీచర్ రిక్రూట్‌మెంట్, పోలీస్ కానిస్టేబుళ్ల నియామకం లక్షల కోట్ల సంక్షేమం,20 లక్షల ఉద్యోగాల కల్పనకు రోడ్ మ్యాప్, లక్షల కోట్ల అభివృద్ధి,పోర్టులు, ఎయిర్ పోర్టులు,ఇంటింటికి తాగు నీటి కనెక్షన్లు,గుంతల్లేని రోడ్లు వంటివన్నీ చేయగలిగామని వివరించారు. పయ్యావుల సమాధానం ఇస్తుండగా అధికార పార్టీ సభ్యులు బల్లలు చరిచారు.

# కర్నూలు క్లస్టర్ విశ్వవిద్యాలయం కోసం రూ.139 కోట్లు

- రూసా కింద రూ.55 కోట్లు ఇప్పటికే ఖర్చు చేశాం
- అసెంబ్లీలో వెల్లడించిన మంత్రి లోకేశ్



**అమరావతి,ఫిబ్రవరి 19:** కర్నూలు క్లస్టర్ విశ్వవిద్యాలయం కోసం రూ.139 కోట్ల నిధులు మంజూరు చేశామని... దాంట్లో రూసా కింద రూ.55 కోట్లు ఖర్చు చేశామని మంత్రి లోకేశ్ వెల్లడించారు. ఏ కార్యక్రమం చేసినా క్లస్టర్ బేస్డ్ అప్రోచ్ తీసుకుంటున్నామని తెలిపారు. ఏపీ అసెంబ్లీ బ్జడెట్ సమావేశాలు ఆరో రోజు ప్రారంభమయ్యాయి. ప్రశ్నోత్తరాలతో సభను మొదలుపెట్టారు స్పీకర్ అయ్యన్నపాత్రుడు. కర్నూలు క్లస్టర్ విశ్వవిద్యాలయానికి సంబంధించి ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి నారా లోకేశ్ సమాధానమిచ్చారు. కర్నూలు పార్లమెంట్ చుట్టు పక్కల ఎక్కవ పెట్టుబడులు వస్తున్నాయన్నారు. క్లస్టర్ యూనివర్సిటీల్లో ఫోకస్ స్జబెక్టులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. అందుకే స్పెషలైజేషన్‌లపైనా శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. బ్యాలెన్స్ పనులు వచ్చే అకాడమిక్ ఇయర్‌లో పెండింగ్ నిధులు మంజూరు చేస్తామని మంత్రి లోకేశ్ సభలో పేర్కొన్నారు.సమగ్ర శిక్షా అభియాన్ కింద పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగుల వేతనాలను 50 శాతం పెంచే ఉద్దేశం ఉందా అని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు ప్రశ్నించారు. వీరంతా చాలా తక్కువ జీతాలతో పనిచేస్తున్నారని తెలిపారు. వారి జీతభత్యాలు పెంచాలని, ఈపీఎఫ్ సౌకర్యం కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఆ తర్వాత ఎమ్మెల్యే పార్థసారధి కస్తూరిబా బాలికా విద్యాలయాలపై మాట్లాడారు. కస్తూరిబా బాలికా విద్యాలయాల్లో ఆడపిల్లలకు గొప్పగా విద్యనందిస్తున్నాయని తెలిపారు. ఏపీ ప్రభుత్వ పాఠశాలల్లో సీట్లు దొరకని పరిస్థితి ఉందన్నారు. ప్రస్తుతం 79 శాతం ఉత్తీర్ణత ఉన్న స్కూళ్లు త్వరలో 90 శాతం ఉత్తీర్ణత సాధించే అవకాశం ఉందని తెలిపారు. మరిన్ని కస్తూరిబా బాలికా విద్యాలయాలను ప్రారంభించాలని ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు మంత్రి లోకేశ్ సమాధానం ఇచ్చారు. సమగ్ర శిక్షా అభియాన్ కింద పనిచేస్తున్న ఉపాధ్యాయులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఎంత వేతనం చెల్లిస్తున్నారని మంత్రి నారా లోకేశ్ ప్రశ్నించారు. దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లోనే ఎక్కువ జీతాలు ఇస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఈ పథకం కేంద్ర ప్రభుత్వ అధీనంలో ఉందని, ఈ అంశాలను కేంద్ర దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే, సీజనల్ హాస్టళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు మంత్రి లోకేశ్. త్వరలోనే వాటిని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. డీఎస్సీలో కర్నూలు జిల్లాకు అదనపు ఉపాధ్యాయులను శాంక్షన్ చేశామన్నారు. త్వరలోనే డీఎస్సీని జాబ్ క్యాలెండర్ కింద విడుదల చేస్తామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. గతంలో క్రైస్తవ ఆస్తులు అన్యాక్రాంతం అయ్యాయా అని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అసెంబ్లీలో ప్రశ్న లేవనెత్తారు. గుంటూరులో క్రిస్టియన్ భవన్ నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందని అడిగారు ఎమ్మెల్యే. దీనిపై మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సమాధానం ఇస్తూ.. క్రైస్తవ ఆస్తుల విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవడం లేదని స్పష్టం చేశారు. జగన్ క్రిస్టియన్ కాదని అనుకుంటున్నానని... ఎందుకు ఐదేళ్ల పాటు ఆ క్రైస్తవ భవన్ పూర్తిచేయలేదని ప్రశ్నించారు. ఎందుకు ఆయన తనహయంలో నిధులు ఇవ్వలేదని అడిగారు. ఇప్పుడు కూటమి వచ్చింది కనుక త్వరలోనే పెండింగ్ పనులు పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తేస్తామని హామీ ఇచ్చారు. ఇజ్రాయిల్, పాలస్తీనా యుద్ధం జరుగుతున్నందున జెరుసలేం యాత్రకు ఆస్కారం లేకుండా ఉందని మంత్రి ఎండీ ఫరూక్ పేర్కొన్నారు.

# అప్పుల లెక్కలోనూ బాబు అసత్యాల ప్రచారం

- నా హయాంలో రాష్ట్ర అప్ప రూ.7లక్షల 21 వేల 918 కోట్లు
- రూ.9లక్షల 74 వేల కోట్లు అని చంద్రబాబు తప్పుడు ప్రచారం
- వైకాపా అధినేత, మాజీ సింఎం జగన్ మండిపాటు

**అమరావతి, ఫిబ్రవరి 19:** అప్పుల లెక్కల్లో కూడా చంద్రబాబు అబద్దాలు ప్రచారం చేస్తున్నారని వైకాపా అధినేత, మాజీ సిఎం జగన్ మండిపడ్డారు. 2014 కల్లా అప్పులు రూ.లక్షా 47 వేల 717 కోట్లని.. బాబు దిగిపోయే నాటికి రూ.3లక్షల 90 వేల 247 కోట్ల అప్పులు చేశారని మాజీ సీఎం జగన్ అన్నారు. తాము దిగిపోయే నాటికి రాష్ట్ర అప్పు రూ.7లక్షల 21 వేల 918 కోట్లని.. కానీ.. రూ.9లక్షల 74 వేల కోట్లు అని చంద్రబాబు తప్పుడు ప్రచారం చేస్తున్నారని వెల్లడించారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉంటూ ఇలా తప్పుడు ప్రచారాలు చేయవచ్చా అని ప్రశ్నించారు. తాజాగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ సీఎం జగన్ మాట్లాడుతూ.. 50 ఏళ్లకే పెన్షన్ అని మరొక హామీ ఇచ్చారని.. రాష్ట్రంలో 50 నుంచి 59 ఏళ్ల లోపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు 20 లక్షల మంది ఉన్నారన్నారు.. ఈ మూడు బ్జడెట్లలో మూడు ప్రధాన హామీలకు అతీగతీ లేదన్నారు.. సూపర్ ఎ÷-లాప్ అయిన సినిమా చూపించి సూపర్ హిట్ అని ఎలా అంటారని ప్రశ్నించారు.. ప్రతీ నెల పబ్లిక్ మీటింగ్ పెట్టి ప్రతీ మీటింగ్‌కి 25 వేల పెన్షన్లు కట్ చేస్తున్నారు.. 2024 మార్చి నాటికి రాష్ట్రంలో పెన్షన్లు 66,34,372.. ఈనెల చంద్రబాబు ఇచ్చిన పెన్షన్లు 60, 96,108.. ఐదు లక్షలకు పైగా పెన్షన్లు కట్ చేశారు.. ఈనెల ఇచ్చిన మొ-త్తం 2,632 కోట్లు.. ఏడాదికి కావాల్సింది 31,584 కోట్లు.. ఈ ఏడాది బ్జడెట్ పెన్షన్ కోసం చేస్తున్న ఖర్చు 27, 719 కోట్లు.. ఈ డబ్బు మొత్తం 53, 50, 115 పెన్షన్లకు మాత్రమే సరిపోతుంది.. మరి మిగతావాళ్ళవి ఏం చేస్తారు.. దాదాపు ఏడు లక్షల పెన్షన్లకు కేటాయింపులు ఎలా చేస్తారు.. తల్లికి వందనం పేరిట మరో మోసం.. రాష్ట్రంలో జఆఎ÷ూఇ డేటా ప్రకారం మా హయాంలో బడికి పోయే పిల్లలు 87, 41,885 పిల్లలు.. ఒక్కొక్కరికీ 15 వేల చొప్పున ఇస్తే 13, 112 కోట్లు ఖర్చు అవుతుంది.. ఇప్పటివరకు ఇచ్చింది కేవలం 8,456 కోట్లు.. దాదాపు 20 లక్షల మంది పిల్లలకు ఎగగొట్టారు.. ఉచిత బస్సు పథకం ద్వారా రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడకు అయినా వెళ్లవచ్చు అని చెప్పారు.. ఏపీఎస్ఆర్టీసీలో 16 రకాల సర్వీసులు ఉంటే 5 సర్వీసులకు పరిమితం చేశారు.. ఉచిత గ్యాస్ అని మరో మోసం.. రాష్ట్రంలో మొత్తం గ్యాస్ కనెక్షన్స్ 1.59 కోట్లు.. ఒక్కొక్కరికి మూడు సిలిండర్లు ఇస్తామన్నారు.. ఏడాదికి మొత్తం నాలుగు వేల కోట్లు ఇవ్వాల్సి ఉండగా బ్జడెట్‌లో కేటాయించింది 2600 కోట్లు.. గ్యాస్‌లో కూడా బాకీ పెట్టారు.. వ్యవసాయ రంగానికి అన్నదాత సుఖీభవ అన్నారు.. మా హయాంలో చెప్పిన దాని కన్నా పెంచి ఇచ్చాం.. కేంద్రం ఇచ్చేది కాకుండా మేము 20 వేలు ఇస్తామని చెప్పారు.. 10,717 కోట్లు ఏడాదికి రైతులకు అన్నదాత సుఖీభవ పథకానికి ఇవ్వాలి.. మొత్తం రెండేళ్లకు ఒక్కొక్కరికీ 40 వేలు ఇవ్వాల్సి ఉండగా కేవలం 10 వేలు ఇచ్చారు.. చాలా మందికి పథకం ఎగరగొట్టారు.. వ్యవసాయ మంత్రి 6300 కోట్లు ఇచ్చామని అబద్ధాలు చెప్తున్నారు.. 21 వేలు ఇవ్వాల్సి ఉంటే నాలుగు వేల కోట్లు ఇచ్చారు.. వరుసగా మూడవ బడ్జెట్ లో కూడా కౌలు రైతుకు సున్నా.. చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక 17 సార్లు విపత్తులు సంభవించాయి.. చంద్రబాబు పంటలకు క్రాప్ ఇన్సూరెన్స్ పథకం అందుబాటులో లేకపోవటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.. వైసీపీ హయంలో క్రమం తప్పకుండా ప్రీమియం చెల్లించడం వల్ల 54.55 లక్షల మంది రైతులకు జరిగిన మేలు 7802 కోట్లు.. గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.. ఏ పంటకు ధర లేకపోయినా ప్రభుత్వం చేసింది శూన్యం.. మా హయంలో 3000 కోట్లతో ధరల స్థిరీకరణ నిధి తెచ్చాం.. ప్రతీ పంటకు గిట్టుబాటు ధర నిర్ణయించాం..'అని మాజీ సీఎం జగన్ అన్నారు.

# ఆళ్లకు ఏసీబీ కోర్టు నోటీసులు



**విజయవాడ, ఫిబ్రవరి 19:** ఇన్నర్ రింగ్ రోడ్డు అక్రమాల కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి ఏసీబీ కోర్టు గురువారం నోటీసులు జారీ చేసింది. ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో నిందితులుగా.. అప్పటి ప్రతిపక్షనేత, ప్రస్తుత సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారాయణ తదితరులు ఉన్న విషయం తెలిసిందే. ఈ కేసు మూసివేస్తున్నట్లు ఏసీబీ కోర్టులో సీఐడీ పిటిషన్ వేసింది. ఈ పిటిషన్ విచారణలో భాగంగా.. కేసులో ఫిర్యాదుదారుగా ఆళ్ల రామకృష్ణారెడ్డి ఉన్నారు. ఈ కేసులో ఆయనకి ఏమైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే తెలపాలని నోటీసుల్లో ఏసీబీ కోర్టు తెలిపింది.

# విశాఖలో చిన్నారిపై లైంగిక దాడి

## ఘటనపై ఆరా తీసిన మహిళా కమిషన్ చైర్‌పర్సన్

**విశాఖపట్నం, ఫిబ్రవరి 19:** విశాఖపట్నంలో జరిగిన ఓ దారుణ ఘటనపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడేళ్ల వయసున్న పసికందుపై జరిగిన లైంగిక దాడిని ఆమె తీవ్రంగా ఖండించారు. ఇలాంటి ఘటనలు నాగరిక సమాజానికి మచ్చ అని పేర్కొన్నారు. ఈ ఘటనపై సమాచారం అందిన వెంటనే రాయపాటి శైలజ విశాఖపట్నం పోలీస్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. కేసు దర్యాప్తు పురోగతిని, నిందితుల వివరాలను రాయపాటి శైలజ అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై ఆమె ఆరా తీశారు. చిన్నారికి మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కేసులో నిందితులకు చట్టప్రకారం అత్యంత కఠిన శిక్షపడేలా.. మహిళా కమిషన్ పక్షాన పర్యవేక్షిస్తామని రాయపాటి శైలజ స్పష్టం చేశారు.

# వ్యక్తిగత ప్రతిష్ట దెబ్బతినేలా కథనాలు

## సాక్షి మీడియాకు రఘురామరాజు లీగల్ నోటీసులు



**అమరావతి,ఫిబ్రవరి 19:** సాక్షి మీడియాకు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు లీగల్ నోటీసులు జారీ చేశారు. తనకు వ్యతిరేకంగా కథనాలు రాయడంతోపాటు తన వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా కథనాలు ఉంటున్నాయంటూ నోటీసులు పంపారు. గురువారం ఇందిరా టెలివిజన్ ఎండీ వైఎస్ భారతి రెడ్డి, ఎడిటర్, బ్యూరో చీఫ్, బోర్డు డైరెక్టర్లతో సహా సాక్షి మీడియా ప్రతినిధులకు లీగల్ నోటీసులు పంపించారు. నోటీసులను న్యాయవాది ఉమేశ్ చంద్ర జారీ చేశారు. తనకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని నోటీసుల్లో రఘురామ డిమాండ్ చేశారు. లేని పక్షంలో సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా పరిహారంగా రూ.కోటి చెల్లించాలని, ఆ మొత్తాన్ని అమరావతి రైతులకు ఇవ్వాలని నోటీసుల్లో స్పష్టంగా పేర్కొన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై కీలక నిర్ణయం

## రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో డెడికేషన్ కమిషన్

**అమరావతి, ఫిబ్రవరి 19:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. బీసీ రిజర్వేషన్లకు ఖరారుకు సంబంధించి.. డెడికేటెడ్ కమిషన్‌ను నియమిస్తూ.. సీనియర్ ఐఏఎస్ మాజీ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్ నిర్ధారించేందుకు బీసీ జనాభా లెక్క తేల్చాలని కమిషన్‌కు ఆదేశాలు జారీ చేసింది. బీసీ జనాభా లెక్కలను తేల్చేందుకు.. సంబంధిత సంస్థలు, ముఖ్యమైన వ్యక్తులు, ఇతర సంఘాల నుంచి వివరాలు సేకరించాలని ప్రభుత్వం పేర్కొంది. 45 రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఏపీ సర్కార్ ఉత్తర్వుల్లో ఆదేశాలు జారీ చేసింది.



# ఉప్పాడతీర ప్రాంత అభివృద్ధి లక్ష్యం

## అన్నిశాఖల సమన్వయంతో ప్రణాళికలు

## ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

**అమరావతి,ఫిబ్రవరి19 :** ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకార సోదరుల సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా సమగ్ర ప్రణాళికను రూపొందించినట్లు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో ఈ ప్రణాళికలకు రూపొందించినట్లు చెప్పారు. 'గతేడాది అక్టోబర్ 9వ తేదీన కాకినాడ కలెక్టరేట్‌లో మత్స్యకారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యకు పరిష్కార మార్గాలు అన్వేషించాం. తీర కాలుష్య నివారణ, కోత నివారణ, మత్స్య సంపద వృద్ధి, అధునాతన పద్ధతుల్లో వేట, మార్కెటింగ్ సదుపాయాలు, ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ, ఇలా మత్స్యకారుల జీవితాలకు భద్రత, భరోసా కల్పించేందుకు అవసరమైన ప్రతి అంశాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ ప్రణాళికలో పొందుపర్చాం. గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపర్చడంతోపాటు వ్యవసాయ అభివృద్ధి, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పన తదితర అంశాలను కూడా పరిగణలోకి తీసుకున్నాం అని ఆయన అన్నారు. వివిధ శాఖల ఉన్నతాధికారులు, మెరైన్ ఫిషరీస్ నిపుణులు, జిల్లా అధికారుల సహకారంతో రూపొందించిన ఈ ప్రణాళికను త్వరలో పిఠాపురం పర్యటనలో ప్రకటించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నిర్దిష్ట లక్ష్యంతో రూపొందించిన ప్రణాళిక - ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారుల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నానని పవన్ అన్నారు.

## పవిత్రరజాన్ పండుగకు హోటళ్లు సన్నద్ధం.

**ఖైరతాబాద్, ఫిబ్రవరి 19(సమయం న్యూస్ )** పవిత్ర రంజాన్ మాసం రోజులు ప్రారంబ మైన నేపద్యం లో ఖైరతాబాద్ నియోజకవర్గం పరిసరద ప్రాశీతాలలోని హోటల్లు కిట కిట లాడు తున్నాయి.పండుగలు ఏవైన కులమత బేదాలు లేకుశీడ సోదరభావశీతో ఆనవాయితీగా నిర్వహించుకుంటామని కొందరు ముస్లిం సోదరులు పేర్కొన్నారు. ఈ పండుగ నెలరోజులు పాటుగా హోటల్లలో హలీంకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తామని చెబుతున్నారు. గతం లో గణేష్ నవరాత్రి ఉచ్చవాలు వచ్చేవని వారు గుర్తుచేస్తూన్నారు. అయినప్పటికి పండుగలు శాంతి యుత వాతావరణంలో జరుపుకు నేవారమని వారు గుర్తు చేస్తున్నారు.

## బల్దియా ఎన్నికలకు ఖైరతాబాద్ లో నాయకుల సన్నద్ధం

**ఖైరతాబాద్, ఫిబ్రవరి 19(సమయం న్యూస్ )** రాజధాని నగరం లోని ఖైరతాబాద్ నియోజకవర్గం లో ఎక్కడ చూసినా కొద్ది నెలల్లో వచే బల్దియా ఎన్నికలకు ఇప్పటి నుండే పలు రాజకీయ పార్టీల వా రు అన్ని విధాలా సన్నద్ధం అవుతున్నారు. ప్రధానశీగా కాశీగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ తదితర వంటి పార్టీలు పాఉలు కదూపు తున్నాయి. ఆయా పార్టీ ల నాయకులు ఇటీవల జరిగిన గ్రామపంచాయతి, మొన్నజరిగిన మునిసిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటి నుంచే వారు మల్లగుల్లాలు పడుతున్నారు.గతం లో ఆరు డివిజన్ లు ఉండేవి. అవి పెరగడం తో అన్నిటిని గెలువాలని యోచిస్తున్నారు. ఓటర్ల నాడి ఎలా ఉశీటదో వేచి చూ డాలి.

## ఖైరతాబాద్ లో చత్రపతి శివాజి జయంతి వేడుకలు.

**ఖైరతాబాద్,ఫిబ్రవరి19(సమయం న్యూస్) :** చత్రపతి శివాజీ మహారాజ్ గారి 396 వ జయంతిని పురస్కరించుకొని ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఖైరతాబాద్ డివిజన్ రైల్వే గేట్ ఖైరతాబాద్ వద్ద గల చత్రపతి శివాజీ మహారాజ్ గారి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన శ్రీమతి పి విజయ రెడ్డి (కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఖైరతాబాద్ నియోజకవర్గం మరియు కార్పొరేటర్ ఖైరతాబాద్ డివిజన్) తదుపరి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు కార్యక్రమంలో కార్యనిర్వహకుల తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

## ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్



**నిజామాబాద్, ఫిబ్రవరి 19( సమయం న్యూస్)** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని గైనిక్ వార్డ్, ఎన్ఐసీయూ విభాగాలను సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది హాజరును, పేషంట్ల కేస్ షీట్లను తనిఖీ చేశారు. ప్రతీ రోజు సగటున ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయి, మాతా శిశు మరణాలు ఏమైనా చోటుచేసుకున్నాయా, అవసరమైన ఔషధాలు అన్ని అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీశారు. జీజీహెచ్ లో అన్ని చోట్ల సీ.సీ కెమెరాలు నిరంతరంగా పని చేసేలా చూడాలన్నారు. మాతాశిశు సంరక్షణ ఆసుపత్రిని సైతం కలెక్టర్ సందర్శించి, సంబంధిత విభాగాల వైద్య సేవలను పూర్తి స్థాయిలో అందించాలని, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు మెరుగైన వైద్యం అందిస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలని, సమయ పాలన పాటించాలని సూచించారు. అత్యవసరం అయితేనే సి.సెక్షన్ లు చేయాలని, సాధ్యమైనంత వరకు సాధారణ కాన్పులు జరిగేలా కృషి చేయాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, వైద్యులు, సిబ్బంది అందరూ అంకితభావంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని అన్నారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలను, పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట వైద్యాధికారులు డాక్టర్ ఎల్.రాములు, జలగం తిరుపతి రావు తదితరులు ఉన్నారు. నిజామాబాద్ జిల్లా పౌర సంబంధాల అధికారి గారిచే జారీ చేయనైనది

## జి హెచ్ ఎం సి విలీనం పై హై కోర్టు కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు.

**హైదరాబాద్ ఫిబ్రవరి19( సమయం న్యూస్) :** G.O.Ms.No.55 ను సవాల్ చేస్తూ దాఖలైన రిట్ పిటిషన్ నం. 4891/2026 -- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసిన తెలంగాణ రాష్ట్ర హైకోర్టుతెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన G.O.Ms.No.55 (తేదీ: 11-02-2026) ను సవాల్ చేస్తూ శ్రీ దరం గురువ రెడ్డి తన న్యాయవాది అడ్వొకేట్ రాజ్‌కుమార్ గుమ్మి ద్వారా గౌరవనీయమైన తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు.సవాల్ చేయబడిన ఈ ప్రభుత్వ ఉత్తర్వు ద్వారా గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (+ఎవీజ) ను మూడు వేర్వేరు మునిసిపల్ కార్పొరేషన్లుగా పునర్వ్యవస్థీకరించేందుకు ప్రయత్నించబడింది. అయితే, రాబోయే జనగణన--2027 కు సంబంధించి రిజిస్ట్రార్ జనరల్ ఒ సెన్సస్ కమిషనర్, ఇండియా 13-08-2025 తేదీన జారీ చేసిన సర్క్యులర్ నం. 01 ద్వారా అమలులో ఉన్న జూరిస్డిక్షనల్ ఫ్రీజ్ కు ఇది విరుద్ధమని పిటిషనర్ వాదించారు.జనగణన కార్యక్రమాల కోసం ఒకసారి జూరిస్డిక్షనల్ ఫ్రీజ్ ప్రకటించబడిన తరువాత, ఆ కాలంలో మునిసిపల్ సరిహద్దుల మార్పులు లేదా స్థానిక సంస్థల పునర్వ్యవస్థీకరణ అనుమతించదగినవి కావని, అలాంటి చర్యలు ప్రారంభం నుంచే చెల్లవని (void ab initio) రిట్ పిటిషన్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. అందువల్ల చట్ట విరుద్ధంగా, అధికార పరిధి లేకుండా జారీ చేసిన ఈ G.O.Ms.No.55 ను రద్దు చేయాలని పిటిషనర్ కోర్టును కోరారు.ఈ వ్యవహారం ఈ రోజు అనగా 19-02-2026 న గౌరవనీయ ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున చేసిన వాదనలు విన్న అనంతరం, గౌరవనీయ న్యాయస్థానం కేంద్ర ప్రభుత్వానికి మరియు రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసి, మూడు వారాల లోపు తమ తమ కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది.కౌంటర్లు దాఖలైన అనంతరం ఈ కేసును తదుపరి విచారణకు తీసుకుంటారు.ఈ విషయానికి సంబంధించిన తదుపరి పరిణామాలను సమయానుకూలంగా తెలియజేయబడతాయి

## నేడు డయల్ యువర్ డిఎం కార్యక్రమం



● **ఆర్టీసీ డిపో మేనేజర్ సురేష్ కుమార్**

**తాండూరు, ఫిబ్రవరి,19(సమయం న్యూస్) :** తాండూరు: తాండూరు డిపో పరిధికి సంబంధించి నేడు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని డిపో మేనేజర్ సురేష్ కుమార్ తెలిపారు. ప్రయాణికుల సమస్యలపై సెల్ నెంబరు cell-9959226251 ఫోన్ చేయాలని కోరారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

# పవిత్ర జీవన దీప్తి..రంజాన్ స్ఫూర్తి

### ప్రారంభమైన పవిత్ర రంజాన్ మాసం ఉపవాస దీక్షలు

పద్నాలుగు వందల ఏళ్ళ కిందట... భయంకర రుగ్మతలతో జనం విలవిలాడారు. ముదిరిన రోగాలకు తోడు హింస దౌర్జన్యం అన్యాయం ఆక్రమాలు, మత్తుపానీయాలు అశ్లీలం అసభ్యత పెచ్చరిల్లాయి. అలాంటి పరిస్థితుల్లో రంజాన్ మాసంలోని ఓ శుభరాత్రి వేళ ఆకస్మాత్తుగా ఆశాకిరణం మెరిసింది. పాపాంధకారాన్ని పారదోలే పవిత్ర ఖురాన్ భూజనులకు అందింది. మానవాళి జీవితాన్ని సంస్కరించి మానవత్వాన్ని పరమళింపచేసింది. అధ్యాత్మిక నైతిక ఆర్థిక. సామాజిక రుగ్మతల్ని నిర్మూలించి .. నీతి న్యాయస్థాపనకు, సమత, సౌభ్రాత్రంతో సమసమాజ స్థాపనకు ఖురాన్ తోడ్పడిందని ముస్లీం మత పెద్దలు చెప్పారు. ఇస్లాం ధర్మంలో ఈమాన్ (విశ్వాసం) నమాజ్,రోజా, జకాత్, హజ్ యాత్ర ముఖ్యమైనవి. వీటిపై శిక్షణ ఇవ్వడానికి రంజాన్ మాసం సరైన సమయం. ఓ విధంగా చెప్పాలంటే ఈనెలంతా ముస్లీంలకు శిక్షణ కాలం వంటిది. ఖురాన్ గ్రంథం ప్రభోదించే సమానత్వం, సౌభ్రాత్రాలను ముస్లీంలు పాటిస్తారు. నమాజ్ లో పఠించే ఖరాన్ సూక్తులు దైవ అదేశాలకు అనుగుణమైన జీవితం గడిపేందుకు ఏలగైతే ఉపకరిస్తాయో రంజాన్ ఉపవాసాలు సైతం మనిషిలో మనోనిగ్రహం. సహనం, స్థైర్యం, దైవబితి, దాతృత్వం పెంపొందిస్తాయి. అందుకే నెలంతా ఉపవాసాలు పాటించాలని విస్తృతంగా దాన ధర్మాలు చేయాలని, తరావి నమాజ్ పాటించాలని సృష్టికర్త ముస్లీంలను అదేశించినట్లు పవిత్ర గ్రంథం ఖురాన్ పేర్కొంది.

ఉపవాసం (రోజా): ఉపవాసంమంటే సంయవనం దురుఉద్దేశాల నుంచి దుష్టవాంఛల నుంచి కాపాడు తుంది. మహ్మద్ ప్రవక్త నిర్దేశానుసారం ముస్లీంలు రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష పాటిస్తారు. ఉత్తమ మానవత్వాన్ని పెంచే ఈ ఉపవాసం ప్రేమ దయారుపాల్లో బహిర్గతమవుతుంది. సాటి మనిషి వృధా భరిత జీవితాన్ని ఎలా అర్థం చేసుకోవాలో భోదిస్తుంది. మానవున్ని పరిణిత కలిగిన వ్యక్తిగా మారుస్తుంది. పరుల సుఖశాంతుల కోసం జీవించేలా చేస్తుంది. ఉపవాసం అధ్యాత్మికమైన ప్రాణవాయువు రంజాన్ మాసంలో అన్ని రోజులు నిరహార దీక్షలో ఉండి తమ ధోరణి వల్ల ఏర్పడిన సమస్యల్ని జరిగిన పాపకృత్యాల్ని తలచుకొని పశ్చాత్తాపంతో మన్నించుమని అల్లాహ్ ని ఎవరు వేడుకొంటారో వారి లక్ష్యం నేరవెరినట్లేనని ఇస్లామ్ ప్రకటిస్తుంది. ఈ ఉపవాసాన్ని అరబిక్ భాషలో "సౌమ్" అంటారు. సౌమ్ అంటే ఏదైనా ఒక వస్తువుకు దూరంగా ఉండటమని అర్థం. ఉషోదయం నుంచి సూర్యస్తమయం దాక తినడం త్రాగడం వంటి వాటికే కాక మనోవాంఛలకు దురుఅలవాట్లకు దూరంగా ఉంటారు. కనుక సౌమ్ (పవిత్ర మాసం) స్థారకమై వెలిసింది. రోజా ఉండే వారు ఉష:కాలనికి ముందే మేల్కోవాల్సి ఉంటుంది. తెల్లవారు జూమునా నాలుగైదు గంటల మద్య అన్నపానీయాలు సేవనం పూర్తి చేస్తారు. దీన్ని "సహేరి" అంటారు. ఇక సూర్యాస్తమయం కాగానే ఉపవాస దీక్ష విరమణ చేస్తారు. దీన్ని "ఇఫ్తార్" అంటారు. ఉపవాస వ్రతం పాటించే వారు ఈ మాసమంతా రోజు అయిదు వేళల నమాజ్ కాక రాత్రి అదనంగా తరావి నమాజ్ ఉంటుంది. మసీదుల్లో ముస్లీంలు తన్మయులవుతారు. ప్రతి ఇల్లు సహేరి-ఇఫ్తార్ తో కొత్త శోభతో అలరారుతుంది. అందరిలోను సేవా దృక్పథం అత్మీయతా భావాలు వెలవడుతాయి. తనలోని కారుణ్య గుణం తన దాసులైన మానవుల్లోను ఉండటాన్ని చూసి అల్లాహ్ ఇష్టపడుతాడు. కరుణించేవాడైనా అల్లాహ్ పేరిట ప్రతి మంచి పని ప్రారభించాలంటుంది. ఇస్లామ్ శాంతి సహనం సామరస్యం త్యాగం ఆధ్యాత్మక ప్రధాన లక్ష్యంగా రూపుదిద్దుకుంటుంది. రంజాన్ మాసం స్వార్థానికి పరమ విరోధిగా ఉండమని బోధిస్తుంది. మహ్మద్ ప్రవక్త ఒక సారి ఇలా చెప్పారు.ఉపవాసంలో ఉ ండి అసత్యం పలికితే ఆ వ్యక్తి కేవలం ఆకలి దప్పులతో ఉన్నట్లు లెక్కఅల్లాహ్ దృష్టిలో అతని ఉపవాసానికి ఎలాంటి విలువ ఉండదు. ఉపవాస లక్ష్యం మనిషి ఆకలి దప్పులతో ఉంచటం కోసం కాదు అసమయంలో అల్లాహ్ పై విధేయత కనబరిచి తన పరిధిలో మరింత పవిత్రంగా ఉండటం అలవరుచుకోవడానికి ప్రభువు నిషేదించిన చెడులకు దూరంగా ఉంచటానికి రంజాన్ మాసం తరువాత కూడ అదే స్ఫూర్తిని కొనసాగించాలి. ఇది ఇస్లాం జీవన విధానంకావాలని నెల రోజుల పాటు చిత్త శుద్ధితో పాటు పరలోక ప్రతిఫల ఆపేక్షతో పచ్చినీరు కూడ తీసుకొకుండా మనోవాంఛలకు దూరంగా కఠిన ఉపవాస దీక్ష నిర్వహించిన తర్వాత వ్యక్తి మనసు శరీరం పూర్తిగా పరిశుద్ధమవుతాడు. రంజాన్ తర్వాత ఆ స్ఫూర్తిని కొనసాగిస్తే ప్రాపంచిక మాయలో పడిపోయో ప్రమాదం ఉండదు. తన పక్క వ్యక్తి ఆకలితో అలమటిస్తుండగా తాను మాత్రం సుఖసంతోషాలతో గడపడం సరికాదని మహ్మద్ ప్రవక్త భోదించారు.

ఫిత్రా: రంజాన్ నెలలో రెండు విధాలుగా దానం చేస్తారు. మొదటిది ఫిత్రా దీన్ని రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరు నిరుపేదలకు చెల్లిస్తారు. ఈ దానం వల్ల పేదల పండుగ అవసరాలు తీరుతాయి. అందువల్ల వాన ఫిత్రాను పండుగ కన్నా వారం రోజుల ముందే ఇవ్వాలి. ఆపైకంతో పేదలు నూతన వస్త్రాలు కొంటారు. ఫిత్ర దానం చెల్లించినంతవరకు రంజాన్ ఉపవాసాలు ఫలప్రదం కాదని ఇస్లామ్ చెప్తుంది. ఫీత్రాకు ముస్లీయేతరులు అర్హులే. కులమతాల విచక్షణ చూపడం ధర్మం కాదంటోంది ఇస్లామ్.

జకాత్ పేదలకు ఆర్థిక హక్కు. రెండవ దానం జకాత్ -జకాత్ అంటే అరబిక్ భాషలో పరిశుద్ధ పరచడం అభివృద్ధి పరచడం అని అర్థాలు- సంపన్నుల వద్ద నిలువ ఉన్న ధనంతో రెండున్నర శాతం ప్రతి సంవత్సరం అల్లాహ్ కానుకగా నిరుపేదలకు అందజేయాలి. సత్కార్యలకు వినియోగించాలి. ముస్లీంలు జకాత్ చెల్లింపులకు రంజాన్ ను ఎంచుకుంటారు. ఇస్లాం ధర్మశాస్త్రానుసారంగా నమాజులు,ఉపవాసం చేసినట్లే జకాత్ సైతం తప్పనిసరిగా పాటించాల్సిన విధి. ఉపవాసం శారీరక పరమైన ఆరాధన అయితే జకాత్ ఆర్థికపరమైన ఆరాధన. దానం వల్ల మానవుల్లో త్యాగం సానుభూతి సహనం పెంపొందుతాయి. ఆత్మ పరిశుద్ధమవుతుంది.

ఎత్తెకాఫ్: ముస్లీం యువకులు రంజాన్ నెలలో పూర్తిగా దైవ ప్రార్థనలో తలమునకలై మసీదుల్లోనే ఉంటారు. అన్నం నీరు అంతా అక్కడే దీనినే ఎత్తెకాఫ్ అంటారు. ఈ మాసం చివరి 10రోజుల్లో ప్రాపంచిక వ్యవహారాలతో సంబంధం లేకుండా కేవలం దైవారాధన దైవనామస్మరణాలతో మసీదుల్లో అయిన ఎత్తెకాఫ్ వేళ మసీదు నుంచి బయటికి రారు. అసలు ఇంటి విషయాలను పూర్తిగా పట్టించుకోరు. మచ్చుకు 10 రోజుల పాటు మసీదులో ఎత్తెకాఫ్ నిర్వహించాలి. దీనితో చేడును దరికి రానీయక పోవడం అత్మనిగ్రహం భక్తి వంటి మాననీయ గుణాలు అలవడుతాయి.

ఫర్జ్: ముస్లీంలు తప్పకుండా పాటించాల్సిన నిబంధనలే ఫర్జ్ ఇవీ చట్టంలోని రూల్స్ వంటివన్నమాట. వీటిని ఎట్టి పరిస్థితుల్లోను ఉల్లంఘించకూడదు. నమాజ్ చేయడం రోజా జకాత్ పాటించడం హజ్ యాత్ర వారి తల్లిదండ్రుల్ని భార్య పిల్లలను పోషించడం రోజుకు 5 వేళల నమాజ్ చేయడం వంటివి ఫర్జ్ వీటిని ఉల్లఘించే విల్లేదు.

సున్నత్: మహ్మద్ ప్రవక్త పాటించిన సంప్రదాయాన్ని నియమాలను సున్నత్ అంటారు. ఆయన పాటించిన అన్ని విషయాల్ని ఆచరించాలి. నమాజ్ కు ముందు వజు చేయడం నియమం-

హదీస్: మహమ్మద్ ప్రవక్త ఉపన్యాసాల సముహారమే హదీస్- ఇస్లాం ప్రకారం జీవితంలో ఏలా నడుచుకోవాలో పలుసందర్భాల్లో ఆయన తన శిష్యులకు సూచించారు వీటినే హదీస్ అంటారు-

లైలతుల్ ఖద్ర్ (షబ్ ఎ ఖద్ర్) ..రంజాన్ నెల చివరి 10 రోజుల్లో అత్యంత శుభ్రప్రదమైన రాత్రి ఒకటుంటుంది. అది 1000 మాసాల కన్న శ్రేష్టతరమైందని ఖురాన్ వివరిస్తుంది. ఈ రేయిని లైలతుల్ ఖద్ర్ అంటే మహత్వపూర్ణమైన రాత్రి అని అర్థం. ఈ రాత్రే దివ్యఖురాన్ అవతరించిందని విశ్వాసం. 1000మాసా లంటే ఒక జీవితం కాలమని భావించి 83 సంవత్సరాలు క్రమం తప్పకుండా చేసే ఆరాధన కన్నా ఈ రాత్రి చేసే ఆరాదన మహత్తరమైంది. ఈ రాత్రంతా మేలుకొని ప్రార్థనల్లోను ధ్యానంలోను గడిపితే హృదయాల్ని అవరించిన అజ్ఞానపు అంధకారం తొలిగిపొయి అధ్యాత్మిక తేజం మనశ్శాంతి " లభిస్తాయని పుణ్యప్రాప్తి జరుగుతుందని విశ్వసిస్తారు. ఇందుకు సంబందించిన అనేక ఉపదేశాలు ఈరాత్రి వింటారు. హృదయం ప్రశాంతమవుతుంది. నిర్మలమై పరోపకార సౌరభాన్ని వెదజల్లుగలుగుతుంది.

రోజా విదులు.. సాధరణంగా ప్రతి విశ్వాసి రంజాన్ నెలలో రోజాతో పాటు అవయావాల రోజా పాటించాలి. దీనికి ఆరు విధాలైన విధుల్ని దృష్టిలో పెట్టుకోవాలి.

1) చూపుకు సంబంధించిన రోజా: చూపులు కిందికి వాల్చుకొవడం,మర్యాద కళ్ళతో మసీద్ను చూడండి. పవిత్ర ఖురాన్ చూడండి. వీలైతే కాబా గృహ కాంతుల్ని చూడండి. సువాసన భరితమైన మక్కా నగర వీధులను దర్శించండి. అంతేకాని అల్లాహ్ నిషేదించిన వస్తువులను చూడకండి. స్త్రీలను చూడకండి. దైవభక్తిని దూరం చేసే ఏ చూపును చూడకండి.

2) నాలుక రోజా: అసభ్యకరమైన మాట నోటితో రాకూడదు. మాట్లాడేటప్పుడు సభ్యత గల మాటలే మాట్లాడాలి. ఖురాన్ పఠణం చేయండి. ఖురాన్ ను దర్శించండి. దైవనామస్మరణ చేయండి. దేవుని గొప్పతనాన్ని ప్రశంసించండి. అనవసర విషయాలు మాట్లాడకండి. తీట్లు పరోక్ష నింద చాడీలు మొదలైన వాటి జోలికి పోకండి. శరీరానికి ఏదైనా మురికి అంటితే దాన్ని కడిగేస్తే పోతుంది కాని నోటిని సప్త సముద్రాలతో కడిగినా అమురికి పోదు.

3)చేతి రోజా:

చేతిని పుణ్యాకార్యం కోసం మాత్రమే ఉపయోగించాలి. మూత్ర శుద్ధి లేకుండా దివ్యఖురాన్ ను తాకరాదు. పుణ్యపురుషులతో చేతిని కలుపాలి. చేతులెత్తి దరుదే షరీఫ్ అర్పించండి. 4)కాళ్ళ రోజా:

నడిస్తే పుణ్యకార్యలు చేసేందుకు నడవాలి. మసీద్ వైపు నడవాలి. పుణ్యాకార్యాలను ప్రోత్సాహించాలి. సహాయం చేసేందుకు నడవాలి.

5)హలాల్ సంపాదన: దీనినే దర్మ సమ్మతమైన సంపాదన అంటారు. ఇఫ్తార్ చేసే సమయంలో తీసుకోవాలి. ఎందుకంటే గొంతు వరకు నిండినా కడుపు కంటే అయిష్టమయినది అల్లాహ్ వద్ద మరేది లేదు.

6)భయం అశ:

రోజా విరమించిన తర్వాత భయం అశ వంటి భావం ఏర్పాడాలి. అల్లాహ్ తమ వ్రతాన్ని అంగీకరించి తన్ను తన ప్రియదాసుల్లో చేర్చుకుంటాడన్న ఆశతో ఉండాలి. జీవితాన్ని సద్భావనలతో సహకారం సహజీవనం వంటి ఉన్నత గుణాలతో సలీకృతం చేసుకున్నప్పుడే ఇహపర సుఖాలు ప్రాప్తిస్తాయన్నది రంజాన్ సందేశం.

# ఆరోగ్య రంగంలో ..ఏఐ విప్లవానికి 'మేధాజెన్ ఏఐ' శ్రీకారం!

● **వైద్య రంగ నూతన ఆవిష్కరణల్లో మేధాజెన్ కీలక పాత్ర**

● **ఆరోగ్య నిపుణులు, విద్యార్థుల నుంచి విశేష స్పందన**




**హైదరాబాద్, ఫిబ్రవరి 19 :** ప్రస్తుత సాంకేతిక ప్రపంచాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) శాసిస్తోంది. ఏఐ ప్రతి రంగాన్ని వేగవంతంగా అభివృద్ధి చేస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆరోగ్య రంగంలో కూడా కృత్రిమ మేధ విప్లవానికి శ్రీకారం చుట్టింది మెధాజెన్ ఏఐ. భారతదేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా వైద్యం, ఆరోగ్య వ్యవస్థల్లో ఏఐ వినియోగాన్ని విస్తృత స్థాయిలో అమలు చేయాలనే లక్ష్యంతో 'మెధాజెన్ ఏఐ' ఆవిష్కృతమైంది. బుధవారం ఈ మెధాజెన్ ఏఐ ను వర్చువల్ గా అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు, పరిశోధకులు, సాంకేతిక నిపుణులు, ఆరోగ్య నిపుణులు, పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు పాల్గొని ఆరోగ్యరంగంలో ఏఐ ఆధారిత మార్పుకు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా మెధాజెన్ ఏఐ సీఈవో డా. భరత్ కుమార్ కక్కిరేణి మాట్లాడుతూ ఆరోగ్యం రంగంలో మెధాజెన్ ఏఐ దీర్ఘకాలిక లక్ష్యాలు, ప్రయోజనాలను వివరించారు. ఈ ఏఐ ద్వారా ఆసుపత్రులను ఇంటలీజెంట్, డేటా ఆధారిత ఆరోగ్య ఎకోసిస్టంలుగా మార్చాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు. క్లినికల్ నిర్ణయాలకు మద్దతు ఇవ్వడం, ఆసుపత్రి పనితీరును మెరుగుపరచడం, పరీక్షల్లో కచ్చితమైన నిర్ధారణ, మెరుగైన ఫలితాల కోసం ఏఐ కీలకమని అభిప్రాయపడ్డారు. ఏఐ నైతికత, డేటా గోప్యత, వివరణాత్మక పద్ధతుల ద్వారా వైద్యుల నమ్మకాన్ని పెంపొందించాల్సిన అవసరాన్ని భరత్ కుమార్ ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వక్త సమీర్ సలీబా మాట్లాడుతూ "వాస్తవ ప్రపంచంలో ఆరోగ్య రంగంపై ఏఐ వినియోగం" అనే అంశంపై ప్రసంగించారు. ఈ ఏఐ ద్వారా నియంత్రణ నిబంధనలు, ఆసుపత్రి వ్యవస్థలతో అనుసంధానం, వైద్యుల ఆమోదం, విస్తృత స్థాయి అమలు వ్యూహాలు వంటి అంశాలను ఆయన వివరించారు.ముఖ్య అతిథిగా మల్లారెడ్డి యూనివర్సిటీ ప్రతినిధి వినోద్ కుమార్ యాట మాట్లాడుతూ ఆరోగ్య రంగంలో కృతిమ మేధ పాత్రను వివరించారు. ఇమేజింగ్, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు, ఓమిక్స్ డేటా ద్వారా ప్రిసిషన్ మెడిసిన్ సాధ్యమని చెప్పారు.మేధాజెన్ ఏఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అభిరామ్ రెడ్డి మాట్లాడుతూ వైద్యం, ఆరోగ్య సంరక్షణలో సహకారాన్ని పెంపొందించడానికి మేధాజెన్ AI నిబద్ధతను వివరించారు. మెధాజెన్ ఏఐ వైద్య రంగంలో ఆవిష్కరణలు, సామర్థ్యం పెంపు, వాస్తవ పరిస్థితుల్లో మెడికల్ ఏఐ పరిష్కారాల అమలుకు ఒక సమిష్టి వేదికగా పనిచేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. క్లినికల్ డెసిషన్ సపోర్ట్ సిస్టమ్స్, ప్రిడిక్టివ్ మరియు ప్రివెంటివ్ హెల్త్ అనలిటిక్స్, డిజిటల్ హాస్పిటల్ రూపాంతరం, స్టార్టప్ ఇన్క్యూబేషన్, విద్యార్థులు మరియు ఆరోగ్య నిపుణులకు ప్రాయోగిక శిక్షణ కార్యక్రమాలపై ప్రధానంగా దృష్టి సారించనుంది.ఈ మెధాజెన్ ఏఐ ఆవిష్కరణ కార్యక్రమానికి వైద్యులు, పరిశోధకులు, విద్యార్థులు, స్టార్టప్ ఎంట్రప్రెన్యూర్స్ నుంచి విశేష స్పందన లభించింది. ప్రస్తుతం ఏఐ యుగంలో మెధాజెన్ ఏఐ స్మార్ట్ ఆసుపత్రుల నిర్మాణానికి, ఆరోగ్య నిపుణుల సాధికారతకు, డేటా ఆధారిత, రోగి కేంద్రిత వైద్య భవిష్యత్తు రూపకల్పనకు బలమైన పునాది వేసింది.

# మచ్చ బొల్లారం ఆర్‌యుబి నిర్మాణంపై అధికారులతో సమీక్ష సమావేశం

**-- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**

**మల్కాజ్‌గిరి సమయం న్యూస్ ఫిబ్రవరి 20 :** ఈ రోజు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మల్కాజ్‌గిరి శాసనస భ్యులు శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి గారి అధ్యక్షతన మచ్చ బొల్లారం రైల్వే గేటు నెం-250 వద్ద ఆర్‌యుబి (Railway Under Bridge) నిర్మాణానికి సంబంధించి అధికారుల తో సమీక్ష సమావేశం నిర్వహించారు. మచ్చ బొల్లారం రైల్వే గేటు వద్ద తరచుగా ఏర్పడుతున్న ట్రాఫిక్ రద్దీ మరియు ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆర్‌యుబి నిర్మాణం అత్యవసరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆర్‌యుబి నిర్మాణం పూర్తయితే సమయభావం తగ్గి, ట్రాఫిక్ సమస్యలు తగ్గుముఖం పట్టి, స్థానిక ప్రజలకు మరియు ప్రయాణికులకు పెద్దఎత్తున ఉపశమనం కలుగుతుందని తెలిపారు. భూసేకరణ, సర్వే, సాంకేతిక అంశాలు మరియు శాఖల సమన్వయం విషయాలపై సంబంధిత అధికారులతో సవివరంగా చర్చించారు. పనులు వేగవంతంగా ప్రారంభమయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రైల్వే ల్యాండ్ ఆక్విజిషన్ అధికారి శేషాచారి, రైల్వే సెక్షన్ ఇంజనీర్ సామ్రాట్ రాయ్, అల్వాల్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ బోగేశ్వర్లు, అల్వాల్ డిప్యూటీ తహసీల్దార్ పృథ్వి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్ రెడ్డి, ట్రాఫిక్ ఏసిపి శంకర్ రాజు, హెచ్ఆర్‌డీసీఎల్ డి.ఈ. అరవింద్ కుమార్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏ.డి. శ్రీనివాసులు, మేడ్చల్ జిల్లా డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ కె. శ్రీనివాసాచారి, జలమండలి డీజీఎం సాంబయ్య, మచ్చ బొల్లారం కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు. మచ్చ బొల్లారం అభివృద్ధి పనుల పట్ల ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గారు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని స్థానికులు అభినందించారు.



# పబ్లిక్ వీధిలో ఉన్న అనధికార నిర్మాణాన్ని కూల్చివేయకుండా రక్షణ కోరిన ఒక వ్యాజ్యంపై బాంబే హైకోర్టు రూ. 5 లక్షల జరిమానా విధించింది,

**ముంబయి ఫిబ్రవరి19( సమయ్దం న్యూస్).:** ప్రభుత్వ భూమిలో అక్రమాన్ని కొనసాగించాలని కోరుకునే పక్షం సమానమైన ఉపశమనం పొందే అర్హత లేదని పేర్కొంది. వ్యాజ్యం ద్వారా అటువంటి నిర్మాణాలను దీర్ఘకాలికంగా నిలుపుకోవడం ఇలాంటి ఆక్రమణలను ప్రోత్సహిస్తుందని మరియు మున్సిపల్ పాలనను దెబ్బతీస్తుందని కోర్టు పేర్కొంది. ముంబైలోని ఎం.జి. రోడ్‌లోని ఒక నిర్మాణాన్ని కూల్చకుండా మున్సిపల్ కార్పొరేషన్‌ను నిరోధించాలని కోరుతూ అప్పీలుదారు దాఖలు చేసిన నోటీసును కొట్టివేసిన సిటీ సివిల్ కోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన అప్పీలును జస్టిస్ కమల్ ఖటా విచారిస్తున్నారు. తన తండ్రి 1986లో ఒక ఒప్పందం ప్రకారం ఆ స్థలాన్ని సంపాదించారని మరియు ఆ నిర్మాణం అనేక దశాబ్దాలుగా ఉందని అప్పీలుదారు పేర్కొన్నారు. ఈ నిర్మాణం ప్రజా వీధిలో భాగంగా ఉన్న మున్సిపల్ ఫుట్‌పాత్‌పై ఉన్న అనధికార నిర్మాణం అని మరియు అడ్డంకులను తొలగించి ట్రాఫిక్ ప్రవాహాన్ని మెరుగుపరచడానికి ప్రయత్నంలో భాగంగా తొలగించాల్సిన బాధ్యత ఉందని కార్పొరేషన్ వాదించింది. నిర్మాణానికి సంబంధించి ఎటువంటి చట్టబద్ధమైన హక్కు లేదా అధికారాన్ని ఏర్పాటు చేయడంలో అప్పీలుదారు విఫలమయ్యారని కోర్టు పేర్కొంది. 1986 సెప్టెంబర్ 12 నాటి ఒప్పందం రిజిస్టర్ చేయబడలేదు, ప్రభుత్వ భూమికి సంబంధించినది మరియు ఒక నిర్మాణంలో ఎటువంటి చెల్లుబాటు అయ్యే వడ్డీని బదిలీ చేయలేదు. విద్యుత్ ఛార్జీలు, మున్సిపల్ పన్నులు లేదా దుకాణం మరియు ఎస్టాబ్లిష్‌మెంట్ సర్టిఫికెట్‌ను స్వాధీనం చేసుకోవడం వల్ల అనధికార నిర్మాణాన్ని ఆరు సంవత్సరాలకు పైగా స్వాధీనం చేసుకోవడం లేదా క్రమబద్ధీకరించడం జరగదని కోర్టు పునరుద్ఘాటించింది.

2019లో నోటీసు జారీ చేసినప్పటి నుండి ఆరు సంవత్సరాలకు పైగా అప్పీలుదారుడు అనధికార నిర్మాణాన్ని స్వాధీనం చేసుకోవడంలో విజయం సాధించాడని కోర్టు గమనించింది. వ్యాజ్యం ద్వారా సులభతరం చేయబడిన ఈ దీర్ఘకాలిక నిలుపుదల ప్రతికూల సంకేతాన్ని పంపుతుంది మరియు విచారణ పెండింగ్‌లో ఉన్నప్పుడు అక్రమ నిర్మాణాల నుండి ప్రయోజనం పొందడాన్ని తప్పు చేసిన వారిని ప్రోత్సహిస్తుంది. ప్రభుత్వ భూమిలో అనధికార నిర్మాణం యొక్క రక్షణ కోరే న్యాయవాది సమాన అధికార పరిధిని కోరలేదని మరియు చట్టవిరుద్ధమైన ఆక్రమణను చట్టబద్ధం చేయడానికి ప్రయత్నించే పార్టీలకు కోర్టులు ఉపశమనం నిరాకరించాలని అది పేర్కొంది. రెండు దశాబ్దాలకు పైగా అనధికార నిర్మాణం ఉండటం, ముఖ్యంగా మున్సిపల్ చౌకీ వెనుక మరియు రైల్వే లైన్‌కు ఆనుకుని ఉండటం, విధి నిర్వహణలో నిర్లక్ష్యం గురించి తీవ్రమైన ఆందోళనలను లేవనెత్తిందని కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. సుదీర్ఘమైన నిష్క్రియాత్మకతకు బాధ్యత వహించేవారిని గుర్తించడానికి మరియు సంబంధిత అధికారుల సర్వీస్ రికార్డులపై ఆర్డర్ ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించింది. "మునిసిపల్ చౌకీ వెనుక మరియు రైల్వే లైన్‌కు ఆనుకుని ఉన్న అనధికార నిర్మాణం యొక్క స్థానం తీవ్రమైన మరియు ఇబ్బందికరమైన ప్రశ్నలను లేవనెత్తుతుంది. మున్సిపల్ అధికారుల ఉద్దేశపూర్వక అంధత్వం లేదా విధి నిర్వహణలో నిర్లక్ష్యం లేకుండా అటువంటి నిర్మాణం సంవత్సరాలుగా ఉండేది కాదు" అని కోర్టు పేర్కొంది. దీని ప్రకారం, నాలుగు వారాల్లోపు సాయుధ దళాల యుద్ధ ప్రమాదాల సంక్షేమ నిధికి రూ. 5,00,000/- ఖర్చుతో అప్పీల్‌ను కొట్టివేసింది. కార్పొరేషన్ లేదా దాని ఉద్యోగులు భవిష్యత్తులో కోర్టు ఆదేశాలను ఉల్లంఘించవద్దని కోర్టు హెచ్చరించింది, అటువంటి ఉల్లంఘనలు శాఖాపరమైన విచారణ మరియు సస్పెన్షన్‌తో సహా కఠినమైన పరిణామాలను కలిగిస్తాయని పేర్కొంది.

కేసు శీర్షిక: ప్రీతి మనోహర్ సక్పాల్ వర్సెస్ గ్రేటర్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ & సీనియర్

ఆర్డర్ నెం. నుండి అప్పీల్‌లో 2025లోని ఫిర్యాదు పిటీషన్ నెం. 330. 2024 లో 874





# రైతుల సౌకర్యార్థం బజార్ లో మౌలిక సదుపాయాలు కల్పనకు చర్యలు

**-వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్**

**వికారాబాద్, ఫిబ్రవరి,19(సమయం న్యూస్) :** రైతుల సౌకర్యార్థం రైతు బజారులో మౌలిక సదుపాయాలు కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. వికారాబాద్ పట్టణ కేంద్రంలోని రైతు బజారును ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు, విక్రయదారులతో రైతు బజారులోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేసవి,వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకొని కనీస వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. రైతు బజారులో టాయిలెట్లు, షెడ్ల ఏర్పాటుతోపాటు నీటి సౌకర్యం కల్పించాలని అధికారులకు సూచించారు. వర్షపు నీరు రైతు బజార్ లోకి రాకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ సుధీర్, మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య, వైస్ చైర్మన్. అర్థ సుధాకర్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉమేష్, మార్కెటింగ్ అధికారి సారంగపాణి, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు



# స్కూల్స్ మరియు స్వయం సహాయక సంఘాల

**● (SHG)భవన నిర్మాణ పనులు వేగవంతం పూర్తి చేయాలి-కలెక్టర్**

**వికారాబాద్, ఫిబ్రవరి,19(సమయం న్యూస్) :** స్కూల్స్ మరియు స్వయం సహాయక సంఘాల ఎస్. హెచ్.జి (SHG) భవన నిర్మాణ పనులు వేగవంతంగ పూర్తి చేయాలనీ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. గురువారము వీడియో కాన్ఫరెన్సు హాలు నుండి అన్ని మండలాల ఏం పి డి ఓ లతో సమీక్ష సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో కంపౌండ్ వాల్ నిర్మాణ పనులు , పాఠశాలల మౌలిక వసతుల అభివృద్ధి మరియు మహిళల సాధికారతకు తోడ్పడే స్వయం సహాయక సంఘాల ఎస్ హెచ్ జి (SHG)భవన నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగాలని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మన ఊరు--మన బడి కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో తరగతి గదులు, శౌచాలయాలు, తాగునీటి సదుపాయాలు, కాంపౌండ్ వాల్స్ వంటి మౌలిక వసతుల పనులు త్వరగా పూర్తి చేయాలనీ ఆదేశించారు. పాఠశాల ప్రాంగణాన్ని సురక్షితంగా ఉంచడం, అనధికార ప్రవేశాలను నిరోధించడం, విద్యార్థులకు సురక్షితమైన వాతావరణం కల్పించడం ప్రధాన లక్ష్యంగా ఈ నిర్మాణాలు చేపట్టాలని, అన్ని సౌకర్యాలు కలిపించడం వల్ల పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరగడంతో పాటు, తల్లిదండ్రుల్లో విశ్వాసం మరింత బలపడుతుందని అన్నారు. అదేవిధంగా మహిళల ఆర్థిక స్వావలంబనను పెంపొందించేందుకు స్వయం సహాయక సంఘాలకు ప్రత్యేక భవనాల నిర్మాణం చేపట్టబడిందని,ఈ భవనాలలో సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, ఆదాయోపాధి కార్యకలాపాలకు ఉపయోగపడనున్నాయని, గ్రామీణ ప్రాంతాల్లో మహిళల భాగస్వామ్యం మరింత బలపడుతుందని, నిధులు మంజూరై మొదలు పెట్టని భవన నిర్మాణ పనులను ప్రారంబించాలని అన్నారు. అధికారుల సమన్వయంతో నిర్మాణ పనులు నిర్దిష్ట గడువులో పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని , పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించి, పారదర్శకతతో అమలు చేయాలని అన్నారు. పనుల పురోగతి పై మండలం వారిగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సుదీర్, జిల్లా పంచాయతి అధికారి జయసుధ, జిల్లా విద్యా శాఖాదికారి రేణుకా దేవి, పంచాయతి రాజ్ ఇ ఇ ఉమేష్ కుమార్, అన్ని మండలాల ఎం పి డి ఓ లు, ఎం పి ఓ లు తదితరులు పాల్గొన్నారు.

# గీత కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

**● కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలి ...-రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ**

**హైదరాబాద్ ఫిబ్రవరి19( సమయం న్యూస్) :** రాష్ట్రంలో వున్న కల్లుగీత కార్మిక కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు ఎలాంటి చర్యలు ఇప్పటివరకు తీసుకోలేదు. తక్షణమే గీత కార్మికులు, కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం స్పందిచాలని సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్రకమిటీ డిమాండ్ చేస్తున్నది. రాష్ట్రంలో ఐదు లక్షలకు పైగా కల్లుగీత కార్మిక కుటుంబాలు ఉన్నాయి. గత రెండు సంవత్సరాల కాలంలో చెట్లెక్కి కిందపడి వృత్తికి దూరమైన కార్మికులు 850 మంది ఉన్నారు. 140 మంది చనిపోయారు. మరో 170 మంది శాశ్వతంగా వికలాంగులైనారు. వారికి ఇస్తామన్న ఐదు లక్షలు ఇవ్వలేదు. 14 కోట్ల రూపాయలు పెండింగ్లో ఉన్నాయి. ఎక్స్‌గ్రేషియా 5లక్షల నుండి 10 లక్షల వరకు పెంచుతామన్న కామారెడ్డి డిక్లరేషన్ హామీ నేటికీ అమలు చేయడం లేదు. దీంతోపాటుగా నీరాకేఫ్‌ను అభివృద్ధి చేసి ఆ కార్మిక కుటుంబాలను ప్రభుత్వం ఆదుకునే బాధ్యతను నిర్లక్ష్యం చేస్తున్నది. గీత కార్మికసంఘం ఆధ్వర్యంలో కార్మికులు నిన్న ఇందిరాపార్క్ వద్ద పెద్ద ఎత్తున దీక్షా కార్యక్రమం నిర్వహించి, ఆందోళన చేశారు. కార్మికుల పోరాటానికి సిపిఎం మద్దతు తెలియజేస్తున్నది. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కార్మికులకు ఐదు లక్షల నుండి పది లక్షల వరకు ఇస్తామన్న ఎక్స్ గ్రేషియా అమలు చేయాలని, 14 కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలని, పెన్షన్ రు.4000 కు పెంచాలని అట్లాగే నీరా మరియు తాటి ఈత ఉత్పత్తులను అభివృద్ధి చేసి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని, ఈ బడ్జెట్లో 5000 కోట్ల రూపాయలు కేటాయించడానికి ముఖ్యమంత్రిగారు అవసరమైన చర్యలు తీసుకోవాలని సిపిఐఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది. ప్రభుత్వం స్పందించకపోతే కార్మికులు చేసే పోరాటాలకు పూర్తిగా మద్దతునిస్తూ అవసరమైతే ప్రత్యక్ష పోరాటాలకు కూడా సిపిఎం పార్టీ సిద్ధమవుతుందని తెలియజేస్తున్నాం.

# సృజనాత్మకతను పెంపొందించేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం

**● కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**నిజామాబాద్, ఫిబ్రవరి 19( సమయం న్యూస్).** విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీస్తూ, వారిలో సృజనాత్మకతను పెంపొందించేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. జిల్లా కేంద్రంలోని నవ్యభారతి గ్లోబల్ స్కూల్ లో యంగ్ ఇన్నోవేటర్స్ ఇన్ యాక్షన్ పేరుతో గురువారం "ఆవిష్కార్" కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి ముఖ్య అతిథిగా విచ్చేసి, విద్యార్థిని విద్యార్థులు రూపొందించిన వైజ్ఞానిక ప్రదర్శనల నమూనాలను ఎంతో ఆసక్తితో తిలకించారు. లాభదాయకమైన కూరగాయల పంటల సాగు, సోలార్ వినియోగం, పర్యావరణ పరిరక్షణకు ఉపకరించే సాధనాలు, కాలుష్య నియంత్రణ, ట్రాఫిక్ నిబంధనలు, ఆరోగ్యకరమైన ఆహారం, సన్ డయల్, అంతరిక్ష పరిశోధన నమూనాలు తదితర అంశాలపై సరికొత్త ఆలోచనలతో సృజనాత్మకతను జోడిస్తూ ప్రదర్శనలు రూపొందించిన విద్యార్థిని, విద్యార్థులను అభినందించారు. ఒక్కో ఎగ్జిబిట్ ను సందర్శిస్తూ, వాటి వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేవలం తరగతి గది, పుస్తకాలకే పరిమితం కాకుండా అనేక అంశాలలో విద్యార్థులు సైన్స్ ఫేర్ లో పాల్గొని తమ ప్రతిభను చాటడం ఎంతో గొప్ప విషయమని, ఈ దిశగా విద్యార్థులను పాఠశాల యాజమాన్యం ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు మరిన్ని కొత్తకొత్త ప్రయోగాలు చేసేలా తోడ్పాటును అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సంతోష్, శ్రీదేవి, ప్రిన్సిపాల్ ఆంథోని, లత, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# జంబు రాములు మృతి పట్ల సంతపం ప్రకటించి వారి కుటుంబానికి ఆర్థిక సహాయం

**● బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మద్దూరు ఎం.డి.సలీం**



**మద్దూరు మున్సిపల్, ఫిబ్రవరి,19(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా మద్దూర్ మున్సిపాలిటీ రేనివట్ల గ్రామంలో జంబు రాములు మృతి పట్ల సంతపం ప్రకటించి వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేసిన కొడంగల్ నియోజకవర్గ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మద్దూరు ఎం.డి సలీం మరియు 8వ వార్డు కౌన్సిలర్ బోడ కృష వేణి శ్రీనివాస్ మరియు వార్డు పెద్దలు ఉన్నారు.

# ఘనంగా శివాజీ జయంతి వేడుకలు



**రాయపోల్,ఫిబ్రవరి19:**రాయపోల్ మండలం మంతూరు గ్రామంలో మహారాష్ట్ర వీరుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ 394వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఉపసర్పంచ్ బందారం సంతోష్ మాట్లాడుతూ శివాజీ ధైర్యసాహసాలు, దేశభక్తి యువతకు ఆదర్శమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు

● శ్రీ ఛత్రపతి శివాజీ వినాయక కమిటీ ఆధ్వర్యంలో

● యాలాల మండల కేంద్రంలో శ్రీ ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు



**యాలాల మండలం, ఫిబ్రవరి,19(సమయం న్యూస్) :** కుల,మత,వర్ణ బేధాలు లేకుండా తన సైన్యం లో అందరినీ చేర్చుకొని,అందరినీ సమానంగా మనుషులంతా సమానం అని సమానత్వాన్ని,మానవత్వాన్ని,దేశం పట్ల తనకున్న ప్రేమ తో ధీరత్వాన్ని చాటిన చరిత్ర మహనీయుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి పుష్కరించుకొని యాలాల మండల కేంద్రంలోని శ్రీ ఛత్రపతి శివాజీ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా,కుల మత బేధాలు లేకుండా ముస్లిం సోదరులతో కలిసి జయంతి ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు.ఉత్సవాల్లో పాల్గొన్న,గ్రామ ఉపసర్పంచ్, మల్కిరెడ్డి శోభరాజ్ రెడ్డి, ఏఎంసి డైరెక్టర్ గోనెగర శ్రీనివాస్, ఛత్రపతి శివాజీ కమిటీ మ్యాదరి నవీన్,కుర్వ కార్తీక్,శివ, బాలు మరియు గ్రామ కమిటీ అధ్యక్షులు రాపోల్ నాగయ్య, వార్డు సభ్యులు,మైనారిటీ సోదరులు గంలల్ హైమద్, గంతల్ మైనొద్దీన్, కరణ్ కోట్ బసీర్, జబ్బర్ ,మౌలానా మోసిన్, నవాజ్, ఆఫీజ్ బుర్నపురి నర్సింలు అశోక్ కుమార్ నాయి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

## 1 టౌన్ లో ఛత్రపతి శివాజి జయంతి వేడుకలు



**ఖమ్మం, ఫిబ్రవరి 19 : ( సమయం న్యూస్ ) :** భారతీయ జనతాపార్టీ 1టౌన్ అధ్యక్షులు గడిల నరేష్ ఆధ్వర్యంలో స్థానిక గుర్రాలబొమ్మ సెంటర్ (ముస్తఫానగర్ ) లో గురువారం ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలు నిర్వహించారు.ఈ సందర్భంగా బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు,1 టౌన్ అధ్యక్షులు గడిల నరేష్ మాట్లాడుతూ శివాజీ మహారాజ్ మరాఠా యోధునిగా అందరి గుండెల్లో నిలిచి పోయారని కొనియాడారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని అందరూ వారి అడుగు జాడల్లో ప్రతిఒక్కరు నడుచుకోవాలని అన్నారు . ఈ కార్యక్రమం లో బీజేపీ జిల్లా నాయకులు గుత్తా వెంకటేశ్వర్లు , డోకూపర్తి రవీందర్ , దుద్దుకూరి వెంకటేశ్వర్లు , మందడపు ప్రభాకర్ రెడ్డి , పొట్టిమూతి జనార్దన్ , బండారు శ్రీను , విజయరాజు , సురేష్ గౌడ్ , బీజేపీ నాయకులు పాలేపు రాము , పొట్టిమూతి వాణి , బొడ్ల శ్రీను , కడుదుల ప్రభాకర్ , బాలి బిందు , లోడంగి సత్యనారాయణ , మరిమెల్ల రామకృష్ణ , పార్వతి , మహీందర్ సింగ్ , కృష్ణ చారి , అశోక్ , మహేష్ , శేఖర్ పాల్గొన్నారు .

## రాష్ట్రస్థాయి సీఎం కప్పు కు ముగ్గురు మల్లెమడుగు విద్యార్థుల ఎంపిక



**ఖమ్మం , ఫిబ్రవరి 19 : ( సమయం న్యూస్ ):** ఇటీవల ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియం లో జరిగిన సిఎం కప్ జిల్లాస్థాయి ఫుట్బాల్ క్రీడలో బాలికల విభాగం నుండి బాలుర విభాగం నుండి జిల్లా స్థాయిలో గోల్డ్ మోడల్ సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబ రిచిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ( మల్లెమడుగు ) 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు కె.అనిత, ఏ.వెన్నెల, ఎం.జానీ లు రాష్ట్రస్థాయి సీఎం కప్ ఫుట్బాల్ ఛాంపియన్షిప్ కు ఎంపికయ్యారు.శుక్రవారం నుండి ఆదివారం వరకు హైదరాబాదులోని గచ్చిబౌలి స్టేడియంలో ఖమ్మం జిల్లా టీం నుండి వీరూ పాల్గొంటున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. సాంబమూర్తి, పిడి బియ్యని కృష్ణయ్య ఒక ప్రకటనలో తెలియజేశారు. అనిత గతంలో రాష్ట్రస్థాయి సీఎం కప్ గోల్డ్ మెడల్, రాష్ట్రస్థాయి జూనియర్ ఫుట్బాల్ ఛాంపియన్షిప్లో సిల్వర్ మెడల్, రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఫుట్బాల్ ఛాంపియన్షిప్లో కాంస్య పథకం, వెన్నెల జానీ రాష్ట్రస్థాయి ఫుట్బాల్ ఛాంపియన్షిప్లో పాల్గొన్నారని చెప్పారు.రాష్ట్రస్థాయి సీఎం కప్ ఫుట్బాల్ ఛాంపియన్షిప్ కి ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు సాంబమూర్తి, ఉపాధ్యాయులు కృష్ణవేణి, శారద , హేమలత, స్వర్ణలత, సుధాకర్, బ్రహ్మాచారి,అమ్మాజీ, దేవ మనమ్మ, వెంకటేశ్వర్లు,సుజాత,అరుణ బాలమణి, రాజకుమారి, జానమ్మ నవీన్ సాహూ, సురంగా అభినందించగా, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షులు అలివేణి, 59, 60 డివిజన్ కార్పొరేటర్స్ లలితా రాణి, నిరంజన్ కుమార్, గ్రామ పెద్దలు కృష్ణమూర్తి, బోజర్ల సూర్యం, కృష్ణ, జానీ మియా, వెంకయ్య, వైకుంఠ చారి, తాటికొండ శ్రీనివాస్, తిరుపతిరావు, సైదులు, బట్టబోతుల సతీష్ లు అభినందనలు ప్రకటించారు

## నూతన మున్సిపల్ చెర్మెన్ నందారం ప్రశాంత్ ను సన్మానించిన (PRTU TS )కొడంగల్ మండల శాఖ



**కొడంగల్ మున్సిపల్, ఫిబ్రవరి,19 (సమయం న్యూస్) :** కొడంగల్ మున్సిపల్ చైర్మన్గా ఎన్నికైన నందారం ప్రశాంత్ ను (ా=ుఖ యా )మండల శాఖ సన్మానించటం జరిగినది.ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు అబ్దుల్ హక్,ప్రధాన కార్యదర్శి దినేష్ సింగ్, రాధాకృష్ణ ,యాదగిరి,గోపీనాథ్,ఆనందరావు ,డి. రవి మహేందర్ సింగ్ , సేవ్యా నాయక్, జయపాల్ నాయక్ , మోహన్ బాబు , శివ కుమార్,చంద్రశేఖర్ , రాజేంద్ర ప్రసాద్, రామకృష్ణ మరియు మహిళా ఉపాధ్యాయులు మహేశ్వరి, హరిత పాల్గొన్నారు.

# ట్యాంక్‌పై హంగామా... కిందకు దిగగానే విచారణ!

● ఆరేపల్లిలో మాజీ సర్పంచ్ ఆరోపణల గోల... ఆధారాలు మాత్రం చూపలేదు.



రాయపోల్ మండలం ఆరేపల్లిలో బుధవారం సాయంత్రం మాజీ సర్పంచ్ కర్ణాకర్ వాటర్ ట్యాంక్ ఎక్కిన ఘటన గ్రామంలో చర్చనీయాంశంగా మారగా,గురువారం అధికార యంత్రాంగం రంగంలోకి దిగింది. డీఎల్పీఓ లత, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీఓ శివకుమార్ గ్రామానికి చేరుకుని పరిస్థితులను సమగ్రంగా పరిశీలించారు.మాజీ సర్పంచ్ కరుణాకర్ చేసిన ఆరోపణలు, ప్రస్తుత పాలకవర్గంపై వచ్చిన అభ్యంతరాలపై అధికారులు లోతుగా ఆరా తీశారు. సర్పంచ్ దివ్యకృష్ణ, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలతో కలిసి ఓపెన్ చర్చ నిర్వహించారు. ఆరోపణలు గట్టిగానే వినిపించినా, వాటిని బలపరిచే సాక్ష్యాలు మాత్రం ఎక్కడా కనిపించలేదు. “ఆధారాలు ఇవ్వండి” అన్న అధికారుల మాటకు ఎవరూ ముందుకు రాకపోవడం గమనార్హం.గ్రామంలో నెలకొన్న అసలు వివాదానికి కేంద్రబిందువైన పెండింగ్ బిల్లుల అంశంపై కూడా విచారణ సాగింది. పంచాయతీ నుంచి చెల్లించాల్సిన బకాయిలు ఉన్నట్లు అధికారులు స్పష్టం చేయగా, గత పాలన, ప్రస్తుత పాలకవర్గం మధ్య భేదాభిప్రాయాలే సమస్యకు కారణమని తేలింది.అంతిమంగా ఇరువర్గాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చిన అధికారులు, చెల్లింపులను విడతలవారీగా పూర్తి చేసేలా మార్గదర్శకత్వం ఇచ్చారు. సమస్యలను ట్యాంక్ ఎక్కి కాకుండా చర్చలతో పరిష్కరించుకోవాలని హితవు పలికారు.ఘటనతో ఒక్కసారిగా ఉత్కంఠ నెలకొన్న ఆరేపల్లి, అధికారుల జోక్యంతో మళ్లీ సాధారణ స్థితికి చేరుకున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

# పీఎండీడీకే వై పథకం అమలు పురోగతి పై సమీక్షించిన ఆయిల్ సీడ్ పరిశోధన డైరెక్టర్



**నారాయణపేట, ఫిబ్రవరి,19(సమయం న్యూస్) :** ప్రధాన మంత్రి ధన్ ధన్య యోజన(ావీణణఖ్) ప్రత్యేక అధికారి భారత ప్రభుత్వ ఆయిల్‌సీడ్స్ పరిశోధన డైరెక్టర్ డా. పొన్నుస్వామి గురువారం నారాయణపేట జిల్లాను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో కలెక్టర్ సిక్తా పట్నాయక్ తో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో పీఎండీడీకే వై పథకం అమలు పురోగతిని సమగ్రంగా పరిశీలించారు. జిల్లా స్థాయి అధికారులు పథకం అమలుపై వివరాలను శాఖల వారీగా నివేదించగా డా. పొన్నుస్వామి కార్యక్రమం మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచనలు చేశారు. పథకం మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి అవసరమైన ప్రతిపాదనలను శాఖల వారీగా పంపించాలని ఆదేశించారు. ఆ పథకం పరిధిలోని వ్యవసాయ, మత్స్య, పాడి పరిశ్రమ, కో-ఆపరేటివ్, గ్రామీణాభివృద్ధి, ఉద్యాన శాఖల అధికారుల తో సుదీర్ఘంగా చర్చించి, అమలు కు అవసరమైన సలహాలు ఇచ్చారు. అంతకు ముందు డా.పొన్ను స్వామి మరికల్ మండలంలోని కూరగాయలు, ఆయిల్ పామ్, మొక్క జొన్న పంట పొలాలను సందర్శించి, రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. పంటల స్థితిగతులు, సాగు పద్ధతులు, ఉత్పాదకత, ఎదురవుతున్న సమస్యలు వంటి అంశాలపై రైతుల అభిప్రాయాలు తెలుసుకుని, అధికారులతో చర్చించి సూచనలు అందించారు. పథకం అమలుపై జిల్లా అధికారులు, రైతుల నుంచి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి సాయిబాబా, డిఆర్డిఓ మొగులప్ప, జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్, కోపరేటివ్ జిల్లా అధికారి ప్రసాద్ రావు, జిల్లా వెటర్నరీ ఒ పశుసంవర్ధక అధికారి ఈశ్వర్ రెడ్డి, నాబార్డ్ ఏజీఎం షణ్ముఖ చారి, ఎల్డీఎం విజయకుమార్, డిపిఓ సుధాకర్ రెడ్డి, సైంటిస్ట్ రాజేంద్ర కుమార్, సమితి సభ్యులు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# వివిధ శాఖల ద్వారా చేపట్టుతున్న పనులను వేగవంతంగా పూర్తిచేయండి.

● జిల్లా కలెక్టర్



**కామారెడ్డి ఫిబ్రవరి19( సమయం న్యూస్).:** ప్రభుత్వ పాఠశాలలో నిర్మిస్తున్న మరుగుదొడ్ల స్థితిగతులు, అంగన్‌వాడీ భవనాలు ,మరుగుదొడ్ల నిర్మాణం/పరిరక్షణ, గ్రామపంచాయతీ భవనాల పురోగతి, (MGNREGS) కింద వరద పనులు, EGS పనుల తీరు పై గురువారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరు పై జిల్లా కలెక్టర్ సమగ్ర సమీక్ష నిర్వహించి, ఆయా శాఖల మండల అధికారుల పని తీరు పై ఆరా తీసి, నిర్లక్ష్యం వహించకుండా నిర్మాణ పనుల ను వేగవంతం చేసి 15 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా పాఠశాలలలోని మరుగుదొడ్ల ప్రస్తుత స్థితిగతులు, వాటి వినియోగం, పరిశుభ్రత తాగునీటి సదుపాయాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొని విద్యార్థులకు అనుకూల వాతావరణం కల్పించేలా మరుగుదొడ్లను నిర్మించి ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, అవసరమైన మరమ్మతులు తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో మరుగుదొడ్ల ఏర్పాటు పై, నిర్మాణంలో ఉన్న భవనాలను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని, ఇప్పటికే పూర్తయిన భవనాలలో మరుగుదొడ్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్యం, భద్రత దృష్ట్యా పరిశుభ్రత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని తెలిపారు.గ్రామపంచాయతీ భవనాల నిర్మాణ పురోగతిని పరిశీలిస్తూ, పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రాథమిక సదుపాయాలతో భవనాలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు.ఆయా నిర్మాణ పనులు వవజూతీ త్వరగా పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలని, స్త్రజూ ల వారిగా పురోగతి కల్పించాలని అన్నారు.అదేవిధంగా (MGNREGS) కింద చేపడుతున్న వరద నివారణ పనులు , EGS పనుల అమలు తీరుపై వివరాలు తెలుసుకున్నారు. పనుల నాణ్యత, కార్మికులకు సమయానికి వేతనాల చెల్లింపు, పారదర్శకత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో రక్షణ చర్యలు సమర్థవంతంగా చేపట్టాలని, అవసరమైన చోట్ల తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ సమావేశం లో జిల్లా స్తాయి ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# వ్యవసాయ రంగ బలోపేతానికి డీలర్లకు డిప్లమో శిక్షణ ప్రారంభం



**సంగారెడ్డి, ఫిబ్రవరి 19( సమయం న్యూస్).:** వ్యవసాయ రంగంలో డీలర్ల సామర్థ్యవృద్ధి లక్ష్యంగా నిర్వహిస్తున్న “డిప్లమో ఇన్ అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ సర్వీస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్” కార్యక్రమం గురువారం పిడి, ఆత్మ కార్యాలయంలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల అభివృద్ధి కోసం అనేక పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తున్నదని తెలిపారు. వ్యవసాయ శాఖలో ఏఈవోలు, ఏవోలు వంటి సిబ్బంది ఉన్నప్పటికీ ప్రతి రైతు వరకు సమగ్ర అవగాహన చేరడానికి పారా ఎక్స్టెన్షన్ పర్సనల్ పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఇన్‌పుట్ డీలర్లు వ్యవసాయ రంగంలో కీలక సలహాదారులుగా వ్యవహరించగలరని, ఈ డిప్లమో కార్యక్రమం ద్వారా వారి పరిజ్ఞానం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు.కార్యక్రమానికి స్వచ్ఛందంగా నమోదు చేసుకుని ముందుకు వచ్చిన డీలర్లను అభినందిస్తూ, 48 సెషన్లలో ట్రైనర్లు ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. అన్ని సెషన్లను క్రమంగా హాజరై, వినడంతో పాటు పరస్పర చర్చల ద్వారా మరింత జ్ఞానం సంపాదించుకోవాలని సూచించారు.రైతులకు నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహించడం, నానో వ్యవసాయ సాంకేతికతలను విస్తరించడం, కొత్త వంగడాలు, కొత్త పంట రకాలు, ఆయిల్ పామ్ వంటి ఉద్యాన పంటలపై సరైన అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. రైతులు తమ సందేహాల నివృత్తి కోసం ముందుగా డీలర్లను సంప్రదిస్తారని, అందువల్ల ముందస్తు పరిజ్ఞానం కలిగి ఉండటం ద్వారా రైతులకు సముచిత సలహాలు, సూచనలు ఇవ్వగలరని అన్నారు. తద్వారా లాభదాయక పంటల సాగు వైపు రైతులను దారితీసే అవకాశం ఉంటుందని వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, డీలర్లు, ట్రైనర్లు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయండి.

**జిల్లా కలెక్టర్**



**సంగారెడ్డి, ఫిబ్రవరి 19( సమయం న్యూస్) :** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు ,అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ తన ఛాంబర్‌లో పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్, గ్రామీణాభివృద్ధి, విద్యుత్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పాఠశాలలు ,అంగన్‌వాడీ కేంద్రాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయడానికి అధికారులు--ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం పెంపొందించాలని ఆమె సూచించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ నిధులను సమర్థవంతంగా వినియోగించి పాఠశాలల మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని, ఇప్పటికే పూర్తయిన పనుల వివరాలు, కొనసాగుతున్న పనుల జాబితాలను సంబంధిత అధికారులు వెంటనే సమర్పించాలని ఆదేశించారు. పాఠశాలల్లో మంజూరు చేసిన టాయిలెట్ల నిర్మాణం,మరమ్మత్తు పనులను వేగవంతం చేయాలని సూచించారు. విద్యార్థుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని మరుగుదొడ్లు సక్రమంగా పనిచేసేలా చూడాలని, పనుల నాణ్యతపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడకూడదని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యుత్ కనెక్షన్లు, మౌలిక సదుపాయాలు, పాఠశాలల్లో టాయిలెట్ల నిర్మాణం పూర్తయిన వెంటనే కాంట్రాక్టర్లు వాటిని హెడ్‌మాస్టర్లకు అప్పగించాలని, వాటిని వెంటనే వాడుకలోకి తీసుకురావాలని డి ఈ ఓ కు సూచించారు. ఎస్‌హెచ్‌జి ఫెడరేషన్ భవన నిర్మాణ వివరాలను సంబంధిత అధికారులు తక్షణం అందించాలన్నారు . ఈజీఎస్ పల్లెల్లో అంగన్‌వాడీ భవనాలు, పాఠశాలలలో కంపౌండ్ వాల్ పనులను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈజీఎస్ లేబర్ చెల్లింపులు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాజాగా ఎన్నికైన గ్రామ సర్పంచులు,ఉపసర్పంచులు గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేలా మండల పరిషత్ అధికారులు, పంచాయతీ సెక్రటరీలు సమీక్షలు నిర్వహించాలని సూచించారు. గ్రామ సభలను ఏర్పాటు చేసి సమన్వయంతో అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పీడీ డిడిఆర్డిఓ జ్యోతి, డిడబ్ల్యూఓ లలిత కుమారి, సీపీఓ బాలశౌరి, అదనపు డిఆర్డిఓ బాలరాజ్, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు విద్యుత్ శాఖ, విద్యాశాఖ , సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శివాజీ స్వరాజ్య స్ఫూర్తితో బీసీల రాజకీయ సంగ్రామం

- గుజ్జ సత్యం
- శివాజీ స్ఫూర్తితో బీసీల రాజకీయ పునరుజ్జీవనం - ర్యాగ అరుణ
- కులగణన--42% రిజర్వేషన్లే మా లక్ష్యం చత్రపతి శివాజీ మహారాజ్ జయంతోత్సవాలలో వక్తలు.



**హైదరాబాద్, ఫిబ్రవరి 19(సమయం న్యూస్):** శివాజీ మహారాజ్ కేవలం యోధుడు మాత్రమే కాదు, సమానత్వాన్ని స్థాపించిన శక్తివంతమైన పరిపాలకుడు అన్నారు గుజ్జ సత్యం. 'అష్టప్రధాన్ మండలి'లో వివిధ వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా సమగ్ర పాలనకు నాంది పలికారు"అని గుర్తు చేశారు. మహిళల గౌరవం, రైతుల రక్షణ,స్థానిక పరిపాలన బలోపేతం వంటి అంశాల్లో శివాజీ తీసుకున్న నిర్ణయాలు నేటి పాలకులకు ఆదర్శమని పేర్కొన్నారు."శివాజీ స్వరాజ్యం అంటే ప్రజల పాలన అని అదే స్ఫూర్తితో బీసీలకు స్వీయ రాజకీయాధికారం రావాలన్నారు. జనాభా దామాషా ప్రకారం ప్రాతినిధ్యం దక్కాలి" అని ఆయన స్పష్టం చేశారు.దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి బీసీల వాస్తవ సంఖ్యను వెల్లడించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు."డేటా లేకుండా న్యాయం జరగదని, కులగణన ఆధారంగా రిజర్వేషన్ల పునర్విభజన అవసరం" అని అన్నారు. తెలంగాణలో 42% బీసీ రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు చేయాలని, ఇందుకోసం పార్లమెంట్‌లోనూ పోరాటం కొనసాగిస్తామని వెల్లడించారు.జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ రాగ అరుణ్ కుమార్ మాట్లాడుతూ, "శివాజీ మహారాజ్ సామాన్య ప్రజలకు రాజ్యాధికారం అందించిన మహానుభావుడు. అదే విధంగా బీసీలు కూడా పాలనలో కీలక పాత్ర పోషించాలి" అన్నారు.ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల విజయాలు ఉద్యమానికి నిదర్శనమని చెప్పారు. "105 మున్సిపాలిటీల్లో బీసీ చైర్పర్సన్లు ఎన్నిక కావడం, వైస్ చైర్పర్సన్లలో గణనీయ ప్రాతినిధ్యం దక్కడం బీసీ ఐక్యత ఫలితం" అని పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా బీసీ మహా ర్యాలీలు, యువజన చైతన్య సభలు నిర్వహించి, బీసీ హక్కులపై అవగాహన పెంచుతామని ప్రకటించారు. "42% రిజర్వేషన్లు, కులగణన, జనాభా దామాషా పదవుల కేటాయింపు సాధించే వరకు మా ఉద్యమం ఆగదు" అని స్పష్టం చేశారు.శివాజీ ధైర్యం, వ్యూహాత్మక నాయకత్వం నేటి బీసీ యువతకు స్ఫూర్తి కావాలని అన్నారు. "విద్య, ఉపాధి, రాజకీయాల్లో బీసీ యువత ముందుకు రావాలి. శివాజీ చూపిన స్వరాజ్య భావనను సామాజిక న్యాయ స్వరాజ్యంగా మలచాలి" అని పిలుపునిచ్చారు.దేశవ్యాప్తంగా బీసీ హక్కుల కోసం జాతీయ స్థాయి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నా మని, త్వరలో భారీ సదస్సు నిర్వహిస్తామని తెలిపా రు.శివాజీ జయంతి వేడుకలతో పాటు బీసీ ఉద్యమంపై తీసుకున్న తీర్మానాలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. శివాజీ స్ఫూర్తిని ఆధారంగా చేసుకుని బీసీలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక న్యాయం సాధించడమే లక్ష్యమని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ రాగ అరుణ్ కుమార్, బీసీ జేఏసీ కన్వీనర్ రాజు నేత, ఓయూ జేఏసీ విద్యార్థి రాష్ట్ర అధ్యక్షులు వంశీ నేత , ఎంబీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నిమ్మల వీరన్న, బీసీ శివాజీ ఆర్మీ స్టేట్ ప్రెసిడెంట్ ప్రవీణ్, ఓయు జెఏసి చైర్మన్ బాలకృష్ణ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సుభాష్ చంద్రబోస్ నేత తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి

- ఆసుపత్రిలో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలి.
- రోగులకు మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి.
- రోగులకు నాణ్యమైన ఆహారం అందించాలి, అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్.



**మహబూబ్ నగర్ ఫిబ్రవరి19( సమయం న్యూస్).:** ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు.గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వివిధ మెడికల్ వార్డులను సందర్శించి, రోగులు , వైద్య అధికారుల తో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత తదితర విషయాలు తెలుసుకున్నారు. ఆసుపత్రిలో పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని. జనరల్ ఆసుపత్రిని రాష్ట్రం లోనే అత్యుత్తమ ఆసుపత్రిగా తీర్చి దిద్దాలని అధికారులను ఆదేశించారు.తనిఖీలో భాగంగా కలెక్టర్ ముందుగా ఎమర్జెన్సీ మెడికల్ వార్డును సందర్శించారు. అక్కడ రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఒకే పడకపై ఇద్దరు రోగులు ఉండటాన్ని గమనించి, వారికి ఎందుకు వేరు వేరు బెడ్లు ఇవ్వలేదని సిబ్బందిని ప్రశ్నించారు. ఎమర్జెన్సీ వార్డులో 24 గంటలు ఎంత మంది వైద్యులు విధులు నిర్వర్తిస్తున్నారని అడగగా, ఇద్దరు చీఫ్ మెడికల్ ఆఫీసర్లు సేవలందిస్తున్నారని అధికారులు తెలిపారు.తదుపరి ఐసీయూ విభాగాన్ని సందర్శించి రోగుల ఆరోగ్య పరిస్థితి, అందుతున్న చికిత్సపై ఆరా తీశారు. ఆర్థోపెడిక్ విభాగంలో రోజుకు ఎన్ని శస్త్రచికిత్సలు జరుగుతున్నాయని ప్రశ్నించగా, రోజుకు 3 నుంచి 5 వరకు శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. మోకాలి సంధి మార్పిడి శస్త్రచికిత్సలు జరిగాయా అని అడగగా, ఇప్పటివరకు ఒకటి మాత్రమే నిర్వహించామని వైద్యులు తెలిపారు.మరమ్మత్తులలో ఉన్న చెల్లింపు గదులను పరిశీలించిన కలెక్టర్, వినియోగంలో లేని పడకలను గదుల్లో కుప్పగా పెట్టిన దానిని గమనించి వాటిని కండెం చేసికొత్త పడకలు తెప్పించాలని సూచించారు. ఏడాది నుంచి మరమ్మత్తులు పెండింగ్‌లో ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫ్యాన్లు, లైట్లు ఎందుకు పనిచేయడం లేదని, టాయిలెట్లు ఎన్ని మరమ్మత్తుల్లో ఉన్నాయని, నీటి నల్లాల కనెక్షన్లు ఎందుకు ఇవ్వలేదని, ఎలక్ట్రికల్ , ప్లంబింగ్ పనులు ఎందుకు పూర్తికాలేదని ప్రశ్నించారు. 18 టాయిలెట్లు మరమ్మత్తుల్లో ఉన్నాయని, నిధుల లేమి కారణంగా 32 చెల్లింపు గదుల మరమ్మత్తులు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు. వెంటనే ఎలక్ట్రికల్, ప్లంబింగ్, డ్రైనేజీ పనులను పూర్తి చేసి వచ్చే వారంలోగా చెల్లింపు గదులను వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు.ఆసుపత్రి లోని జనరల్ మెడిసిన్ కారిడార్‌లో పాడైన కుర్చీలు, చెత్తను ఎలక్ట్రికల్ గదిలో కుప్పగా ఉంచడాన్ని గమనించిన కలెక్టర్, వెంటనే వాటిని తొలగించి, ఆసుపత్రిలో ప్రతి మూల కూడా శుభ్రంగా ఉంచాలని సూచించారు.ఆసుపత్రిలో మహిళా మెడికల్ వార్డును సందర్శించిన కలెక్టర్, ఆత్మహత్యాయత్నం చేసిన రోగులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి నిర్ణయాలు తీసుకోకూడదని సూచించారు. లక్ష్మి అనే వికలాంగురాలితో మాట్లాడగా, తనకు , తన భర్తకు వికలాంగ పింఛన్ నిలిపివేశారని తెలిపింది. దీనిపై వెంటనే సంబంధిత అధికారులను చర్యలు తీసుకుని వారికి పింఛన్ పునరుద్ధరించాలని ఆదేశించారు. ఆసుపత్రిలో ఉన్న మైత్రి ట్రాన్స్‌జెండర్ క్లినిక్‌ను సందర్శించి ట్రాన్స్‌జెండర్‌లకు అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు.ప్రసూతి విభాగం కారిడార్‌లో పావురాల విసర్జన కనిపించడంతో పైకప్పుకు నెట్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి పావురాలు లోపలికి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రి ప్రతి మూల పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం ఆసుపత్రి వంటశాలను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం రోగులకు ఆహారం అందిస్తున్నారా అని అడిగారు. రోజూ సుమారు 450 మంది రోగులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం అందిస్తున్నామని పోషకాహార నిపుణురాలు తెలిపారు. ఆహార నాణ్యతపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని, తరచుగా ఆహార నాణ్యత పై రోగుల నుండి అభిప్రాయాలను సేకరించి సేవలను మెరుగుపరచాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డా. సునీల్ కుమార్, సీనియర్ వైద్యురాలు డా. మాధవి, ఇతర డాక్టర్లు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కంప్యూటర్ ఆపరేటర్ పై ఎంపీడీవో కు ఫిర్యాదు



**రాయపోల్,ఫిబ్రవరి19:** సరైన విద్య అర్హతలు లేకున్న ఎంపీడీవో కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగిపై ఎంపీడీవో శ్రీనివాస్ కు గ్రామ వార్డు సభ్యులు, పెద్దలతో కలిసి ఫిర్యాదు చేయడం జరిగిందని ఆరేపల్లి గ్రామ సర్పంచ్ కర్రోళ్ల దివ్య కృష్ణ తెలిపారు. గురువారం రాయపోల్ మండల కేంద్రం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్ కు కంప్యూటర్ ఆపరేటర్ ప్రభావతి పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయపోల్ మండలం ఎంపీడీవో కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగానికి కావలసిన అర్హతలు లేకున్నా ఆరేపల్లి గ్రామానికి చెందిన రామన్నగారి ప్రభావతి గత నాలుగు సంవత్సరాలుగా కంప్యూటర్ ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తున్నారని, ఆమె ఇంటర్మీడియట్ వరకు మాత్రమే చదివారని,సంబంధిత పోస్టుకు అవసరమైన అర్హతలు లేవని ఆరోపించారు. కాబట్టి కంప్యూటర్ ఆపరేటర్ విద్యార్హతలపై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ ను కోరడం జరిగిందన్నారు.ఇదే విషయంపై ఎంపీడీవో శ్రీనివాస్‌ను వివరణ కోరగా పాలకవర్గం ఇచ్చిన ఫిర్యాదును విచారణ చేపట్టి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ వీరేష్, మాజీ సర్పంచ్ యాదయ్య, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా రూపొందించాలి

-- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



**సంగారెడ్డి, ఫిబ్రవరి 19( సమయం న్యూస్) :** జిల్లాలో రోడ్డు ప్రమాదాలను సమర్థవంతంగా నియంత్రించి, సంగారెడ్డి జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో, సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సూచించారు.గురువారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా,ఆర్ ఆ బి , రవాణా, ఆర్టీసీ, పంచాయతీ రాజ్, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖ, పోలీస్, ట్రాఫిక్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు పరిస్థితిని శాఖల వారీగా కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తున్న ప్రాంతాలు, ముఖ్యంగా జాతీయ రహదారులపై చోటుచేసుకున్న ప్రమాదాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాల గణాంకాలు, కారణాల పై సమగ్ర విశ్లేషణ చేయాలన్నారు.తరచుగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను "బ్లాక్ స్పాట్స్"గా గుర్తించి, అక్కడ తక్షణమే హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, స్పీడ్ బ్రేకర్లు, సిగ్నల్స్ ఏర్పాటు చేయడం, రోడ్ల మరమ్మతులు వంటి చర్యలను చేపట్టాలని సూచించారు. అలాగే రహదారుల వెంట పెరిగిన చెట్ల కొమ్మలు, అడ్డంకులను తొలగించడం, సరైన లైటింగ్ ఏర్పాటు చేయడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. ఎక్కడైనా ప్రమాదం సంభవించినప్పుడు, దానికి గల అసలు కారణాలను పూర్తిస్థాయిలో పరిశీలించి, భవిష్యత్తులో అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నివారణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో గాయపడిన వారికి తక్షణ వైద్య సహాయం అందేలా పోలీస్, వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయం కలిగి ఉండాలని తెలిపారు. రోడ్డు భద్రత అంశాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని ప్రతి శాఖ తమ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు.

# నర్వ మండలంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**నర్వ మండలం, ఫిబ్రవరి,19(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా నర్వ (యాస్పిరేషన్ బ్లాక్) మండలంలో గురువారం జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. ఈ నెల 24 న నర్వ యాస్పిరేషన్ బ్లాక్ మండలాన్ని నీతి ఆయోగ్ అదనపు మిషన్ డైరెక్టర్ సందర్శిస్తున్నందున ఆ సందర్శన సన్నాహాలను గురువారం కలెక్టర్ పర్యవేక్షించారు. ముందుగా నర్వ మండలంలోని పెద్ద కడుమూర్ గ్రామ పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ను, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ను కలెక్టర్ సందర్శించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్, సౌకర్యాలు, పరికరాలు, విద్యార్థుల పురోగతి, మధ్యాహ్న భోజనం నాణ్యత, పీఎం శ్రీ స్కూల్ పథకం కింద వార్షిక బడ్జెట్ వ్యయం,కొనసాగుతున్న పాఠశాల కార్యక్రమాలు, టాయిలెట్ సౌకర్యాలు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏ ఎక్స్ ఎల్ ల్యాబ్, లైబ్రరీ గదులను పరిశీలించారు. వాటి వినియోగం గురించి ఆయా పాఠశాలల హెచ్‌ఎం లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాయికోడ్ గ్రామంలోని మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా సందర్శించారు, ప్రీ-స్కూల్ పిల్లలు అంగన్‌వాడీ ఉపాధ్యాయులతో సంభాషించారు. చిన్నారులతో కరచాలనం చేసి ఉత్సాహ పరిచారు. అంగన్‌వాడీ కేంద్రాలలోశ్యామ్ (తీవ్రంగా తీవ్రమైన పోషకాహార లోపం)మ్యామ్ (మధ్యస్థంగా తీవ్రమైన పోషకాహార లోపం) పిల్లల స్థితిని సమీక్షించారు. చివరగా నర్వ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి సౌకర్యాలు, సేవలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ ప్రణయ్ కుమార్, డిఆర్డిఓ మొగులప్ప, ఎంపీడీవో శ్రీనివాస్, యాస్పిరేషన్ బ్లాక్ సమన్వయకర్త బాలాజీ, ఎంఈఓ,సిడిపిఓ పాల్గొన్నారు.

## శివాజీ జయంతి శోభాయాత్ర, ర్యాలీలను కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి పర్యవేక్షించిన

● జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS



**నారాయణపేట, ఫిబ్రవరి,19(సమయం న్యూస్) :** చత్రపతి శివాజీ జయంతి సందర్భంగా నారాయణపేట జిల్లా పరిధిలో నిర్వహించిన శోభాయాత్రలు, బైక్ ర్యాలీలను జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి సీసీ కెమెరాల ద్వారా ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. జిల్లా వ్యాప్తంగా నారాయణపేట, కోస్గి, మద్దూర్ ,మక్తల్, ఉట్కూర్, మరికల్ వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన ర్యాలీలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ అధికారులకు వి.హెచ్.ఎఫ్ (ఎంఖీ) సెట్ ద్వారా భద్రతాపరమైన సూచనలు చేశారు. ర్యాలీల మార్గాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, శాంతి భద్రతల పరిరక్షణలో ఎలాంటి అలసత్వం వహించవద్దని ఆదేశించారు. అదనంగా సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు, పోలీస్ పికెట్స్ ఏర్పాటు చేయడం, సీసీ కెమెరాలతో నిరంతర నిఘా పెట్టాలని సూచించారు. ప్రజలు శాంతియుతంగా వేడుకలు జరుపుకోవాలని, చట్టాన్ని గౌరవించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. కంట్రోల్ రూమ్ 24ల7 నిరంతరం సీసీ కెమెరాలను పరవేక్షిస్తూ ఏక్కడ ఎలాంటి సంఘటనలు జరిగినా వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100 కి సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు. ఎస్పీ తో పాటు ఎస్.బి ఎస్సై నరేష్, ఐటీ కోర్ టీమ్ శ్రీనివాసులు ఉన్నారు.

## TGSRTC- పరిగి డిపో ప్రత్యేక పుణ్యక్షేత్రల యాత్ర

● ఆర్టీసీ పరిగి డిపో మేనేజర్ కె.కృష్ణమూర్తి



**పరిగి మున్సిపల్(మం)ఫిబ్రవరి,19(సమయం న్యూస్) :** పరిగి పట్టణం మరియు పరిసర ప్రాంత ప్రజల కోసంతెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ పరిగి డిపో ఆధ్వర్యంలో

భక్తిశ్రద్ధలతో కూడిన మూడు జ్యోతిర్లింగాలు (కాశి, ఓంకారేశ్వర్, మహాకాళేశ్వర్) మరియు లిబాసర, ప్రయాగరాజ్, అయోధ్య, దర్శనాల కోసం ల7 రోజులు టూర్ ప్యాకేజీని తీసుకురావడం జరిగింది. ఫిబ్రవరి 24 ప్రయాణ తేదీ / సమయం: పరిగి నుండి యాత్ర ప్రారంభం ల06.03.2026. శుక్రవారం ఉదయం 9.00 గంటలకు: సూపర్ లగ్జరీ (36 సీటర్ )సీట్: 2o2 యాత్ర ముగింపు : పరిగి చేరుకునే తేది /సమయం: 12.03.2026 గురువారం రాత్రి 11:00 గంటలకు ముగుస్తుంది.

దర్శించు పుణ్యక్షేత్రాలు:

.1.బాసర (శ్రీ జ్ఞాన సరస్వతి దేవి దర్శనం)
2.ప్రయాగ్రాజ్ -- త్రివేణి సంగమం (ఉత్తర ప్రదేశ్)
3.కాశి -- వారణాశి (ఉత్తర ప్రదేశ్)
4.అయోధ్య -- (ఉత్తరప్రదేశ్)
5.ఓంకారేశ్వర్ జ్యోతిర్లింగం ( మధ్యప్రదేశ్ )
6.మహాకాళేశ్వర్ జ్యోతిర్లింగం( మధ్యప్రదేశ్ )

టూర్ ఛార్జీలు:

ఒక్కొక్కరికి కేవలం ₹7,600/- మాత్రమే

భోజనాల ఖర్చులు మీరే పెట్టుకోవాలిఅడ్వాన్స్ బుకింగ్ కోసం సంప్రదించండి: 75690 65644ఈ పవిత్ర పుణ్యయాత్రలో పాల్గొనిదేవుని అనుగ్రహానికి పాత్రులు కావాలనిడిపో మేనేజర్ కె. కృష్ణమూర్తిపరిగి పట్టణ ప్రజలను హృదయపూర్వకంగా కోరుతున్నారు. పరిమిత సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

## శివాజీ జయంతి శోభాయాత్ర సందర్భంగా బందోబస్తు పరవేక్షిస్తున్న: నారాయణపేట జిల్లా డీఎస్పీ నల్లపు లింగయ్య



**నారాయణపేట, ఫిబ్రవరి,19(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా కేంద్రంలో శివాజీ జయంతి శోభాయాత్ర సందర్భంగా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయబడింది అని ఈ సందర్భంగా డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐ శివశంకర్,ఎస్సై వెంకటేశ్వర్లు పోలీస్ అధికారులు మరియు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని శోభాయాత్ర శాంతియుతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా పనిచేయాలని డీఎస్పీ సూచించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, శాంతి భద్రతలు కాపాడడంలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రజలు పోలీసులకు సహకరించి వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## పౌర్ణమి పర్వదినాన ప్రసిద్ధ, పవిత్రమైన పుణ్యక్షేత్రాలు దర్శనానికి పరిగి డిపో డిలాక్స్ బస్సు

డిపో మేనేజర్ కే. కృష్ణమూర్తి..తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ పరిగి డిపో

**పరిగి మున్సిపల్,(మం)ఫిబ్రవరి,19(సమయం న్యూస్) :** మన పరిగి డిపో నుండి 03.03.2025 మంగళవారం పౌర్ణమి పర్వదినాన ప్రసిద్ధ, పవిత్రమైన పుణ్యక్షేత్రాలు గానుగాపూర్ దత్తాత్రేయ స్వామి,.తుల్జాపూర్ తుల్జా భవాని మాత, పండరీపూర్ విఠలేశ్వరుని దర్శించుకోవాలనుకునే భక్తుల కోసం మన పరిగి మరియు వికారాబాద్ పట్టణ మరియు పరిసర ప్రాంత ప్రజల సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ పరిగి డిపో వారు డిలక్స్ బస్సు నడపాలని నిర్ణయించారు. 02.03.2026 రాత్రి 10 గంటలకు పరిగి నుండి బయలుదేరి తేదీ 03.03.2026 న గానగపూర్ లోని దత్తాత్రేయ స్వామి, తుల్జాపూర్ తుల్జా భవాని మాత పండరీపూర్ విఠలేశ్వరుని దర్శించుకుని. 03.03.2026 నాడు రాత్రి 10.00 గంటలకు తిరిగి బయలుదేరి 04.03.2026 నాడు ఉదయం 6.00 గంటలకు పరిగి చేరుకుంటుంది. టిక్కెట్ ధర ఒక్కొక్కరికి ల1800/-అడ్వాన్స్ బుకింగ్, మరిన్ని వివరాలకు 7569065644 నంబర్ ను సంప్రదించగలరు. కావున భక్తులందరూ పవిత్రమైన ఈ పౌర్ణమి రోజున దత్తాత్రేయుని, తుల్జా భవాని, విఠలేశ్వరుని దర్శించి సకల సుఖాలు పొందవలసిందిగా మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. కె.కృష్ణమూర్తి పరిగి డిపో మేనేజర్.

# పాఠశాల అభివృద్ధి, సదుపాయాల పనులు పూర్తిచేయండి

● జిల్లా కలెక్టర్



**మహబూబ్ నగర్ ఫిబ్రవరి19( సమయం న్యూస్) :** జిల్లాలో పి.ఎం శ్రీ పాఠశాలలో మంజూరైన అన్ని నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేసి, వాటికి కేటాయించిన నిధులను మార్చి నెలాఖరు లోగా పూర్తిగా ఖర్చు చేసి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా విద్యాశాఖ, ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని పి.ఎం. శ్రీ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, సైన్స్ ల్యాబ్‌లు, వాననీటి హార్వెస్టింగ్ పిట్స్, మరుగుదొడ్లు, లైబ్రరీ గదులు తదితర మౌలిక సదుపాయాల పనులను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలో సుమారు 69 నిర్మాణ పనులు ఇంకా పూర్తి కావలసి ఉన్నాయని, వాటికి సంబంధించిన రూ.173 లక్షల నిధులను ఖర్చు పెట్టవలసి ఉన్నదని, వాటిని మార్చి నెలాఖరు లోగా ఖర్చు చేసి వినియోగ వివరాలను సమర్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మంజూరైన నిధులు ల్యాప్స్ కాకుండా చూడాలని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ విద్య మౌలిక సదుపాయాల సంస్థఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామచంద్రయ్య విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతూ మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో ఏవైనా అడ్డంకులు ఉంటే వాటిని వెంటనే పరిష్కరించి పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. అడ్డాకల్, రాజాపూర్, బాలానగర్, నవాబ్‌పేట్, జడ్చర్ల, భూత్పూర్, దేవరకద్ర మండలాల్లో పీఎం శ్రీ పథకం కింద ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలలో అదనపు గదులు, సైన్స్ ల్యాబ్‌లు, మరుగుదొడ్లు, సోక్ పిట్స్ తదితర పెండింగ్ పనులను అత్యవసరంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు విద్యాశాఖ ఏ.ఎం.ఓ దుంకుడు శ్రీనివాస్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పరీక్షల దృష్ట్యా చదువుపై పూర్తి ఏకాగ్రత పెట్టాలి

● జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



**సంగారెడ్డి, ఫిబ్రవరి 19( సమయం న్యూస్).:** పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు చదువుపై పూర్తి దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సూచించారు. గురువారం కలెక్టర్ పుల్కల్ మండలం గొంగ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు సింగూర్ మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. గొంగ్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో తరగతి గదులు, వాష్ రూములు, పాఠశాల ఆవరణ, తదితరాలను పరిశీలించారు. విద్యార్థులతో మమేకమై మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. భోజనం నాణ్యత, మెనూ వివరాలను తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడిన కలెక్టర్, రోజువారీ స్పెషల్ క్లాసులు నిర్వహిస్తున్నారా, స్నాక్స్ అందిస్తున్నారా అని ప్రశ్నించగా, విద్యార్థులు తరగతులు సక్రమంగా జరుగుతున్నాయని, స్నాక్స్ ఇస్తున్నారని తెలిపారు. పరీక్షలుసమీపిస్తున్నందున సమయాన్ని సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో చదివి మంచి ఫలితాలు సాధించాలని హితవు పలికారు. పాఠశాలలోని మరుగుదొడ్లను పరిశీలించిన కలెక్టర్, శుభ్రత లోపంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతిరోజు మరుగుదొడ్లు శుభ్రం చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సింగూర్ గ్రామంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులను పలకరించి పాఠ్యాంశాల పురోగతిపై ప్రశ్నించారు. సిలబస్ పూర్తిచేసి, పునరావృతం ద్వారా మెరుగైన ప్రతిభ కనబర్చాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలు పెట్టుకొని చదివి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని ప్రోత్సహించారు. అనంతరం బస్వాపూర్ గ్రామ శివారులో నిర్మాణంలో ఉన్న "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల" పనుల పురోగతిని పరిశీలించారు. పనులను వేగవంతం చేయడంతో పాటు నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఈ కార్య క్రమంలో కలెక్టర్ వెంట తహసీల్దార్, పంచాయతీ సెక్రటరీ, పోలీస్ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ రెండో వార్డు కౌన్సిలర్ ఆర్.వాణిశ్రీ మధుయాదవ్ ను సన్మానం

● సన్మానించిన పెద్ద నందిగామ గ్రామ పెద్దలు

**కొడంగల్ మున్సిపల్, ఫిబ్రవరి,19(సమయం న్యూస్) :** కొడంగల్ మున్సిపల్ ఎన్నికలలో నూతనంగా ఎన్నికైన రెండో వార్డ్ కౌన్సిలర్ ఆర్ వాణిశ్రీ మధుసూదన్ యాదవ్ ను శాలువా పూలదండలతో సన్మానించిన పెద్ద నందిగామ గ్రామ పెద్దలు హనుమంత్ రెడ్డి, రామకృష్ణయ్య,చంద్రప్ప, చిరంజీవి,శాంత కుమార్, పాండు,తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## న్యాయం ధర్మం తో పోరాడి అధికారం చేపట్టిన పోరాట వీరుడు శివాజీ



**కొడంగల్ మున్సిపల్, ఫిబ్రవరి,19(సమయం న్యూస్) :** -కొడంగల్ పట్టణ కేంద్రంలో శివాజీ విగ్రహం ఏర్పాటు చేయాలి-బోయిని మొగులప్ప భాజపా మండల ప్రధాన కార్యదర్శి న్యాయం ధర్మం తో పోరాడి అధికారం చేపట్టిన పోరాట వీరుడు ఛత్రపతి శివాజీ అని భాజపా మండల ప్రధాన కార్యదర్శి బోయిని మొగులప్ప అన్నారు. కొడంగల్ మండలంలోని రావుల పల్లి గ్రామంలో శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్న వయసులోనే మొగల్ చక్రవర్తులపై పోరుసల్పి మరాఠ సామ్రాజ్యం లో స్వతంత్ర బావుటా ఎగురవేసిన శివాజీ జీవితాన్ని నేటితరం యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కొడంగల్ పట్టణ కేంద్రంలో శివాజీ విగ్రహం ఏర్పాటు కు హిందూ సంఘాల నాయకులు శ్రీకారం చుట్టాలని కోరారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు పరందయ్య గౌడ్,సి.మోహన్,రెడ్డప్పదొర,బట్ట అశోక్,తదితరులు పాల్గొన్నారు



## యాంకి గ్రామంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు

**దౌల్తాబాద్ మండల, ఫిబ్రవరి,19(సమయం న్యూస్) :** దౌల్తాబాద్ మండల పరిధిలోని యాంకి గ్రామ పంచాయతీలో శ్రీ చత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి గుడి నుండి శోభయాత్రను ప్రారంభించి గ్రామ పుర విధుల వెంబడి శివా చౌకు చేరుకొని అక్కడ శివాజీ విగ్రహానికి పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు రబింద్ర నికేతన్ హైస్కూల్ నూతన భవనం ప్రారంభం

నూతన భవనాన్ని ప్రారంభించనున్నఎస్ ఆర్ ఫౌండేషన్ చైర్ పర్సన్ సుధా రెడ్డి

బడుగుల విద్యావ్యాప్తికి 62 ఏళ్ళ క్రితం ప్రారంభమైన హైస్కూల్

**హైదరాబాద్, ఫిబ్రవరి 19( సమయం న్యూస్) :** బడుగుల విద్యావ్యాప్తికి 62 ఏళ్ళ క్రితం స్థాపించిన రబింద్ర నికేతన్ హైస్కూల్ నూతన భవనం ఫిబ్రవరి 20వ తేదీ శుక్రవారం ప్రారంభం కానుంది. ఈ పాఠశాలను విశ్వకవి రబింద్రనాథ్ స్పూర్తితో స్వేచ్ఛా వాతావరణంలో, సృజనాత్మకత సమగ్ర వికాసాన్ని బాలబాలికల్లో పెంపొందించాలని ప్రారంభించారు. ఆ పాఠశాల నూతన భవనాలను మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రుక్చర్స్ లిమిటెడ్ (ఎం ఈ ఐ ఎల్ ) డైరెక్టర్, ఎస్ ఆర్ ఫౌండేషన్ చైర్ పర్సన్ సుధా రెడ్డి ప్రారంభించనున్నారు. హైస్కూల్ నూతన భవన ప్రారంభ వివరాలను రబింద్ర నికేతన్ సొసైటీ అధ్యక్షురాలు మీనాక్షి భట్టాచార్య, కోశాధికారి, ప్రిన్సిపల్ , కరెస్పాండెంట్ కే అన్నే కరుణ తెలిపారు. రబింద్ర నికేతన్ హైస్కూల్ ఇప్పటి వరకు నిజాం వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్) ఆవరణలో కొనసాగుతోంది. నిమ్స్ విస్తరణలో భాగంగా చేపట్టిన అదనపు బ్లాక్స్ నిర్మాణానికి ఈ పాఠశాల స్థలాన్ని కేటాయించారు. ప్రత్యామ్నాయంగా ఆ పాఠశాలకు ఇఖ్బమ్ మంజిల్ కాలనీలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఆనుకుని స్థలాన్ని, నిధులను ప్రభుత్వం కేటాయించింది . అక్కడ 835 చదరపు గజాల్లో, 7484 చదరపు అడుగుల విస్తీర్ణంలో 18 గదులతో నూతన భవనాన్ని నిర్మించారు. ఈ భవనానికి అవసరమైన ఫర్నిచర్ ను ఎస్ఆర్ ఫౌండేషన్ తరఫున సుధా రెడ్డి అంద చేశారు. ఆరు దశాబ్దాల క్రితం అతి కొద్దీ మంది విద్యార్థులతో నామమాత్రపు రుసుము వసూలు చేస్తూ సేవా దృక్పధంతో ప్రారంభమైన ఈ పాఠశాల రోజు రోజు కు అభివృద్ధి చెందుతోంది. ప్రస్తుతం ఈ పాఠశాలలో 250 మంది బడుగు, బలహీనవర్గాల విద్యార్థిని విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇప్పటి వరకు ఈ పాఠశాలలో చదివిన విద్యార్థిని విద్యార్థులు వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. పలువురు ప్రభుత్వ ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారని మీనాక్షి, అరుణ తెలిపారు. తమ పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తోందని వారు తెలిపారు.

# శ్రీలంక గడ్డపై జింబాబ్వే సంచలనం విజయం..

## టేబుల్ టాపర్‌గా రజా సేన



టీ20 ప్రపంచకప్ 2026లో జింబాబ్వే అద్భుత ప్రదర్శన కనబరుస్తోంది. టోర్నీలో పెద్ద జట్లను కుదిపేయాలని కెప్టెన్ సికందర్ రజా ఇప్పటికే కంకణం కట్టుకున్నాడు. తాజాగా శ్రీలంక జట్టును ఆ దేశ ఓన్ గ్రౌండ్‌లోనే ఓడించింది. ఈ గ్రాండ్ విక్టరీతో సూపర్-8కు ముందే గ్రూప్‌ఉబీలో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఇప్పటికే ఆస్ట్రేలియా లాంటి భారీ టీమ్‌ను ఓడించి సూపర్-8లోకి అర్హత సాధించిన జింబాబ్వే.. తాజాగా శ్రీలంకను సైతం ఓడించి గ్రూప్ టాపర్‌గా నిలిచింది. ప్రస్తుతం అంతర్జాతీయ టీ20 ర్యాంకింగ్స్‌లో జింబాబ్వే స్థానం చాలా తక్కువ. కానీ ఎనిమిదో స్థానంలో ఉన్న శ్రీలంకను ఓడించడం పెద్ద అప్‌సెట్‌గా మారింది. గత ఏడాది కూడా జింబాబ్వే శ్రీలంకపై రెండు సార్లు గెలిచింది. 2024లోనూ ఒకసారిఓడించింది. ఇప్పటివరకు ఈ రెండు జట్ల మధ్య జరిగిన పన్నెండు మ్యాచ్‌లలో శ్రీలంక ఎనిమిది గెలిచినా, జింబాబ్వే నాలుగు విజయాలతో తమ పోరాటస్ఫూర్తిని చూపించింది. కొలంబో ఆర్‌పీఎస్ మైదానం మాత్రం శ్రీలంకకు అదృష్టం కలిగించలేకపోతోంది. అక్కడ ఆడిన 34 మ్యాచ్‌లలో కేవలం తొమ్మిది విజయాలే రావడం బలహీనతను బయటపెట్టింది. ఈ మ్యాచ్‌లో శ్రీలంక మొదట బ్యాటింగ్ చేసి మంచి ఆరంభం చేసింది. పాతుమ్ నిస్సంక అద్భుతంగా ఆడి 41 బంతుల్లో 62 పరుగులు చేశాడు. చివరి ఓవర్లలో పావన్ రత్నాయకే వేగంగా 25 బంతుల్లో 44 పరుగులు చేసి జట్టును 178 పరుగుల బలమైన స్కోరుకు చేర్చాడు. జింబాబ్వే బౌలర్లలో గ్రేమ్ క్రీమర్, బ్లెసింగ్ ముజరబాని, బ్రాడ్ ఇవాన్స్ ఇద్దేసి వికెట్లు తీసి పరుగులు అదుపులో పెట్టారు. 179 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే బ్యాటింగ్ చాలా పద్ధతిగా సాగింది. బ్రియాన్ బెన్నెట్ మరోసారి అద్భుతంగా ఆడి 63 పరుగులతో జట్టుకు పునాది వేశాడు. ఈ ప్రపంచకప్‌లో వరుసగా మూడో అర్ధశతకం ఇది. ఓమాన్‌పై 48 నాటౌట్, ఆస్ట్రేలియాపై 64 నాటౌట్‌గా నిలిచి శ్రీలంకపై అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. కెప్టెన్ సికందర్ రజా 45 పరుగులతో మ్యాచ్‌ను జింబాబ్వే వైపు తిప్పేశాడు. చివరకు 19.3 ఓవర్లలోనే నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించారు. ఈ విజయంతో తమ గ్రూపులో అగ్రస్థానాన్ని సంపాదించారు.




## బాబర్‌ను తీసేయాలని చెప్తే, నన్నే తీసేశారు

### పాక్ మాజీ సంచలన వ్యాఖ్యలు

### బాబర్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడిన యూసుఫ్..

టీ20 వరల్డ్ కప్‌లో భారత్ చేతిలో పాకిస్తాన్ ఘోర పరాజయం ఆ దేశంలో తీవ్ర ఆగ్రహానికి కారణమవుతోంది. అభిమానులు, పాక్ మాజీలు పాక్ టీమ్‌పై, ప్లేయర్ల ఆటతీరుపై విరుచుకుపడుతున్నారు. ముఖ్యంగా, పాకిస్తాన్ స్టార్ ఆటగాడిగా భావించే బాబర్ అజమ్‌పై విమర్శలు ఎక్కు పెడుతున్నారు. బాబర్‌తో పాటు షహీన్ అఫ్రిది, షాదాబ్ ఖాన్‌పై పాకిస్తాన్ మాజీ క్రికెటర్లు విరుచుకుపడుతున్నారు. తాజాగా, పాకిస్తాన్ మాజీ ఆటగాడు మహ్మద్ యూసుఫ్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. బాబర్ ప్రస్తుత టీ20 వరల్డ్ కప్‌లో రన్స్ చేయడంలో దారుణంగా విఫలమవుతున్నాడు. మూడు మ్యాచుల్లో కేవలం 66 పరుగులు మాత్రమే చేశాడు. యూనస్ మాట్లాడుతూ.. బాబర్‌ను టీం నుంచి డ్రాప్ చేయాలని తాను సెలక్టర్‌గా ఉన్నప్పుడు సూచించానని, కానీ అందరూ తనపై తిరుగుబాటు చేసి, రాజీనామా చేసేలా చేశారని ఆయన అన్నారు. గత 2-3 ఏళ్లుగా బాబర్ టెక్నిక్ పూర్తిగా దెబ్బతిందని, అతను ఫామ్‌లో లేదని అన్నారు. నిజానికి ఒక ప్లేయర్ ఫామ్ లేకపోవడం కేవలం ఒకటి రెండు టోర్నీలో మాత్రమే ఉంటుందని, కానీ బాబర్ మూడు ఏళ్లుగా పెద్ద స్కోర్లు చేయడంలో విఫలమవుతున్నాడని యూసుఫ్ విమర్శించారు. బాబర్‌ను టీం నుంచి తీసేయాలని నేను చెబితే, మేనేజ్మెంట్ తిరస్కరించిందని, చివరకు తాను సెలక్టర్ పదవికి రాజీనామా చేయాల్సి వచ్చిందని యూసుఫ్ చెప్పారు. బాబర్‌ను తమ కాలం నాటి దిగ్గజ ప్లేయర్లతో పోల్చే స్థాయి కాదని స్పష్టం చేశారు. ఇంజమామ్ ఉల్ హక్, సయీద్ అన్వర్, జహీర్ అబ్బాస్ వీరి స్థాయి వేరే అని, వీరిని బాబర్ మ్యాచ్ చేయలేదని అన్నారు.

# వాహ్ నువ్వు తోపు భయ్యా!

## ఒకే మ్యాచ్‌లో 4 వికెట్లు.. 4 క్యాచ్‌లు.. వరల్డ్ రికార్డ్!





**కోల్‌కతా:** టీ20 వరల్డ్ కప్ జోరుగా సాగుతోంది. రికార్డులు, విజయోత్సవాల మధ్య ఈ వరల్డ్ కప్ మ్యాచ్‌లు కొనసాగుతున్నాయి. అయితే.. తాజాగా కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ మైదానంలో వెస్టిండీస్ జట్టు ఇటలీపై 42 పరుగుల తేడాతో గెలిచింది. ఇది ఆ జట్టుకు వరుసగా నాలుగో గెలుపు. ఇటలీ మొదటిసారి ఈ ప్రపంచకప్ ఆడుతోంది. ఈ మ్యాచ్‌లో తగ్గేదేలే అన్న రీతిలోనే మొదట దూసుకుపోయింది. పవర్‌ప్లేలోనే బ్రాండన్ కింగ్, షిమ్రోన్ హెట్‌మైర్‌లను ఔట్ చేసి వెస్టిండీస్‌ను కాస్త ఒత్తిడిలోకి నెట్టింది. ఈ సమయంలో కెప్టెన్ షాయ్ హోప్ ఓపికగా ఆడాడు. మరోవైపు వికెట్లు పడుతూనే ఉన్నా కెప్టెన్ మాత్రం చివరివరకు నిలబడి 46 బంతుల్లో 75 పరుగులు చేసి జట్టును 165 పరుగుల వరకూ తీసుకెళ్లాడు. ఇటలీ బౌలర్లు క్రిషన్, కెప్టెన్ బెన్ మానెంటీ కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. 165 పరుగుల లక్ష్యంతో ఇటలీ గ్రౌండ్‌లోకి దిగింది. ఈ జట్టు బ్యాటింగ్ మొదలుపెట్టినప్పుడు మ్యాచ్ ఆసక్తికరంగా మారింది. మోస్కా సోదరులు వేగంగా పరుగులు తీయడానికి ప్రయత్నించారు. కానీ వెస్టిండీస్ బౌలర్లు ఒక్కసారిగా మ్యాచ్ దిశ మార్చేశారు. షమర్ జోసెఫ్ అద్భుతంగా బౌలింగ్ వేస్తూ 30 పరుగులకు నాలుగు వికెట్లు తీసుకున్నాడు. అతనికి తోడుగా మాథ్యూ ఫోర్డ్ సైతం 19 పరుగులకు మూడు వికెట్లు తీసి ఇటలీ ఆశలను చెదరగొట్టాడు. చివరకు ఇటలీ జట్టు 18వ ఓవర్‌లోనే మొత్తం ఔట్ అయింది. అయితే.. ఈ మ్యాచ్‌లో షమర్ జోసెఫ్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. ఏకంగా నాలుగు వికెట్లు తీయడమే కాకుండా.. నాలుగు క్యాచ్‌లు పట్టి ఒక అరుదైన రికార్డు సృష్టించాడు. ఒకే మ్యాచ్‌లో నాలుగు వికెట్లు తీసి నాలుగు క్యాచ్‌లు పట్టిన తొలి ఆటగాడిగా చరిత్రలో నిలిచాడు. ఇరవై ఓవర్ల ఆటలో నాలుగు వికెట్లు తీసుకోవడం పెద్ద విషయం. నాలుగు క్యాచ్‌లు పట్టడం కూడా చాలా అరుదు. ఈ రెండూ రికార్డులు ఒకే మ్యాచ్‌లో జరగడం దాదాపు అసాధ్యమే. కానీ జోసెఫ్ అసాధ్యాన్ని సుసాధ్యం చేశాడు. టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌ల్లో వికెట్‌కీపర్ కాకుండా నాలుగు క్యాచ్‌లు పట్టిన ప్లేయర్ల జాబితాలో డారెన్ సామీ, ఏడెన్ మార్క్రామ్, గ్లెన్ మాక్స్‌వెల్, జార్జ్ మున్సీతో పాటు ఇప్పుడు షమర్ జోసెఫ్ పేరు చేరింది.

## యూనస్ ఎగ్జిట్

### భారత క్రికెట్ సంబంధాల కోసం బంగ్లాదేశ్ ఆరాటం..

### సమస్యల్ని చర్చల ద్వారా పరిష్కరించుకుంటామన్న కొత్త మంత్రి



**ఢాకా:** టీ20 ప్రపంచ కప్‌లో బంగ్లాదేశ్, పాకిస్తాన్ చేసిన రచ్చ అంతా ఇంతా కాదు. బంగ్లాదేశ్‌లోని మహ్మద్ యూనస్ సర్కార్ తన రాజకీయ స్వలాభం కోసం భారత్‌ను బూచిగా చూపించే విధంగా గేమ్ ఆడారు. బంగ్లా ప్లేయర్లు భారత్‌లో ఆడేందుకు సిద్ధంగా ఉన్నా.. భారత్‌తో భద్రతా సమస్యలు ఉన్నాయని తమ టీం అక్కడ ఆడదంటూ వితండవాదం చేశారు. చివరకు ఐసీసీ బంగ్లాదేశ్‌ను టోర్నీ నుంచి నిషేధించింది. ఇదిలా ఉంటే, ప్రస్తుతం తారిక్ రెహ్మాన్ నేతృత్వంలో బీఎన్పీ ప్రభుత్వం అక్కడ అధికారంలోకి వచ్చింది. మహ్మద్ యూనస్ అధికారం పోయింది. దీంతో, ఇప్పుడు భారత్‌తో సంబంధాలను మెరుగుపరుచుకోవాలని చూస్తోంది. క్రికెట్ సంబంధాలను మళ్లీ నెలకొల్పాలని బంగ్లా కొత్త క్రీడా మంత్రి అమీనుల్ హక్ భావిస్తున్నారు. భారత డిప్యూటీ హైకమిషనర్‌తో చర్చలు జరిపినట్లు హక్ చెప్పారు. "స్నేహపూర్వకం చర్చల"ద్వారా విభేదాలను పరిష్కరించుకోవాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మొత్తం వివాదానికి కారణమైన బంగ్లాదేశ్ బోర్డును కూడా హక్ విమర్శించారు. పొరుగుదేశాలో స్నేహపూర్వక సంబంధాలు పెంచుకోవాలని ఆయన అన్నారు. దౌత్యపరమైన సమస్య కారణంగా బంగ్లా టీం టీ20 వరల్డ్ కప్ ఆడలేకపోయిందని, ఒక వేళ చర్చించి పరిష్కరించుకుంటే ఇప్పుడు తమ టీం టోర్నీలో ఆడుతూ ఉండేదని ఆయన అన్నారు. షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్ మద్దతుదారులుగా ఉన్న క్రికెటర్లు షకీబ్ అల్ హసన్, మష్రఫే మోర్తాజాపై ఉన్న కేసులను పరిష్కరించడం ద్వారా జాతీయ జట్టులోకి వస్తారని హక్ అన్నారు. గతంలో ఈ ఇద్దరు అవామీ లీగ్ ఎంపీలుగా పనిచేశారు. యూనస్ అధికారం చేపట్టిన తర్వాత విదేశాల్లో ఉంటున్న షకీబ్ బంగ్లాకు తిరిగిరాలేదు. ఇక మోర్తజా బహిరంగంగా కనిపించడం లేదు.

# డైరెక్ట్ ఎంట్రీ సాధించిన 12 జట్లు!

## 21 నుంచి సూపర్ 8 ..




అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) 2028లో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వేదికలుగా జరగనున్న టీ20 ప్రపంచకప్‌కు సంబంధించి కీలక అప్డేట్ ఇచ్చింది. ప్రస్తుతం జరుగుతున్న 2026 వరల్డ్ కప్‌లో సూపర్ 8కు చేరిన జట్ల ఆధారంగా తదుపరి టోర్నీకి నేరుగా అర్హత సాధించే టీమ్స్‌ను దాదాపు ఖరారు చేసింది. నిబంధనల ప్రకారం ఆతిథ్య దేశాలైన ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లు నేరుగా అర్హత సాధించగా.. 2026 ఎడిషన్‌లో సూపర్ 8కు చేరిన భారత్, పాకిస్తాన్, వెస్టిండీస్, ఇంగ్లాండ్, సౌతాఫ్రికా, శ్రీలంక, జింబాబ్వే జట్లు కూడా తమ స్థానాలను భద్రపరుచుకున్నాయి. మొత్తం 20 జట్లు పాల్గొనే ఈ మెగా టోర్నీలో ఇప్పటికే 9 జట్లు డైరెక్ట్ ఎంట్రీని ఖాయం చేసుకున్నాయి. ఇక మిగిలిన మూడు స్థానాలను ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ ఆధారంగా భర్తీ చేయనున్నారు. మార్చి 9వ తేదీని కట్-ఆఫ్ డేట్‌గా నిర్ణయించగా.. అప్పటిలోపు పెద్దగా అంతర్జాతీయ మ్యాచ్‌లు లేకపోవడంతో ప్రస్తుతం ఉన్న ర్యాంకింగ్స్ ప్రకారమే అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్, ఐర్లాండ్ జట్లు నేరుగా క్వాలిఫై అయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా బంగ్లాదేశ్ విషయంలో ఇది ఊరట కలిగించే అంశం. 2026 వరల్డ్ కప్‌లో భద్రతా కారణాల దృష్ట్యా భారత్‌లో ఆడేందుకు నిరాకరించినందుకు గానూ ఆ జట్టును ఐసీసీ టోర్నీ నుంచి తప్పించింది. అయితే, ర్యాంకింగ్స్ పరంగా మెరుగ్గా ఉండటంతో 2028 టోర్నీలో ఆ జట్టు తిరిగి భాగం కానుంది. కాగా గతేడాది భారత్‌కు వచ్చిన స్కాట్లాండ్ జట్టు ఈసారి మాత్రం రీజినల్ క్వాలిఫైయర్స్ ద్వారా తన అదృష్టాన్ని పరీక్షించుకోవాల్సి ఉంటుంది. మొత్తంగా 12 జట్లు నేరుగా అర్హత సాధించగా.. మిగిలిన 8 స్థానాల కోసం ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో రీజినల్ క్వాలిఫైయర్ రౌండ్లు జరగనున్నాయి. ఈ క్వాలిఫైయర్ మ్యాచ్‌లు వచ్చే రెండేళ్లలో పూర్తి కానున్నాయి. ఐసీసీ తన అధికారిక ప్రకటనను మార్చి 9న వెలువరించనుంది. ప్రస్తుత వర్ల్డ్ కప్‌లో సూపర్ 8 ఫిబ్రవరి 21 నుంచి ప్రారంభం కానుంది.

# కేరళ స్టోరీ-2కు 'యూ/ఏ' సర్టిఫికెట్ జారీ







మనోజ్ బాజ్‌పేయి చిత్రం 'ఘూస్‌ఖోర్ పండత్' టైటిల్‌పై సుప్రీంకోర్టు ఆంక్షలు విధించిన తరుణంలో మరో వివాదాస్పద చిత్రం 'ది కేరళ స్టోరీ 2' విడుదలకు లైన్ క్లియర్ అయింది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు 'యూ/ఏ' సర్టిఫికెట్‌ను జారీ చేసింది. దీనివల్ల 14 ఏళ్లు పైబడిన వారు ఈ సినిమాను వీక్షించే అవకాశం లభించినట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ నిర్ణయంపై చిత్ర నిర్మాత విపుల్ అమృత్‌లాల్ షా స్పందిస్తూ, సెన్సార్ బోర్డు తమ కథలోని నిజాయితీని నమ్మిందని, బోర్డు సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. మత మార్పిడి వంటి సున్నితమైన అంశాలతో రూపొందిన ఈ చిత్రంపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఇప్పటికే తీవ్ర విమర్శలు చేశారు. ఇది రాష్ట్రాన్ని కించపరిచేలా ఉన్న 'విద్వేషపూరిత ప్రోపగాండా' అని ఆయన అభివర్ణించారు. కేరళలోని లౌకిక సంప్రదాయాన్ని దెబ్బతీసేందుకు ఇలాంటి సినిమాలు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. అయితే నిర్మాత విపుల్ షా మాత్రం, ఈ సినిమా యువతులకు మరియు కుటుంబాలకు అవగాహన కల్పించేందుకు ఉద్దేశించినదని అందుకే సెన్సార్ బోర్డు సానుకూలంగా స్పందించిందని అభిప్రాయపడ్డారు. కామఖ్య నారాయణ్ సింగ్ దర్శకత్వంలో ఉల్కా గుప్త, అదితి భాటియా మరియు ఐశ్వర్య ఓజా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాను విపుల్ షా నిర్మించాడు. ఈ చిత్రం ఫిబ్రవరి 27, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

# అత్యాచార పాత్రలో నటించడం ఈజీ కాదు

తాప్సీ పన్నూ ప్రధాన పాత్రలో బాలీవుడ్ దర్శకుడు అనుభవ సిన్హా దర్శకత్వంలో తెరకెక్కిన 'అస్సి' చిత్రంలో అత్యాచార బాధితురాలిగా నటించిన మలయాళ నటి కని కుస్రుతి తన పాత్ర గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఫిబ్రవరి 20న ఈ చిత్రం విడుదల కాబోతుండగా.. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా ఆమె మాట్లాడుతూ.. తాను ఈ చిత్రంలో 'పరిమ' అనే వివాహిత పాత్రలో నటించబోతున్నట్లు తెలిపింది. అత్యాచారానికి గురైన ఒక మహిళ అనుభవించే మానసిక వేదనను వేరొకరు పూర్తిగా అర్థం చేసుకోవడం అనేది చాలా కష్టమైన విషయం. అలాంటి పాత్రలో తాను నటించడం చాలా సవాలుతో కూడుకున్నది. ఒక నటిగా ఆ వేదనకు సాధ్యమైనంత దగ్గరగా వెళ్లడానికి ప్రయత్నించానని, కొన్ని క్షణాల్లో అది నిజంగా తనకే జరుగుతోందా అనేంతగా లీనమయ్యానని కని తెలిపారు. అయితే ఆ ట్రామాలోకి పూర్తిగా వెళ్లడం వల్ల వ్యక్తిగతంగా తనపై ప్రభావం పడుతుందనే ఉద్దేశంతో కొంత దూరం పాటించానని ఆమె వివరించారు. భారతదేశంలో పెరుగుతున్న ఒక మహిళగా ఇలాంటి దాడులు లేదా వేదనల గురించి అవగాహన ఉండటం తనకు సహజమని తెలిపిన కని.. తన సన్నిహితులు కూడా ఇలాంటి పరిస్థితులను ఎదు-ర్కోవడం వల్ల ఇది మన చుట్టూ ఉండే చేదు వాస్తవమని కని పేర్కొన్నారు. ఈ సినిమా ద్వారా భారతీయ న్యాయ వ్యవస్థలోని క్లిష్టతలను కూడా తాను అర్థం చేసుకున్నానని, కోర్టు విచారణల సమయంలో బాధితులు పాత గాయాలను మళ్లీ తలుచుకుంటూ ఎంత నరకం అనుభవిస్తారో తనకు అర్థమైందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలో నివసించే పరిమ అనే మహిళ కిడ్నాప్‌కు గురై, సామూహిక అత్యాచారానికి గురైన తర్వాత ఆమె న్యాయం కోసం చేసే పోరాటం చుట్టూ ఈ చిత్ర కథ తిరుగుతుంది. ఈ చిత్రంలో తాప్సీ పన్నూ లాయర్‌గా నటించగా, మహమ్మద్ జీషన్ అయ్యూబ్, మనోజ్ పహ్వా, రేవతి తదితరులు కీలక పాత్రలు పోషించారు. దేశంలో రోజుకు సగటున నమోదవుతున్న 80 అత్యాచార కేసులను సూచిస్తూ ఈ చిత్రానికి 'అస్సి' (హిందీలో 80) అని పేరు పెట్టారు.




# విశ్వక్‌సేన్ డైరెక్షన్‌లో కల్ట్

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మరోసారి మెగా ఫోన్ పట్టాడు. విశ్వక్ స్వీయ దర్శకత్వంలో రాబోతున్న చిత్రం 'కల్ట్' . 'ఫలక్‌నుమా దాస్', 'దాస్ కా దమ్కీ' వంటి సినిమాల తర్వాత ఆయన దర్శకత్వం వహిస్తున్న చిత్రం కావడంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం ఎంతో ఉత్కంఠభరితంగా, సాహసోపేత మైన కథాంశంతో ఉండబోతుందని తెలుస్తుంది. మరోవైపు ఈ సినిమా ద్వారా ఏకంగా 40 మంది కొత్త నటీనటులను వెండితెరకు పరిచయం చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇందులో గాయత్రి భరద్వాజ్ కథానాయికగా నటిస్తున్నట్లు సమాచారం. వియత్నాంలో జరిగిన నిజ జీవిత సంఘటనల ఆధారంగా, నేటి కాలపు యువతను ఆకట్టుకునేలా ఒక కొత్త తరహా కథను విశ్వక్ సేన్ స్వయంగా రాసి తెరకెక్కించినట్లు తెలుస్తుంది. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర పోస్టర్లు మరియు ప్రచార చిత్రాలు సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. అయితే తాజాగా ఈ సినిమా టీజర్‌ను ఫిబ్రవరి 21న విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ చిత్రానికి 'కేజీఎఫ్' ఫేమ్ రవి బస్రూర్ సంగీతాన్ని అందిస్తుండగా, ప్రముఖ దర్శకుడు తరుణ్ భాస్కర్ సంభాషణలు రాస్తుండటం విశేషం. సందీప్ కాకర్ల మరియు కరాటే రాజు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు హిందీ, ఇంగ్లీష్, జపనీస్ మరియు స్పానిష్ వంటి అంతర్జాతీయ భాషల్లో కూడా విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నారు.





# రామమచరణ్ మేనేజర్ కొడుకు హీరోగా ఎంట్రీ

టాలీవుడ్ నుంచి హీరోల వారసులే కాకుండా, వారి వెన్నంటి ఉండే సన్నిహితుల కుటుంబాల నుంచి కూడా కొత్త టాలెంట్ వస్తుంటుంది. తాజాగా రామ్ చరణ్ డేట్స్, ఇతర సినిమా వ్యవహారాలను దశాబ్ద కాలంగా చూసుకుంటున్న ఆయన మేనేజర్ ప్రవీణ్ కుమారుడు దృషిక్ హీరోగా పరిచయం కాబోతున్నాడు. దృషిక్ చిన్నప్పటి నుంచే నటనపై ఆసక్తితో లండన్‌లోని ఒక ప్రముఖ యాక్టింగ్ స్కూల్‌లో శిక్షణ పొందినట్లు తెలుస్తుంది. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత ఆయన ఇప్పుడు ఒక క్రేజీ ప్రాజెక్ట్ ద్వారా వెండితెరకు పరిచయం కాబోతున్నారు. బ్లాక్‌బస్టర్ హిట్ సిరీస్ అయిన 'మ్యాడ్' ఫ్రాంచైజీలో రాబోతున్న 'మ్యాడ్ 3' చిత్రంలో దృషిక్ ఒక హీరోగా ఎంపికైనట్లు తెలుస్తోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న ఈ యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్‌లో దృషిక్‌కి అవకాశం రావడం విశేషం. రామ్ చరణ్‌కు అత్యంత సన్నిహితుడైన ప్రవీణ్ కుమారుడు కావడంతో, ఈ కుర్రాడికి మెగా ఫ్యామిలీ మద్దతు కూడా ఉండవచ్చని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. నటనతో పాటు డ్యాన్స్, ఫిట్‌నెస్‌లో కూడా దృషిక్ ఇప్పటికే మంచి పట్టు సాధించినట్లు సమాచారం.



# మిరాకిల్ షూట్‌లో ఎంటర్ కానున్న హెబ్బా పటేల్

టాలీవుడ్ హాట్ బ్యూటీ హెబ్బా పటేల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మిరాకిల్'. 'సత్య గ్యాంగ్', 'రౌటర్ శివ' వంటి చిత్రాలతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న ప్రభాస్ నిమ్మల ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే రెండు షెడ్యూల్స్ పూర్తి చేసుకున్న ఈ సినిమా, మూడో షెడ్యూల్‌ను ఈనెల 24 నుంచి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ప్రారంభించనుంది. ఈ షెడ్యూల్‌లో హెబ్బా పటేల్ షూటింగ్‌లో పాల్గొనబోతున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. సైదా ఫ్యామిలీ ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్‌పై రమేష్ ఎగ్గిడి, శ్రీకాంత్ మొగదాసు, చందర్ గౌడ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రణధీర్ భీసు హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో సీనియర్ హీరోలు శ్రీరామ్, సురేష్ కీలక పాత్రలు పోషించడం విశేషం. ఈ చిత్రం ద్వారా నాయుడు పెండ్ర విలన్‌గా పరిచయమవుతున్నారు. గ్లామర్, యాక్షన్ కలగలిసిన ఈ చిత్రంలో సీనియర్ జర్నలిస్ట్ ధీరజ అప్పాజీ ఫోరెన్సిక్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. దర్శకుడు ప్రభాస్ నిమ్మల స్వయంగా కథ, మాటలు, స్క్రీన్ ప్లే అందించడమే కాకుండా సంగీతాన్ని కూడా సమకూర్చడం ఈ సినిమా ప్రత్యేకత. రవి బస్రూర్ వంటి దిగ్గజాల స్ఫూర్తితో రూపొందుతున్న యాక్షన్ బ్లాక్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని నిర్మాతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆమని, ఝాన్సీ, విజయ్ సూర్య వంటి భారీ తారాగణంతో రూపొందుతున్న ఈ 'మిరాకిల్' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి అద్భుతాలు సృష్టిస్తుందో చూడాలి.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**